
RNI TELTEL/2024/89620

# నేటి శుభోదయం

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక

ప్రచురణ : తెలంగాణ,ఆంధ్రప్రదేశ్, సంపుటి 02, సంచిక 318, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -12, శనివారం - 21 - ఫిబ్రవరి - 2026 , వెల రూ.5/-







## రాజ్యాంగం ఖూనీ అవుతుంటే రాహుల్ ఎందుకు స్పందించరు?




- ఈసీ నిద్రపోతున్నదా?.. కాంగ్రెస్ దౌర్జన్యం చేస్తుంటే ఏం చేస్తున్నది? క్యాతనపల్లిపై గవర్నర్ జోక్యం చేసుకోవాలి
- గాంధేయవాదిగా చెప్పుకొంటున్న మీనాక్షీ నటరాజన్ ఏం చేస్తున్నరు?
- చట్టం కాంగ్రెస్‌కు చుట్టం అన్నట్టుగా వ్యవహరిస్తే చూస్తూ ఊరుకోబోము
- రేవంత్ ప్రజామోదం కోల్పోయారు
- అందుకే పోలీసు లాఠీని నమ్ముకొని ప్రభుత్వాన్ని నడుపుతున్నరు

# త్వరలో మంత్రుల కమీషన్ల చిట్టా..

### మంత్రుల మెడలు వంచి ఆరు గ్యారంటీలు అమలయ్యేలా చేస్తాం

- ఒవైసీ కళ్లల్లో ఆనందం చూడటం కోసమే జీహెచ్ఎంసీని మూడు ముక్కలు
- 2029 నాటికి దేశంలో ఎక్కడా కాంగ్రెస్ పాలన ఉండదు
- ఐఏఎస్‌ల దందాలు బయటపెడతాం: బండి సంజయ్
- ఢిల్లీ పర్యటనలతో పాలన గాలికి... బీజేపీ చీఫ్ రాంచందర్‌రావు



హైదరాబాద్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) కాదని...అది తెలంగాణ కరప్షన్, కమీషన్, కలెక్షన్ కాంగ్రెస్ అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. వివిధ దర్యాప్తు సంస్థల అధికారులు రాష్ట్ర మంత్రుల అవినీతిపై ఆధారాలు సేకరిస్తున్నారని, మంత్రుల అవినీతికి కొందరు ఐఏఎస్ అధికారులే మధ్యవర్తులుగా ఉన్నారని, అతి త్వరలో మంత్రుల కమీషన్ల చిట్టాతోపాటు ఐఏఎస్ అధికారుల దందాలన్నీ బయటపెడతామని సంజయ్ హెచ్చరించారు. గురువారం రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, బండి సంజయ్ సమక్షంలో కరీంనగర్ 10వ డివిజన్ ఇండిపెండెంట్ కార్పొరేటర్ సొగాని కొమరయ్య పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ 2029 నాటికి దేశంలోని ఏ రాష్ట్రంలోనూ కాంగ్రెస్ పాలన మిగతా..4లో

## రాజ్యసభ అభ్యర్థులపై త్వరలో స్పష్టత



న్యూఢిల్లీ: తెలంగాణలో ఖాళీ కానున్న రెండు రాజ్యసభ స్థానాలకు పార్టీ అభ్యర్థుల ఎంపికపై అధిష్టానం వద్ద చర్చ జరిగిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. రెండు, మూడురోజుల్లో తనతో పాటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మరోసారి చర్చిస్తామని హైకమాండ్ చెప్పిందన్నారు. గురువారం ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో జరిగిన నేతల భేటీ అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. మంత్రివర్గ విస్తరణపై చర్చ జరగలేదని, దీనిపై సీఎం హైకమాండ్‌తో మాట్లాడతారని మహేశ్‌గౌడ్ చెప్పారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని త్వరలోనే ఢిల్లీకి పిలిపించి మాట్లాడతామని ఏఐసీసీ చెప్పిందన్నారు. అన్ని అంశాలపై రాహుల్ ఆరా: ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల విధి విధానాలను, రాష్ట్రానికి సంబంధించి రాజకీయంగా, ప్రభుత్వ పరమైన అన్ని అంశాలపై రాహుల్ గాంధీ ఆరా తీశారని చెప్పారు. మున్సిపల్ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించినందుకు హైకమాండ్ అభినందించిందని చెప్పారు. రాష్ట్ర మంత్రుల అభిప్రాయాలను పార్టీ పెద్దలు విన్నారని, అన్ని అంశాలపై తమకు దిశానిర్దేశం చేశారని తెలిపారు. తమ ప్రభుత్వానికి ఇంకా మూడేళ్ల సమయం ఉందని, హామీలన్నీ అమలు చేసి, శభాష్ అనిపించుకుని, మళ్లీ అధికారంలోకి వస్తామని మహేశ్‌గౌడ్ ఈ సందర్భంగా ధీమా వ్యక్తం చేశారు.

# ఉప్పాడ మత్స్యకారుల అభ్యున్నతికి ప్రణాళిక సిద్ధం

### పిఠాపురం పర్యటనలో ప్రకటిస్తా



- ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వెల్లడి
- ఆర్‌అండ్‌బీలో కొత్తగా హిందూపురం డివిజన్ ఏర్పాటు
- ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

అమరావతి: 'ఉప్పాడ తీరప్రాంత మత్స్యకారుల సర్వతోముఖాభివృద్ధి లక్ష్యంగా అన్ని శాఖల సమన్వయంతో సమగ్ర ప్రణాళిక రూపొందించాం. త్వరలో పిఠాపురం పర్యటనలో ఈ ప్రణాళికను ప్రకటించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. నిర్దిష్ట లక్ష్యంతో రూపొందించిన ఈ ప్రణాళిక ఉప్పాడ తీరప్రాంత మత్స్యకారుల జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపుతుందని ఆశిస్తున్నా' అని రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. ఆయన ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. 'గత ఏడాది అక్టోబరు 9న కాకినాడ కలెక్టరేట్‌లో మిగతా..4లో

# రూ.488 కోట్లతో మరో భారీ ట్రంపెట్!

### బుద్వేల్ వద్ద ఔటర్‌కు అనుసంధానం

### అంతర్జాతీయ హంగులతో నిర్మించనున్న ట్రంపెట్ ఇంటర్‌ఛేంజ్



హైదరాబాద్: అవుటర్ రింగ్ రోడ్డుపై మరో భారీ ట్రంపెట్ ఇంటర్ ఛేంజ్‌కు ప్రణాళిక సిద్ధమవుతోంది. టెండర్లు పిలిచేందుకు హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) కార్యాచరణ షురూ చేసింది. రాజేంద్రనగర్ పరిధి హిమాయత్‌నగర్ చెంత బుద్వేల్ వద్ద హెచ్ఎండీఏ భారీ లేఅవుట్ అభివృద్ధి చేస్తోంది. ఈ భూమిని రెండేళ్లక్రితం వేలం ద్వారా విక్రయించింది. ఇక్కడినుంచి అవుటర్‌కు తొలుత డబుల్ డెక్కర్ ఇంటర్‌ఛేంజ్ కోసం పనులు ప్రారంభించారు. కొంత వరకు పనులు కూడా చేపట్టారు. తాజాగా భారీ ట్రంపెట్ ఇంటర్ ఛేంజ్‌గా మార్పులు చేశారు. శంషాబాద్ ఓఆర్ఆర్ ఎగ్జిట్-17 నుంచి పరిగి ఆర్ఆర్ఆర్ వరకు సుమారు 55 కిలోమీటర్ల పొడవుతో రేడియల్ రోడ్డు-2 నిర్మాణం కోసం హెచ్ఎండీఏ ప్రణాళిక సిద్ధం చేస్తోంది. దీన్ని రాజేంద్రనగర్, శంషాబాద్, బుద్వేల్ నుంచి వాహనాలు వెళ్లేలా అనుసంధానం చేసేందుకు భారీ ట్రంపెట్ ఇంటర్‌ఛేంజ్‌ను నిర్మించనున్నారు. ఈ ఇంటర్‌ఛేంజ్ ద్వారా రేడియల్ రోడ్డు-2, ఓఆర్ఆర్-గచ్చిబౌలి, ఓఆర్ఆర్-శంషాబాద్-విమానాశ్రయం, బుద్వేల్ మధ్య ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా మార్గం సుగమం చేస్తుంది. ఈ ప్రాజెక్టు మొత్తం అంచనా వ్యయం రూ.488 కోట్లు.




## త్వరలో 'ఎస్ఐఆర్'... తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా పలు రాష్ట్రాలకు ఈసీ లేఖ

- బీహార్‌లో ఇప్పటికే పూర్తయిన 'ఎస్ఐఆర్' ప్రక్రియ
- ఎస్ఐఆర్ ప్రక్రియ కోసం సన్నాహకాలను త్వరగా పూర్తి చేయాలన్న ఈసీ
- రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్లకు ఈసీ లేఖ

## తమిళ రాజకీయాల్లో బిగ్ ట్విస్ట్: స్టాలిన్ కూటమిలోకి 'కెప్టెన్' పార్టీ!




- డీఎంకే, డీఎండీకే మధ్య పొత్తు ఖరారు
- సీఎం స్టాలిన్‌తో ప్రేమలత విజయకాంత్ భేటీ
- అన్నాడీఎంకేకు షాకిస్తూ కీలక రాజకీయ పరిణామం
- డీఎండీకేకు 7 అసెంబ్లీ, ఒక రాజ్యసభ సీటు ఆఫర్
- కెప్టెన్ ఉన్నప్పుడే ఈ పొత్తు కుదరాల్సిందన్న ప్రేమలత

## తండ్రి పేరు అక్కర్లేదు.. బిడ్డకు తల్లే సర్వస్వం

### ఒంటరి తల్లుల హక్కులపై బాంబే హైకోర్టు చారిత్రాత్మక తీర్పు




- బిడ్డ గుర్తింపునకు తండ్రి పేరు తప్పనిసరి కాదన్న బాంబే హైకోర్టు
- అత్యాచార బాధితురాలి బిడ్డ స్కూల్ రికార్డుల నుంచి తండ్రి పేరు తొలగించాలని ఆదేశం

## సర్పంచ్‌లకు ఏపీ సర్కార్ గుడ్ న్యూస్.. నిధుల వినియోగానికి గ్రీన్ సిగ్నల్




- 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగానికి అనుమతిస్తూ ఉత్తర్వులు
- జనవరి 5 నాటి తీర్మానాల మేరకు నిధులు వాడుకోవాలని సూచన
- వేగవంతం కానున్న పంచాయతీల్లో పెండింగ్ బిల్లుల చెల్లింపులు



## కల్తీని వదిలేసి హెరిటేజ్‌పై

# బురద జల్లడమేంటి

- పాలు లేకుండా నెయ్యి తీసే టెక్నాలజీ తాడేపల్లి ప్యాలెస్‌లో ఉందేమో!
- టీటీడీ నెయ్యి సరఫరాపై జగన్ ఆరోపణలకు మంత్రి అనిత కౌంటర్
- హెరిటేజ్‌కు, ఇందాపూర్ కంపెనీకి ఎలాంటి సంబంధం లేదని స్పష్టీకరణ
- సాక్షి పేపర్, భారతీ సిమెంట్ ధరలు పెరిగిన విషయాన్ని గుర్తుచేసిన అనిత
- వైవీ సుబ్బారెడ్డి హయాంలోనే నెయ్యి కల్తీ జరిగిందని తీవ్ర ఆరోపణలు

అమరావతి: తిరుమల తిరుపతి దేవస్థానానికి (టీటీడీ) నెయ్యి సరఫరా అంశంలో వైసీపీ అధినేత జగన్ ఇవాళ మీడియా సమావేశంలో చేసిన ఆరోపణలపై ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అసలు సమస్య అయిన కల్తీని పక్కనపెట్టి, సంబంధం లేని హెరిటేజ్ సంస్థపై జగన్ బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆమె మండిపడ్డారు. గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె, జగన్ వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చారు. మిగతా..4లో

# 2 లక్షల మందికి ఉద్యోగాలు

### యూనివర్సిటీలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అధ్యాపక పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

- ఉగాదికి జాబ్ క్యాలెండర్
- గ్రౌండింగ్ అయిన పరిశ్రమల నుంచి ఈ ఏడాది 2 లక్షల మందికి ఉద్యోగాలు
- వివిధ అంశాలపై సమీక్ష సందర్భంగా విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్
- ఉపాధి కల్పనపై సమీక్షిస్తున్న మంత్రి లోకేశ్



అమరావతి: రాబోయే ఉగాదికి జాబ్ క్యాలెండర్ విడుదల చేయనున్నట్లు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. ఇందులో రాష్ట్రంలోని యూనివర్సిటీలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అధ్యాపక పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ కూడా ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థుల ఆత్మహత్యలు, మానసిక ఒత్తిడి నివారణకు సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా కోచింగ్ సెంటర్ల నియంత్రణ రూపకల్పనపై ప్రజాభిప్రాయాన్ని తీసుకోవాలని సూచించారు. ఉండవల్లి నివాసంలో అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటుకు ముందుకొచ్చిన విదేశీ యూనివర్సిటీలకు ప్రోత్సాహకాలు, విధివిధానాలపై చర్చించారు. మిగతా..2లో

## సర్పంచ్‌లకు ఏపీ సర్కార్ గుడ్ న్యూస్..
# నిధుల వినియోగానికి గ్రీన్ సిగ్నల్

అమరావతి: రాష్ట్రంలోని గ్రామ పంచాయతీ సర్పంచ్‌లకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగానికి అనుమతి ఇస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారికంగా ఆదేశాలు ఇచ్చింది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న బిల్లుల చెల్లింపు ప్రక్రియ వేగవంతం కానుంది. జనవరి 5వ తేదీన గ్రామ పంచాయతీలు చేసిన తీర్మానాల ఆధారంగా ఈ నిధులను వినియోగించుకోవాలని ప్రభుత్వం తన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ఇప్పటికే పూర్తి చేసిన పనులకు సంబంధించిన వివరాలను మెజర్‌మెంట్ పుస్తకాలలో నమోదు చేసి ఉంటే, ఆ బిల్లులను చెల్లించవచ్చని తెలిపింది. గ్రామాల్లో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు చాలాకాలంగా పెండింగ్‌లో ఉండటంతో సర్పంచ్‌లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో, 15వ ఆర్థిక సంఘం నిధులను వాడుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడం వారికి ఊరట కలిగించే అంశం. ఈ నిర్ణయంతో పంచాయతీల్లో నిలిచిపోయిన చెల్లింపులకు మార్గం సుగమం అయినట్లయింది.

## రాజ్యాంగం ఖూనీ అవుతుంటే
# రాహుల్ ఎందుకు స్పందించరు?

ఆదిలాబాద్: క్యాతనపల్లి ఘటనపై గవర్నర్ జోక్యం చేసుకొని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని మాజీ మంత్రి హరీశ్‌రావు విజ్ఞప్తి చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. క్యాతనపల్లి, జనగామలో మహిళా కౌన్సిలర్లపై కాంగ్రెస్ కౌన్సిలర్లు దుర్మార్గంగా వ్యవహరిస్తుంటే లైవ్‌లో చూస్తున్న ఎన్నికల కమిషన్ ఏం చేస్తున్నది? నిద్రపోతున్నదా అని ప్రశ్నించారు. ఈసీ విధులు సరిగా నిర్వహించకపోతే ఎన్నికలు పెట్టి ఏం ప్రయోజనం? అని మండిపడ్డారు. ఈ ఘటనలపై గవర్నర్ సమగ్ర నివేదిక తెప్పించుకొని ఎన్నికల్లో రా జ్యాంగబద్ధంగా వ్యవహరించని అధికారులపై, ఎన్నికల కమిషన్‌పై రివ్యూ చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీకి వినాశకాలం దాపురించిందని, తగిన మూల్యం చేయించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

ప్రజాతీర్పును కాలరాసి కాంగ్రెస్ అరాచకం

రాష్ట్రంలో పట్టపగలు ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుంటే చరఖా తిప్పుతూ గాంధేయవాదిగా చెప్పుకొనే రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మీనాక్షీ నటరాజన్ ఎందుకు స్పందించడం లేదని హరీశ్‌రావు సూటిగా ప్రశ్నించారు. ఇప్పుడు మీ గాంధేయవాదం ఏమైందని మండిపడ్డారు. ఓటరు తీర్పును కాదని పోలీసు లాఠీని నమ్ముకొని కాంగ్రెస్ నాయకులు రాజ్యాంగాన్ని నడిపిస్తుంటే చేతిలో రాజ్యాంగం పట్టుకొని తిరిగే రాహుల్‌గాంధీ ఎందుకు స్పందించరని ప్రశ్నించారు. ఇప్పుడు మీ రాజ్యాంగం ఏమైందని ఆగ్రహం వ్యక్తంచేశారు. క్యాతనపల్లి ప్రజలు 14 స్థానాల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపించి, కాంగ్రెస్‌ను కేవలం 7 స్థానాలకు పరిమితం చేసినా మంత్రి వివేక్ ప్రజాతీర్పును కాలరాసి రాజకీయం చేస్తుంటే ఎన్నికల ప్రక్రియ ఎందుకు జరుపుతున్నారంటూ నిప్పులు చెరిగారు.

నాయకులను భయపెట్టేందుకే పోలీసు కవాతు

బీఆర్‌ఎస్ కౌన్సిలర్లను బెదిరించేందుకు పోలీసు కవాతు నిర్వహించారని హరీశ్‌రావు విమర్శించారు. ఎక్కడైనా ప్రజల్లో విశ్వాసం పెంపొందించేందుకు పోలీసు కవాతు చేస్తారని జనగామ, ఇబ్రహీంపట్నం, ఆమనగల్లు, తొర్రూరు, క్యాతనపల్లిలో మాత్రం బీఆర్‌ఎస్ నాయకులను భయపెట్టి.. ప్రజాస్వామాన్ని ఖూనీ చేస్తూ దొడ్డిదారిన పదవులు దక్కించుకుంటున్నారని ధ్వజమెత్తారు. ఇబ్రహీంపట్నంలో బీఆర్‌ఎస్‌కు మెజారిటీ ఉన్నా కాంగ్రెస్ నాయకులు గొడవ చే సి ఎన్నిక వాయిదా వేయించారని, జనగామలో బీఆర్‌ఎస్ కౌన్సిలర్ చేయి ఎత్తితే లోపల ఉన్న కాంగ్రెస్ కౌన్సిలర్లు చేతిని లాగారని, ఇదంతా యూ ట్యూబ్‌లో లైవ్‌లో చూస్తున్న ఎన్నికల కమిషన్ ఏం చేస్తున్నదని ప్రశ్నించారు. వరంగల్ కార్పొరేషన్‌లో ఓటు నమోదు చేసుకొన్న అక్కడి ఎంపీ, తొర్రూరులో ఓటు ఎలా నమోదు చేసుకుంటారని ప్రశ్నించారు.

ప్రజాతీర్పును కాలరాస్తే తిరుగుబాటు తప్పదు

ప్రజాస్వామ్యంలో ప్రజాతీర్పును ఏ నాయకుడైనా శిరసా వహించాలని లేకపోతే తిరుగుబాటు తప్పదని హరీశ్‌రావు స్పష్టంచేశారు. క్యాతనపల్లిలో ప్రజల తీర్పును కాలరాసే విధంగా కాంగ్రెస్ కౌన్సిలర్లు వ్యవహరించారని దుయ్యబట్టారు. కౌన్సిల్ వాయిదా వేయవద్దని ఎన్నికలు జరుపాలని కోరినా వినకుండా మంత్రి వివేక్ కనుసన్నల్లో అధికారులు చైర్మన్ ఎన్నిక వాయిదా వేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను కౌన్సిల్ హాల్‌లోకి అనుమతించని పోలీసులు, మంత్రి వివేక్ కాన్వాయ్‌ను ఎలా పంపించారని ప్రశ్నించారు. దీనిని ప్రశ్నిస్తే కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్ నాయకులపై రాళ్లతో దాడి చేశారని, అన్యాయంగా బాల్క సుమన్, మూల రాజిరెడ్డి, అనిల్, లక్ష్మీకాంత్‌పై కేసులు పెట్టారని మండిపడ్డారు. రామగుండం, లక్షెట్టిపేట, ఆసిఫాబాద్‌లో జైళ్లు ఉన్నా పోలీసులు కావాలని 200 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆదిలాబాద్ జైలుకు తరలించారని విమర్శించారు.


# త్వరలో 'ఎస్ఐఆర్'... తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా పలు రాష్ట్రాలకు ఈసీ లేఖ

హైదరాబాద్/అమరావతి: ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)కు సిద్ధంగా ఉండాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా 22 రాష్ట్రాలకు కేంద్ర ఎన్నికల సంఘం లేఖ రాసింది. బీహార్, పశ్చిమ బెంగాల్ సహా పలు రాష్ట్రాల్లో అమలు చేసిన 'ఎస్ఐఆర్' ప్రక్రియను దేశవ్యాప్తంగా చేపట్టేందుకు ఈసీ కసరత్తు చేస్తోంది. వీటికి సంబంధించిన సన్నాహకాలను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని 22 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఈసీ సూచించింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, చండీగఢ్, దాద్రా నగర్ హవేలీ, డామన్ దయ్యూ, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, జమ్ము కశ్మీర్, జార్ఖండ్, కర్ణాటక, లడఖ్, మహారాష్ట్ర, మణిపూర్, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, ఢిల్లీ, ఒడిశా, పంజాబ్, సిక్కిం, త్రిపుర, ఉత్తరాఖండ్ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్లకు ఎన్నికల సంఘం లేఖ రాసింది. ఏప్రిల్ నుంచి ఈ ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశముంది. దేశవ్యాప్తంగా 'ఎస్ఐఆర్' ప్రక్రియను చేపట్టాలని గత ఏడాది జూన్ నెలలో నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా బీహార్‌లో ఈ ప్రక్రియ పూర్తయింది. తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో ప్రక్రియ కొనసాగుతోంది. అసోంలో మాత్రం 'ఎస్ఐఆర్'కు బదులు ప్రత్యేక సవరణ పేరుతో ఓటరు జాబితా సవరణను పూర్తి చేశారు.

## తమిళ రాజకీయాల్లో బిగ్ ట్విస్ట్
# స్టాలిన్ కూటమిలోకి 'కెప్టెన్' పార్టీ!

తమిళనాడు: తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికల సమీకరణాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. ఇన్నాళ్లూ ప్రత్యర్థులుగా ఉన్న అధికార డీఎంకే, ప్రతిపక్ష డీఎండీకే పార్టీల మధ్య పొత్తు ఖరారైంది. గురువారం చెన్నైలోని ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ నివాసంలో డీఎండీకే అధినేత్రి ప్రేమలత విజయకాంత్ ఆయనతో సమావేశమయ్యారు. ఈ భేటీ తర్వాత ఇరు పార్టీలు కలిసి పనిచేయనున్నట్లు అధికారికంగా ప్రకటించాయి. ఈ సందర్భంగా ప్రేమలత మాట్లాడుతూ... "ద్రావిడ మోడల్ పాలన కొనసాగేందుకు, రాష్ట్ర అభివృద్ధి కోసం కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నాం" అని తెలిపారు. తన భర్త, కెప్టెన్ విజయకాంత్ జీవించి ఉన్నప్పుడే (2016లోనే) ఈ కూటమి ఏర్పడాల్సిందని, పదేళ్ల తర్వాత ఇప్పుడు అది సాధ్యమైందని ఆమె కొంత భావోద్వేగంగా వ్యాఖ్యానించారు. తమ కూటమి 200కు పైగా స్థానాల్లో గెలుపొందడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. గతంలో 2011 నుంచి అన్నాడీఎంకే మిత్రపక్షంగా కొనసాగిన డీఎండీకే, ఇప్పుడు అనూహ్యంగా డీఎంకే వైపు మొగ్గుచూపడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఉత్తర, మధ్య తమిళనాడులోని కడలూరు, విల్లుపురం వంటి జిల్లాల్లో డీఎండీకేకు చెప్పుకోదగ్గ ఓటు బ్యాంకు ఉంది. ఈ పరిణామంపై అన్నాడీఎంకే నేతలు తీవ్రంగా స్పందించారు. ప్రేమలత నిర్ణయాన్ని విజయకాంత్ ఆత్మ క్షమించదని విమర్శించారు. తాజా సమాచారం ప్రకారం, పొత్తులో భాగంగా డీఎండీకేకు 7 అసెంబ్లీ స్థానాలతో పాటు ఒక రాజ్యసభ సీటును కేటాయించేందుకు డీఎంకే అంగీకరించింది. మార్చి 5తో రాజ్యసభ నామినేషన్ల గడువు ముగియనున్న నేపథ్యంలో ఈ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని ఇరు పార్టీలు భావిస్తున్నాయి.

# తండ్రి పేరు అక్కర్లేదు.. బిడ్డకు తల్లే సర్వస్వం



ఢిల్లీ: సమాజంలో పాతుకుపోయిన పితృస్వామ్య విధానాలకు చరమగీతం పాడుతూ బాంబే హైకోర్టు ఒక చారిత్రాత్మక తీర్పును వెలువరించింది. బిడ్డ గుర్తింపునకు తండ్రి పేరు తప్పనిసరి కాదని, తల్లి పేరు, కులంతోనే అన్ని హక్కులు వర్తిస్తాయని స్పష్టం చేసింది. అత్యాచారం వల్ల జన్మించిన 12 ఏళ్ల బాలిక స్కూల్ రికార్డుల నుంచి ఆమె తండ్రి పేరును పూర్తిగా తొలగించాలని ఆదేశించింది. మహారాష్ట్రలోని బీడ్ జిల్లాకు చెందిన ఒక మహిళ తన 12 ఏళ్ల కుమార్తె తరఫున హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తనపై జరిగిన అత్యాచారం వల్లే పాప జన్మించిందని, ఆ తర్వాత నిందితుడు 2022లో జరిగిన ఒక సెటిల్మెంట్‌లో బిడ్డతో తనకు ఎలాంటి సంబంధం లేదని రాసిచ్చాడని ఆమె పేర్కొన్నారు. అయినప్పటికీ, స్కూల్ రికార్డుల్లో తండ్రి పేరు, ఆయన కులం (మరాఠా) ఉండటం వల్ల తన కుమార్తె సామాజికంగా ఇబ్బందులు పడుతోందని తెలిపారు. తన కుమార్తెకు తన కులమైన 'మహర్' (ఎస్సీ)ని వర్తింపజేయాలని కోరారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ఒంటరి తల్లిని బిడ్డకు పూర్తిస్థాయి సంరక్షకురాలిగా గుర్తించడం రాజ్యాంగం కల్పించిన హక్కు అని, అది దయతో చేసే పని కాదని స్పష్టం చేసింది. బాధ్యతలేని తండ్రి కులాన్ని బిడ్డ మోయాల్సిన అవసరం లేదని, తల్లి సామాజిక హోదానే బిడ్డకు వర్తిస్తుందని తేల్చిచెప్పింది. స్కూల్ నిబంధనల పేరుతో ఈ మార్పులు చేయలేమని విద్యాశాఖ అధికారులు చెప్పడాన్ని కోర్టు తోసిపుచ్చింది. గతంలో సుప్రీంకోర్టు కూడా పాస్‌పోర్ట్, జనన ధ్రువీకరణ పత్రాల విషయంలో తండ్రి పేరు లేకుండా తల్లి అనుమతితోనే జారీ చేయవచ్చని తీర్పు ఇచ్చింది. ఇప్పుడు బాంబే హైకోర్టు కులం విషయంలోనూ స్పష్టత ఇవ్వడం దేశవ్యాప్తంగా ఉన్న ఒంటరి తల్లులకు గొప్ప ఊరటనిచ్చింది.

# త్వరలో మంత్రుల కమీషన్ల చిట్టా..

మొదటి పేజి తరువాయి

2029 నాటికి దేశంలోని ఏ రాష్ట్రంలోనూ కాంగ్రెస్ పాలన ఉండదన్నారు. మంత్రి పదవులను అడ్డుపెట్టుకుని బరితెగించి రాష్ట్రంలో బీజేపీని అడ్డుకోవాలని చూస్తే వారి సంగతి చూస్తామన్నారు. మంత్రుల మెడలు వంచి ఆరు గ్యారంటీలు అమలయ్యేలా చేస్తామన్నారు. తెలంగాణకు చేసిందేమిటో చెప్పాలని సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. ఒవైసీ కళ్లల్లో ఆనందం చూడటం కోసమే జీహెచ్‌ఎంసీని మూడు ముక్కలు చేశారన్నారు. కరీంనగర్ స్ఫూర్తితో జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లోనూ కాషాయ జెండాను ఎగరేస్తామన్నారు.

ఢిల్లీ పర్యటనలతో పాలన గాలికి... బీజేపీ చీఫ్ రాంచందర్‌రావు

ఢిల్లీ పర్యటనలు, చిట్ చాట్‌లతో పబ్బం గడుపుతూ సీఎం రేవంత్ రెడ్డి పరిపాలన గాలికి వదిలేసారని బీజేపీ చీఫ్ రాంచందర్‌రావు విమర్శించారు.ఎన్నికలు రాగానే అమలు కాని హామీలిచ్చి ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందన్నారు. విద్యాశాఖను స్వయంగా సీఎం చూస్తున్నా ఎలాంటి మార్పు లేదని, గత ప్రభుత్వం రెసిడెన్షియల్ స్కూళ్ల పేరుతో విద్యావ్యవస్థను భ్రష్టు పట్టిస్తే రేవంత్ ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ అంటూ డ్రామాలు ఆడుతూ విద్యా వ్యవస్థను గాలికి వదిలేసిందన్నారు. కరీంనగర్ మేయర్ పీఠాన్ని కైవసం చేసుకోవడమంటే భవిష్యత్ తెలంగాణ బీజేపీదేనని అర్థం చేసుకోవాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అనేకమంది మేధావులు త్వరలో పార్టీలో చేరేందుకు తనతో సంప్రదింపులు జరుపుతున్నారని రాంచందర్‌రావు తెలిపారు.

## కల్తీని వదిలేసి హెరిటేజ్‌పై
# బురద జల్లడమేంటి

మొదటి పేజి తరువాయి

జగన్ ఆరోపిస్తున్నట్లుగా హెరిటేజ్‌కు, ఇందాపూర్ కంపెనీకి ఎలాంటి యాజమాన్య సంబంధం లేదని అనిత స్పష్టం చేశారు. ఇందాపూర్ అనేది బల్క్ మార్కెటింగ్ చేసే సంస్థ అని, అది చీజ్, పన్నీర్, టెట్రాప్యాక్ పాలు వంటి ఉత్పత్తులను తయారు చేసి హెరిటేజ్ వంటి కంపెనీలకు విక్రయిస్తుందని వివరించారు. హెరిటేజ్ సంస్థ నేరుగా వినియోగదారులకు మాత్రమే నెయ్యిని విక్రయిస్తుందని, ఎన్నడూ బల్క్‌గా ట్యాంకర్ల ద్వారా ఇతర కంపెనీలకు సరఫరా చేయలేదని తెలిపారు. "హెరిటేజ్ నుంచి ఇందాపూర్‌కు నెయ్యి వెళ్లి, అక్కడి నుంచి టీటీడీకి వస్తుందని చెప్పడానికి కనీసం బుర్ర పనిచేస్తుందా?" అని ఆమె ఎద్దేవా చేశారు. హెరిటేజ్ సంస్థ తన సిద్ధాంతాల ప్రకారం దేవాలయాలకు బల్క్‌గా సరఫరా చేయదని, ఈ విషయం చిన్నపిల్లవాడిని అడిగినా చెబుతాడని అన్నారు. 2015లో రూ.280 ఉన్న నెయ్యి ధర, 2026 నాటికి రూ.650కి ఎందుకు పెరిగిందని జగన్ ప్రశ్నించడాన్ని అనిత తప్పుబట్టారు. కాలంతో పాటు ధరలు పెరగడం సహజమని, ఈ చిన్న లాజిక్‌ను జగన్ ఎలా విస్మరించారని ఆమె ప్రశ్నించారు. "మీరు సాక్షి పేపర్ ప్రారంభించినప్పుడు దాని ధర రూ.2, ఇప్పుడు రూ.6.50. భారతీ సిమెంట్ బస్తా ధర రూ.250 నుంచి రూ.450కి పెరిగింది. 2015లో రూ.19 ఉన్న పాల ప్యాకెట్ ఇప్పుడు రూ.40కి చేరింది. పాల ధర పెరిగితే నెయ్యి ధర పెరగదా? బహుశా పాలు లేకుండానే నెయ్యి తయారుచేసే టెక్నాలజీ మీ తాడేపల్లి ప్యాలెస్‌లో ఉందేమో" అని ఆమె వ్యంగ్యాస్త్రాలు సంధించారు. కర్ణాటకలో పాల ధరలు అధికంగా ఉండటం వల్లే నందిని డైరీ టీటీడీకి రూ.700కు నెయ్యి సరఫరా చేసిందని, ఆ విషయం గురించి జగన్ ఎందుకు మాట్లాడరని నిలదీశారు. అసలు సమస్య అయిన నెయ్యి కల్తీ గురించి మాట్లాడకుండా, జగన్ సంబంధం లేని హెరిటేజ్ అంశాన్ని తెరపైకి తెస్తున్నారని అనిత ఆరోపించారు. నెయ్యి కల్తీ జగన్ ప్రభుత్వ హయాంలో, ఆయన బాబాయి వైవీ సుబ్బారెడ్డి టీటీడీ ఛైర్మన్‌గా ఉన్నప్పుడే జరిగిందని అనిత తీవ్ర ఆరోపణలు చేశారు. "నెయ్యిలో రసాయనాలు కలిశాయని సిట్, ఎన్డీబీ రిపోర్టులు స్పష్టంగా తేల్చాయి. కల్తీ జరిగిందని నిర్ధారణ అయ్యాక కూడా అప్పటి మీ ప్రభుత్వం ఆ కంపెనీ టెండర్‌ను ఎందుకు రద్దు చేయలేదు? ఎందుకు ఆ సంస్థను బ్లాక్‌లిస్టులో పెట్టలేదు?" అని ఆమె సూటిగా ప్రశ్నించారు. కల్తీ జరిగిందని చార్జ్‌షీట్‌లో ఉన్నా, మీ బాబాయి స్వయంగా అంగీకరించినా దాని గురించి మాట్లాడకుండా, ముక్కు ఎక్కడ ఉందంటే చుట్టూ తిప్పి చూపినట్లు హెరిటేజ్ గురించి ఎందుకు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కేవలం తమకు నచ్చిన కంపెనీలకు లబ్ధి చేకూర్చేందుకే జగన్ ప్రభుత్వం టెండర్ నిబంధనలను నీరుగార్చిందని అనిత ఆరోపించారు. "ఒక చుక్క పాలు కూడా సేకరించని కంపెనీలు కూడా నెయ్యి సరఫరా చేసేలా నిబంధనలను మార్చారు. రూ.250 కోట్ల టర్నోవర్‌ను రూ.150 కోట్లకు తగ్గించారు. ఇవన్నీ ఎవరికోసం చేశారు? కల్తీపై చర్చకు మేము సిద్ధం. ఆధారాలు చూపించమన్నందుకే ప్రజలకు ఈ వాస్తవాలు వివరిస్తున్నాం. దమ్ముంటే కల్తీ గురించి మాట్లాడండి" అని జగన్‌కు ఆమె సవాల్ విసిరారు.

# ఉప్పాడ మత్స్యకారుల అభ్యున్నతికి ప్రణాళిక సిద్ధం

మొదటి పేజి తరువాయి

'గత ఏడాది అక్టోబరు 9న కాకినాడ కలెక్టరేట్‌లో మత్స్యకారులతో సమావేశమయ్యాం. వారు ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చిన ప్రతి సమస్యకూ పరిష్కార మార్గాలు అన్వేషించాం. తీర కాలుష్య నివారణ, కోత నివారణ, మత్స్య సంపద వృద్ధి, అధునాతన పద్ధతుల్లో వేట, మార్కెటింగ్ సదుపాయాలు, ప్రకృతి వైపరీత్యాల నుంచి రక్షణ వంటి అన్ని అంశాలనూ పరిగణనలోకి తీసుకుని ప్రణాళికలో పొందుపరిచాం' అని ఉప ముఖ్యమంత్రి వివరించారు. ఆ గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు మెరుగుపరచడంతో పాటు వ్యవసాయ అభివృద్ధి, ప్రత్యామ్నాయ ఉపాధి కల్పన తదితర అంశాలను పరిగణనలోకి తీసుకున్నామని ఆయన పేర్కొన్నారు.

ఆర్‌అండ్‌బీలో కొత్తగా హిందూపురం డివిజన్ ఏర్పాటు

ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

రోడ్లు, భవనాలశాఖ పరిధిలో శ్రీసత్యసాయి జిల్లాలో కొత్తగా హిందూపురం డివిజన్‌ను ఏర్పాటుచేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతం ధర్మవరం డివిజన్.. ధర్మవరం, కదిరి, పెనుకొండ, మడకశిర సబ్‌డివిజన్లతో 2,486.08 కి.మీ.మేర ఉంది. ఇకపై ధర్మవరం డివిజన్‌లోకి ధర్మవరం, కదిరి సబ్ డివిజన్లు మాత్రమే వస్తాయి. కొత్తగా ఏర్పాటు చేసిన హిందూపురం డివిజన్‌లోకి పెనుకొండ, మడకశిర సబ్‌డివిజన్లు కలిపి 1,336.22 కి.మీ. వస్తాయి. మరోవైపు అనంతపురం జిల్లాలోని కళ్యాణదుర్గం డివిజన్‌ను తొలగించి, అనంతపురం డివిజన్‌కు జతచేశారు. దీంతో కళ్యాణదుర్గం డివిజన్ ఈఈ పోస్టు, అక్కడి 24 మంది సిబ్బంది పోస్టులను కొత్తగా ఏర్పాటైన హిందూపురం డివిజన్‌కు మార్చారు

# 2 లక్షల మందికి ఉద్యోగాలు

మొదటి పేజి తరువాయి



ఈ సందర్భంగా మాట్లాడుతూ "రాష్ట్రానికి పెద్దఎత్తున పారిశ్రామిక పెట్టుబడులు వస్తున్న నేపథ్యంలో ఉపాధి కల్పనపై అధికార యంత్రాంగం దృష్టిసారించాలి. రాష్ట్రంలో గ్రౌండ్ అయిన పరిశ్రమల్లో ఈ ఏడాది 2 లక్షల ఉద్యోగాలు కల్పించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. దానికి అనుగుణంగా అధికారులు రోడ్‌మ్యాప్ రూపొందించాలి. రిలయన్స్ సీబీజీ, జూపిటర్, లారెన్స్ ఫార్మా, హెటెరో డ్రగ్స్‌తో పాటు రాష్ట్రంలో కొత్తగా వస్తున్న రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టులకు అవసరమైన నైపుణ్యాలను గుర్తించి యువతకు స్కిల్లింగ్, రీస్కిల్లింగ్ చేపట్టండి. ఇందుకు అవసరమైన కరికులం రూపకల్పనలో ఆయా రంగాల్లో పేరుగాంచిన పరిశ్రమల సలహాలను తీసుకోవాలి. ఇప్పటికే కొన్ని సంస్థలు నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను నెలకొల్పాయి. అదే తరహాలో ఐటీఐలకు అనుబంధంగా శిక్షణ కేంద్రాలు ఏర్పాటుచేయాలి. ప్రతి నియోజకవర్గ కేంద్రంలో మూడు నెలలకోసారి నిర్వహిస్తున్న జాబ్‌మేళాల ద్వారా యువతకు పెద్దఎత్తున ఉద్యోగాలు లభిస్తున్నాయి. కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్ల లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు పనిచేయాలి" అని సూచించారు.

త్వరలో నైపుణ్యం పోర్టల్ ప్రారంభం

త్వరలో నైపుణ్యం పోర్టల్ ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఈ సందర్భంగా మంత్రి ఆదేశించారు. దీనిపై అధికారులు స్పందిస్తూ... 'దీనికి ఇప్పటికే మాడ్యూల్స్ సిద్ధమయ్యాయి. 25 రంగాల డేటా ఇంటిగ్రేషన్ పూర్తయింది, వాటిలో 1,14,899 ఉద్యోగాలు ఉన్నాయి. ఇందులో 3,100 విదేశీ ఉద్యోగాలు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరొందిన 16 మంది రిక్రూటర్స్ కూడా సిద్ధంగా ఉన్నారు. ఇందులో ట్రయల్ బేసిస్‌లో ఇప్పటికే 20 వేల మందికి పైగా విద్యార్థులు, 60 వేల మంది జాబ్ సీకర్స్‌కు ఏఐ ఆధారిత ఇంటర్వ్యూలు నిర్వహించాం' అని అధికారులు తెలిపారు.

# ఇండియా టీచింగ్..వరల్డ్ లెర్నింగ్

## దేశీ ఎడ్‌టెక్ ఎక్స్‌పోర్ట్ స్టోరీ స్టార్ట్
## థాయ్, వియత్నాం టార్గెట్
## బెంగళూరు నుంచి బ్యాంకాక్ వరకు ఎడ్‌టెక్ దూకుడు
## యూఏఈ నుంచి ఇండోనేసియా వరకు మన కంపెనీల హవా
## క్యూలో అప్‌గ్రాడ్, సింప్లీలెర్న్, బ్రైట్‌చాన్స్
## అంతర్జాతీయ మార్కెట్ల నుంచి 25 శాతం వరకు ఆదాయం




దేశీ ఎడ్‌టెక్ కంపెనీలు అంతర్జాతీయంగా అవకాశాలను అందిపుచ్చుకునే క్రమంలో విదేశాల బాట పడుతున్నాయి. పశ్చిమాసియా, ఆగ్నేయాసియా దేశాలకు విద్యా వ్యాపారాన్ని దూకుడుగా విస్తరిస్తున్నాయి. అప్‌గ్రాడ్, సింప్లీలెర్న్, బ్రైట్‌చాన్స్ మొదలైనవి ఈ లిస్టులో ఉన్నాయి. మన ఎడ్‌టెక్ కంపెనీలు ప్రధానంగా ఆగ్నేయాసియా, దక్షిణాసియాపై దృష్టి పెడుతున్నాయి. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, సౌదీ అరేబియా, వియత్నాం, థాయ్‌ల్యాండ్, ఇండొనేసియా, ఫిలిప్పీన్స్‌లాంటి మార్కెట్లలో విస్తరిస్తున్నాయి. ఆయా మార్కెట్లలో వినియోగదారుల ప్రొఫైల్ దాదాపు మన దేశం తరహాలోనే ఉండటం ఇందుకు కారణమని పరిశ్రమ వర్గాలు తెలిపాయి.

థాయ్, వియత్నాంలో అప్‌గ్రాడ్: టీమ్‌లీజ్ గణాంకాల ప్రకారం ఆగ్నేయాసియా, ఆఫ్రికా తదితర మార్కెట్లలో 35 ఏళ్ల లోపు వయస్సు గల వారు 2 కోట్ల మంది పైగా ఉన్నారు. ఈ నేపథ్యంలోనే ఆయా ప్రాంతాలపై మన సంస్థలు దృష్టి పెడుతున్నాయి. బెంగళూరుకు చెందిన అప్‌గ్రాడ్ సంస్థ థాయ్‌ల్యాండ్, వియత్నాంలో కార్యకలాపాలు విస్తరించింది. అలాగే యూఏఈ, మేనా ప్రాంతంలో (మధ్యప్రాచ్యం, ఉత్తర ఆఫ్రికా) వర్క్‌ఫోర్స్ శిక్షణకు సంబంధించి వివిధ సంస్థలతో భాగస్వామ్యాలు కుదుర్చుకుంది. నైపుణ్యాల్లో శిక్షణనిచ్చే సింప్లీలెర్న్ కంపెనీ వివిధ సంస్థలు, ప్రభుత్వాల భాగస్వామ్యాలతో అమెరికా, బ్రిటన్, పశ్చిమాసియావ్యాప్తంగా కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఇక కిడ్స్ లెర్నింగ్ ప్లాట్‌ఫాం అయిన బ్రైట్‌ఛాంప్స్ సంస్థ ఏకంగా 30 పైగా దేశాల్లో విస్తరించింది. యూఏఈ, సౌదీ అరేబియా, వియత్నాం మొదలైనవి వీటిలో ఉన్నాయి.

ఆకర్షణీయంగా ఆగ్నేయాసియా: వియత్నాం, థాయ్‌ల్యాండ్ లాంటి ఆగ్నేయాసియా దేశాలు వేగంగా డిజిటల్ ఎకానమీలుగా వృద్ధి చెందుతున్నాయి. దీంతో కెరియర్ పురోగతికి సంబంధించిన కోర్సులను నేర్చుకోవడంపై పెరుగుతున్న ఆసక్తిని అవకాశంగా మల్చుకోవడంపై ఎడ్‌టెక్ కంపెనీలు దృష్టి పెడుతున్నాయి. 2024--25లో అప్‌గ్రాడ్ ఆదాయంలో అంతర్జాతీయ మార్కెట్ల వాటా 20--25 శాతంగా నమోదైంది. అటు సింప్లీలెర్న్ అంతర్జాతీయ యూజర్లలో 11 శాతం మంది బ్రిటన్, పశ్చిమాసియాలో ఉన్నారు. ఇక తమ గ్లోబల్ యూజర్లలో 30 శాతం మంది ఆగ్నేయాసియా, దక్షిణాసియా వారు ఉన్నారని బ్రైట్‌ఛాంప్స్ పేర్కొంది.

అంతర్జాతీయంగా పోటీ: మన కంపెనీలు ప్రపంచవ్యాప్తంగా ఎదుగుతున్నప్పటికీ అంతర్జాతీయ దిగ్గజాల నుంచి పోటీ ఎదుర్కొనాల్సి వస్తోంది. యుడెమి, ఎరుడైటస్, యుడాసిటీ, కోర్సెరాలాంటి గ్లోబల్ సంస్థలు కూడా ఈ ప్రాంతాల్లో దూకుడుగా విస్తరిస్తున్నాయి. తమకు విదేశీ మార్కెట్లలో కోర్సెరా, ఎరుడైటస్ నుంచి పోటీ ఉంటోందని అప్‌గ్రేడ్ వర్గాలు తెలిపాయి. పశ్చిమాసియాలో ఎమెరిటస్, కోర్సెరా, యుడాసిటీలను సింప్లీలెర్న్ ఢీకొంటోంది. మిగతా సంస్థలతో పోలిస్తే తక్కువ వ్యయాలతో, స్థానిక అవసరాలకు అనుగుణంగా, నాణ్యమైన శిక్షణ అందించడం ద్వారా దేశీ కంపెనీలు.. ఆయా మార్కెట్లలో పటిష్టపడేందుకు ప్రయతి?నస్తున్నాయి. లీడ్ గ్రూప్ ఈ ఏడాది 1,200 పాఠశాలలతో భాగస్వామ్యాలను లక్ష్యంగా పెట్టుకుంది.

# 'సేవా' కుటుంబం



కుటుంబం అంతా కలిసి పాల్గొనే సేవా కార్యక్రమాలు పిల్లల వ్యక్తిత్వాన్ని చక్కగా రూపుదిద్దటమే కాకుండా, వారిని బాధ్యత గల పౌరులుగా తీర్చి దిద్దుతాయని తాజా అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. అంతేకాదు, ఒక మంచి పని కోసం కుటుంబం అంతా కలిసికట్టుగా శ్రమించటం వల్ల, పిల్లలు పెరిగి పెద్దయ్యాక అవి తీపి జ్ఞాపకాలుగామిగిలిపోతాయని మనోవికాస నిపుణులు చెబుతున్నారు. ఇతరులకు సహాయం చేయడంలోని గొప్పతనం, ఔన్నత్యం 'వాలంటీరింగ్' ద్వారా పిల్లలకు అర్థం అవుతుంది. దీనివల్ల వారిలో జాలి, దయ, కరుణ, ఓర్పు, కృతజ్ఞతా భావం వంటి మంచి గుణాలు ఏర్పడతాయి. మనం చేసే చిన్న సాయమైనా ఒకరి జీవితంలో ఎంత పెద్ద మార్పును తీసుకురాగలదో పిల్లలు స్వయంగా తెలుసుకుంటారు.

### ఆత్మ విశ్వాసం పెరుగుతుంది

తల్లిదండ్రులు పిల్లల్ని తరచూ సేవా కార్యక్రమాలలో పాలుపంచుకోవటానికి తీసుకెళ్లటం వల్ల పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఇతరుల పట్ల ప్రేమతో మెలుగుతారు. నలుగురితో కలిసి పని చేయటం నేర్చుకుంటారు. సమస్యలను ఎదుర్కొనే నైపుణ్యాలను అలవరచుకుంటారు.

### కుటుంబ బంధం బలపడుతుంది

ఇంట్లో అందరూ కలిసి సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల, రోజూవారీ పనుల ఒత్తిడి లేకుండా కుటుంబ సభ్యులందరూ ఆహ్లాదకరమైన సమయాన్ని గడపవచ్చు. ఫోన్లకు, టీవీలకు లేదా ఇంటి పనులకే పరిమితం అయిపోకుండా.. ఒక మంచి లక్ష్యం కోసం అందరూ కలిసి పనిచేసినట్లవుతుంది. ఇది కుటుంబ సభ్యుల మధ్య అనుబంధాలను బలపరుస్తుంది.

### ఎలాంటి సేవల్ని ఎంచుకోవాలి?

పిల్లల వయసును బట్టి, వారికి ఆసక్తి ఉన్న పనులు ఎంచుకోవడం ముఖ్యం. చిన్న పిల్లలైతే చేతులతో చేసే చిన్న చిన్న పనులను ఇష్టపడతారు, అదే కొంచెం పెద్ద పిల్లలైతే బాధ్యత తీసుకునే పనులను లేదా నాయకత్వం వహించే పనులకు చొరవ చూపుతారు. ఏమైనా, అది వారికి సరదాగా అనిపించాలి. ఆ పని తప్పక చేయాలనే ఉత్సాహం వారిలో కలగాలి. పనుల ఎంపికకు ఇవే గీటురాళ్లు. నెలకు ఒక్కసారి.. కుదరకపోతే రెండునెలలకు ఒక్కసారైనా వాలంటీరింగ్ చేసినా చాలు, అది పిల్లల జీవితాల్లో గొప్ప మార్పు తెస్తుంది.

### నివేదికలు..అధ్యయనాలు

'పాయింట్స్ ఆఫ్ లైట్' అనే స్వచ్ఛంద సంస్థ ఏటా 'ఫ్యామిలీ వాలంటీర్ డే' ని నిర్వహిస్తుంది. కుటుంబంతో కలిసి సేవ చేయడం వల్ల పిల్లల్లో సహానుభూతి పెరుగుతుందని, సామాజిక బాధ్యత అలవడుతుందని వారి అధ్యయనాలు చెబుతున్నాయి. యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్ సర్వే ప్రకారం, స్వచ్ఛంద సేవల్లో పాల్గొనే పిల్లల్లో ఆందోళన, డిప్రెషన్ వంటి సమస్యలు 18 నుంచి 35 శాతం వరకు తక్కువగా ఉంటున్నాయి. ఇండియానా యూనివర్సిటీ జరిపిన సర్వేలో టీనేజర్లు, బాలలు సేవా కార్యక్రమాలలో పాల్గొనటం ద్వారా సమాజం తీరును గ్రహిస్తున్నారు. సానుకూల దృక్పథాన్ని ఏర్పరచుకుంటున్నారు. చిన్నప్పటి నుండి సేవ చేసే అలవాటు ఉన్న పిల్లలు, పెద్దయ్యాక కూడా సమాజానికి సేవ చేసే అవకాశం 50 శాతం ఎక్కువగా ఉంటుందని 'కార్పొరేషన్ ఫర్ నేషనల్ అండ్ కమ్యూనిటీ సర్వీస్' గణాంకాలు చెబుతున్నాయి.

# గ్రామదేవతల దీవెనలే దేశాభివృద్ధికి పునాది

## వైభవంగా పాత ముచ్చుమర్రిలో శ్రీ చౌదేశ్వరీదేవీ, శ్రీ మశమ్మ, శ్రీ గంగమ్మ నూతన ఆలయాల ప్రతిష్ట

### నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి



నంద్యాల, నేటి శుభోదయ ::: గ్రామదేవతల దీవెనలే దేశాభివృద్ధికి పునాది అని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. శుక్రవారం నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజకవర్గం పగిడ్యాల మండలం పాత ముచ్చుమర్రి గ్రామంలో బైరెడ్డి కుటుంబం ఆధ్వర్యంలో, వేద పండితులు తెలకపల్లి రఘురామ శర్మ పర్యవేక్షణలో వైభవంగా శ్రీ చౌదేశ్వరీదేవీ, శ్రీ మశమ్మ, శ్రీ గంగమ్మ అమ్మవార్ల నూతన ఆలయాలు, విగ్రహాల ప్రతిష్ట నిర్వహించారు. గ్రామ దేవతలకు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి, ఆమె భర్త డాక్టర్ శివచరణ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి, ఆయన భార్య బైరెడ్డి భారతమ్మ, బైరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, ఆయన భార్య బైరెడ్డి శ్రీలత, కూతురు బైరెడ్డి అనూషా రెడ్డి, కర్నూలు ఎంపీ బస్తిపాడు నాగరాజు తదితరులు విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ మా గ్రామం ముచ్చుమర్రి, నా నంద్యాల జిల్లా ప్రజలతో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని రాష్ట్ర ప్రజలు, భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలోని దేశ ప్రజలందరికీ గ్రామ దేవతల ఆశీస్సులు, దీవెనలు ఉండాలనీ ప్రత్యేక పూజలు చేశామన్నారు.



# తెలంగాణ అమరవీరుడు సిరిపురం యాదయ్య 16 వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులర్పించిన కాకి ఈశ్వర్ ముదిరాజ్




( నేటి శుభోదయ ప్రతినిధి మహేశ్వరం ఫిబ్రవరి 20:): రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ కేంద్రంలో పోలీస్ స్టేషన్ దగ్గర అంబేద్కర్ చౌరస్తా లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాకి ఈశ్వర్ ముదిరాజ్ గారి ఆధ్వర్యంలో తెలంగాణ అమరవీరుడు సిరిపురం యాదయ్య 16 వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాకి ఈశ్వర్ ముదిరాజ్. కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు బంగారుగళ్ల లాజర్. మహేశ్వరం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చాకలి యాదయ్య. డైరెక్టర్లు ఆల్లె బిక్షపతి. శివగంగ ఆలయ కమిటీ చైర్మన్ అల్లే కుమార్. మహేశ్వరం గ్రామ మాజీ ఉపసర్పంచులు. కర్రోల రాములు ముదిరాజ్. దోమ శ్రీనివాసరెడ్డి. బహుజన నాయకుడు కటికల శ్రీహరి ముదిరాజ్ .మహేశ్వరం ముస్లిం వెల్ఫేర్ సొసైటీ మండల అధ్యక్షులు షేక్ హాజీ బాబా. ఆలయ కమిటీ డైరెక్టర్లు ఏపూరి సాయిలు. కనిగట్ల శ్రీశైలం ముదిరాజ్. ఎండి తండా సర్పంచ్ ఆంగోత్ అరుణ గోపాల్ నాయక్. ఉప్పు గడ్డ తండా సర్పంచ్ రాజు నాయక్. మహేశ్వరం గ్రామ ఇందిరమ్మ కమిటీ సభ్యులు స్వర్ణగంటి సుభాష్. ఎండి తండా ఇందిరమ్మ కమిటీ సభ్యుడు నాగేందర్ నాయక్. సిరిగిరి పురం గ్రామ మాజీ ఎంపీటీసీలు. పాండు నాయక్. కొమురయ్య. సిరిగిరి పురం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు ఇంద్రకంటి వెంకటేష్ గౌడ్. ఎండి తండా గ్రామ శాఖ అధ్యక్షులు ఆంగోత్ దశరథ్ నాయక్ . కేసి తండా గ్రామ శాఖ అధ్యక్షులు రవి నాయక్. మహేశ్వరం గ్రామ యూత్ అధ్యక్షుడు స్వర్ణ గంటి ఆకాష్. కాంగ్రెస్ పార్టీ నాయకులు పుట్లగారి చందు.కాకి మల్లేష్ ముదిరాజ్. గుర్రం బిక్షపతి. గుర్రం బాలయ్య. దుంపల ప్రకాష్. ఏపూరి జంగయ్య. కూన వెంకటేష్. వద్ది నరేందర్. పీనమోని శ్రీకాంత్. తదితరులు పాల్గొన్నారు

# ఆర్ అండ్ బి ఉద్యోగుల టేబుల్ క్యాలెండర్ ఆవిష్కరణ




ఖమ్మం, నేటి శుభోదయ ::: ఖమ్మం నగరంలోని టీఎన్జీవో భవన్ నందు తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ ఆఫీసర్ (టీఎన్జీవోస్) యూనియన్ ఆర్ అండ్ బి ఉద్యోగుల ఫోరం 2026 నూతన సంవత్సర టేబుల్ క్యాలెండర్ ను ఖమ్మం జిల్లా టీఎన్జీవోస్ అధ్యక్ష, కార్యదర్శులు గుంటుపల్లి శ్రీనివాసరావు, కొణిదెన శ్రీనివాస్ లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టిఎన్జీవోస్ సెంట్రల్ కార్యదర్శి జడ్ ఎస్ జైపాల్, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు కే దుర్గాప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు యర్రా రమేష్, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు లలిత కుమారి, ఫోరం అధ్యక్షులు ఆర్ సూర్యనారాయణ, కార్యదర్శి జి నరసింహారావు, అసోసియేట్ అధ్యక్షులు ఎం.డి . ఖాజా మియా, కోశాధికారి వి .ప్రకాష్, సిహెచ్ ఈశ్వర్, శ్రావణ్ కుమార్, ఏవిఎల్ నరసింహారావు, పెద్ద బోయిన నాగరాజు, షేక్. మహమూద్,శివ అరుణ్ కుమార్ ,శివకృష్ణ నాయక్, బి .రవీందర్, బి. కిషోర్ చంద్, పి. యుగంధర్, శ్వేత, శ్రీలత, కె.రామకృష్ణ, ఏ ప్రవీణ్ ,షేక్.రబ్బాని, కె.శ్రీను ,భాను, వంశీ ,మురళి ,తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# విద్యార్థులు విద్యలో ముందుస్తు స్తానంలో రాణించాలని కార్యక్రమం ఏర్పాటు



నిజామాబాద్ జిల్లా రూరల్ ప్రతినిధి సిరికొండ మండలం(నేటి శుభోదయ) ఫిబ్రవరి 20. : సిరికొండ మండలం తూంపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్య దేవత సరస్వతి దేవికి గ్రామ ఉప సర్పంచ్ అయినాల శ్రీకాంత్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు విద్యలో రాణించాలని ఆకాంక్షిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పూజల అనంతరం పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్షల సమయంలో ఉపయోగపడే విధంగా పరీక్ష పాడ్స్‌ను ఆయన స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ అయినాల శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానాలను చేరుకోవాలంటే విద్యే ప్రధాన ఆయుధమని పేర్కొన్నారు. కష్టపడి చదివితే ఏ లక్ష్యాన్నైన సాధించవచ్చని, గ్రామనికి, తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావలని విద్యర్థులను ప్రోత్సహించారు. అలాగే పరీక్షలను భయపడకుండ ధైర్యంగ రాయలని, సమయపాలన పాటించాలని, ఉపాధ్యాయులు చెప్పిన సూచనలను తప్పకుండ పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జినుక రాజేందర్ వార్డ్ సభ్యులు గోవర్ధన్ గౌడ్, రాజు విడీసీ చైర్మన్ లక్ష్మణ్, లింగం, వినోద్ తూంపల్లి యువత నరేష్, అజయ్, సన్నీ, సాకేత్, మహిపాల్, శేఖర్, మురళి మరియు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## కార్యకర్తలే మా బలం

## మంత్రి పొంగులేటి ఆశయాలకు అనుగుణంగా ఏదులాపురం అభివృద్ధి

## మున్సిపల్ చైర్‌పర్సన్ అనిత కార్యాలయాన్ని ప్రారంభించిన తుంబూరు దయాకర్ రెడ్డి

## అట్టహాసంగా ప్రారంభోత్సవం, తరలివచ్చిన శ్రేణులు

# ప్రజా క్షేత్రంలోనే పాలన

ఖమ్మం, ఏదులాపురం, నేటి శుభోదయ ::: "అధికారం అంటే గద్దె మీద కూర్చోవడం కాదు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం క్షేత్రస్థాయిలో శ్రమించడం" అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి స్పష్టం



చేశారు. శుక్రవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డు సాయి గణేష్ నగర్ (రోడ్డు నంబర్ 8) లో నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.



### మంత్రి సంకల్పానికి తోడుగా

ఈ సందర్భంగా దయాకర్ రెడ్డి మాట్లాడుతూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మార్గదర్శకత్వంలో ఏదులాపురం మున్సిపాలిటీని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. "ఈ కార్యాలయం కేవలం నాలుగు గోడల మధ్య నడిచేది కాదు. ఇది ప్రజల కష్టాలను పంచుకునే వేదిక కావాలి. చైర్‌పర్సన్ అనిత ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలి" అని ఆయన దిశానిర్దేశం చేశారు. కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని, వారి సమస్యలను కూడా ఈ కార్యాలయం వేదికగా పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు.

### అభివృద్ధిలో రాజీ పడం

మున్సిపల్ చైర్‌పర్సన్ అనిత మాట్లాడుతూ తనపై నమ్మకంతో గెలిపించిన ప్రజలకు, తనకు అండగా నిలిచిన మంత్రి పొంగులేటికి కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపాలిటీలో పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ, రోడ్లు, తాగునీటి సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, వార్డు కౌన్సిలర్లు, పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# కేశంపేట్-చౌలపల్లి రోడ్డు బ్రిడ్జి పనులకు శంకుస్థాపన



కేశంపేట, నేటి శుభోదయ: కేశంపేట్ నుండి చౌలపల్లి రోడ్డు పై నిర్మించనున్న బ్రిడ్జి శంకుస్థాపన కార్యక్రమంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొన్నారు. భూమి పూజ కార్యక్రమాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తుల సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ఈ బ్రిడ్జి నిర్మాణంతో కేశంపేట్–-చౌలపల్లి గ్రామాల మధ్య రాకపోకలు సులభమవుతాయని, వర్షాకాలంలో ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులు తొలగిపోతాయని తెలిపారు. గ్రామీణ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజల అవసరాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు కార్యకర్తలు మరియు ప్రజలు పాల్గొన్నారు.

# 207 ఫైళ్లపై సంతకాలు చేసిన బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి



నిజామాబాద్ జిల్లా రూరల్ ప్రతినిధి భీంగల్ మున్సిపాలిటీ(నేటిశుభోదయ)ఫిబ్రవరి 20.:: బాల్కొండ నియోజకవర్గ శాసన సభ్యులు వేముల ప్రశాంత్ రెడ్డి గురువారం కీలక ఫైళ్ళపై సంతకాలు చేశారు. వేల్పూర్ లోని తన నివాసంలో మొత్తం 207 కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, దరఖాస్తులను క్లియర్ చేశారు. వేల్పూర్(55), బాల్కొండ(38), మోర్తాడ్(29), కమ్మర్ పల్లి(28), భీంగల్(21), మెండోర(17), ఎర్గట్ల(12), ముప్కల్(07), ఫైల్ పెండింగ్లో పెట్టకుండ లబ్ధిదారులకు త్వరితగతిన చెక్కులను అందేలా చూడలని అధికారులను ఆదేశించారు.

# నిరుపేద కుటుంబాలకు అండగా ఉంటాం

### - సర్పంచ్ దేవేందర్ నాయక్



( నేటి శుభోదయ ప్రతినిధి మహేశ్వరం ఫిబ్రవరి 20:): రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలోని గంగారం గ్రామంలో.. సర్పంచ్ దేవేందర్ నాయక్ మాట్లాడుతూ... గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు కట్టుకునే ప్రతి ఒక్కరికి అండగా ఉంటామని తెలియజేశారు ఇప్పటివరకు మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ చరవతో గ్రామానికి 20 ఇళ్లు మంజూరు అవ్వడం జరిగింది ఇంకా ఇందిరమ్మ ఇల్లు కట్టుకోవాలనుకునే వాళ్ళు గ్రామానికి మరో 20 ఏళ్లు రెండో విడతగా రానున్నట్టుగా తెలియజేశారు నిరుపేద కుటుంబాలకు ప్రతి ఒక్కరికి అండగా ఉంటామని గ్రామ సర్పంచ్ దేవేందర్ నాయక్ తెలియజేశారు ఈ యొక్క కార్యక్రమంలో వార్డ్ నెంబర్లో ఎం రవి ఎం దేవా ఎం భాస్కర్ ఎం ధర్మ తదితరులు ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొన్నారు

# నిబంధనలు ఉల్లంఘించే స్కానింగ్ సెంటర్ లపై కఠిన చర్యలు

### కలెక్టర్ ఇలా త్రిపాఠి




నిజామాబాద్ జిల్లా ప్రతినిధి చిలుక విజయకుమార్ ఫిబ్రవరి 20 నేటి శుభోదయ : నిబంధనలు ఉల్లంఘించే స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ అధ్యక్షతన ఐడీఓసీలో గర్భస్తపూర్వ,గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టంపై జిల్లా స్థాయి కమిటీ సమావేశము జరిగింది.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..జిల్లాలో స్కానింగ్ సెంటర్ల రిజిస్ట్రేషన్ అన్ని ప్రమాణాలు పాటిస్తూ అర్హతలు ఉన్న స్కానింగ్ కేంద్రాలకు మాత్రమే రిజిస్ట్రేషన్,రెన్యువల్ చేయాలన్నారు.జిల్లాలో ఉన్న స్కానింగ్ కేంద్రాలన్నీ రికార్డులను,రిపోర్టులను క్రమం తప్పకుండా నమోదు చేయాలని,లేనిచో వారికి రిజిస్ట్రేషన్,రెన్యువల్ చేయకూడదని అన్నారు.పిసిపిఎన్డిటి చట్టంపై విస్తృతంగా అవగాహన సదస్సులను నిర్వహించాలని అన్నారు.ఈ సమావేశంలో అదనపు డీసీపీ బస్వారెడ్డి,జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిణి డాక్టర్ రాజశ్రీ,పీ.ఓ లు సుప్రియ,శిఖర,డిప్యూటీ డీఎంహెచ్ఓలు అశ్వినీ,సమత,రెడ్ క్రాస్ ప్రతినిధి బుస్స ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# దమ్మపేట మండలంలో రూ.26 లక్షల ఇన్వెస్ట్మెంట్ సైబర్ ఫ్రాడ్

### ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసుల హెచ్చరిక

దమ్మపేట ప్రతి నిది నేటి శుభోదయ–: దమ్మపేట మండలంలో ఇటీవల భారీ సైబర్ మోసం వెలుగులోకి వచ్చింది. మండలంలోని పాత చీపురుగూడెం మరియు కొత్తూరు గ్రామాలకు చెందిన కొందరు వ్యక్తులు సైబర్ నేరగాళ్ల బారినపడి సుమారు రూ.26 లక్షల మేర ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్‌కు గురైనట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం, సైబర్ నేరగాళ్లు ఫోన్ కాల్స్ ద్వారా "తక్కువ సమయంలో ఒకటికి పది రెట్లు లాభం వస్తుంది" అంటూ ఆశ చూపి, వివిధ రకాల లింకుల ద్వారా బాధితులను నమ్మించారు. అనంతరం వారి నుంచి దశలవారీగా భారీ మొత్తంలో నగదును మోసం చేసినట్లు వెల్లడైంది. మోసపోయామని గ్రహించిన బాధితులు పోలీసులను ఆశ్రయించడంతో, ఈ ఘటనపై సైబర్ క్రైమ్ పోర్టల్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా దమ్మపేట పోలీసులు మండల ప్రజలకు కీలక హెచ్చరికలు జారీ చేశారు. అధిక లాభాలు వస్తాయని తెలియని ఇన్వెస్ట్మెంట్లలో పెట్టుబడులు పెట్టవద్దని అనుమానాస్పద లింకులు లేదా తెలియని ఏపీకే ఫైళ్లను క్లిక్ చేయవద్దని తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఆశతో ఆస్తులు అమ్ముకుని పెట్టుబడులు పెట్టవద్దని స్పష్టం చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి, ఎలాంటి అనుమానం వచ్చినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ నాగరాజు, ఎస్ ఐ సాయి కిషోర్ రెడ్డి సూచించారు.

# తెలంగాణ ఇచ్చి కాంగ్రెస్ త్యాగం అధికారం అనుభవించిన కెసిఆర్

### అమరుడికి ఘన నివాళి: కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి కేఎల్ఆర్



( నేటి శుభోదయ ప్రతినిధి మహేశ్వరం ఫిబ్రవరి 20:): తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చి కాంగ్రెస్ అధినేత్రి సోనియమ్మ త్యాగం చేస్తే... అధికార భోగం అనుభవించింది బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు కుటుంబం అని మండిపడ్డారు మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్ఛార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి. సరిగ్గా 16ఏళ్ల క్రితం మహేశ్వరం మండలం పెద్దపులినాగారం గ్రామానికి చెందిన ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి సిరిపురం యాదయ్య ఆత్మబలిదానం చేసుకున్నారని కేఎల్ఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకున్నారు. సిరిపురం యాదయ్య వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు నివాళులు అర్పించాయి. మలిదశ ఉద్యమంలో తెలంగాణ ప్రజలు, విద్యార్థుల ఆత్మబలిదానాల పునాదులపై ఏర్పడ్డ ప్రత్యేక రాష్ట్రంలో అమరుల త్యాగాలను విస్మరించారని... ఆయా కుటుంబాలకు తెరాస / బిఆర్ఎస్ న్యాయం చేయలేదని కిచ్చెన్న ఆగ్రహం వ్యక్తం చేశారు.

### తెలంగాణ బిల్లుకు పార్లమెంట్ లో ఆమోదం:

పార్లమెంట్ లో... కాంగ్రెస్ హయాంలో... సోనియాగాంధీ నాయకత్వంలో... తెలంగాణ బిల్లుకు ఆమోదం లభించిన రోజు ఫిబ్రవరి 20 అని గుర్తు చేసుకున్నారు కేఎల్ఆర్ లోక్ సభలో ఫిబ్రవరి 18, రాజ్యసభ ఫిబ్రవరి 20న బిల్లుకు ఆమోదం తెలిపాయని లక్ష్మారెడ్డి చెప్పారు. విపక్షాలు, ఆంధ్ర ఎంపీలు వ్యతిరేకించినా... తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చారని సోనియమ్మకు మరోసారి కృతజ్ఞతలు తెలిపారు కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి.సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమరుల కుటుంబాలకు, తెలంగాణ ఉద్యమకారులకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

# ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సిరిపురం యాదయ్యకి ఘననివాళి నడికూడ అర్జున్




( నేటి శుభోదయ ప్రతినిధి మహేశ్వరం ఫిబ్రవరి 20:): రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలోని పెద్దపులి నాగారం గ్రామంలో.. ఎమ్మార్పీఎస్ మహేశ్వరం మండల్ నాయకులు నడికుడ అర్జున్ మాట్లాడుతూ.. తెలంగాణ అమరవీరుడు సిరిపురం యాదయ్య ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి ఆత్మబలిదానం ఆవేదన వ్యక్తం చేసిందన్నారు ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు వర్ధంతి సందర్భంగా.. ఘన నివాళులర్పిస్తూ.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర కోసం ప్రాణ త్యాగాలు చేసిన యాదయ్య మరణం ఎప్పటికీ తెలంగాణ ప్రజల గుండెల్లో ఉండిపోతుందని తెలియజేశారు ప్రభుత్వం అమరవీరుల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు అదే విధంగా.. తెలంగాణ ఉద్యమకారులను ప్రత్యేకంగా గుర్తించి వారి కుటుంబాలకు అండగా ప్రభుత్వాలు ఉండాలని ఎమ్మార్పీఎస్ మండల నాయకులు నడికూడ అర్జున్ కోరారు

# సంతాపూర్ అభివృద్ధికి ఎమ్మెల్యేకు వినతి పత్రం



కేశంపేట, నేటి శుభోదయ: కేశంపేట మండలం సంతాపూర్ గ్రామంలో జరిగిన ఇందిరమ్మ ఇండ్ల పూజా కార్యక్రమంలో పాల్గొన్న వీర్లపల్లి శంకర్ కు గ్రామ అభివృద్ధి సమస్యలపై వినతి పత్రాన్ని కర్రెడ్ల నరేందర్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. సంతాపూర్ గ్రామంలో ప్రధాన సమస్య డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడమేనని, వర్షాకాలంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే డ్రైనేజీ నిర్మాణానికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరారు.అదేవిధంగా గ్రామంలోని శ్రీ పాలకాల లక్ష్మీనరసింహస్వామి దేవాలయంకు ఇప్పటికీ విద్యుత్ సరఫరా అందలేదని, పండుగలు మరియు పూజల సమయంలో భక్తులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. దేవాలయానికి త్వరితగతిన విద్యుత్ కల్పించాలని విజ్ఞప్తి చేశారు.ఇంకా ఇందిరమ్మ ఇండ్ల పథకంలో కేంద్ర ప్రభుత్వ వాటా కూడా ఉందని, గ్రామాల అభివృద్ధికి కేంద్రం నిధులు ఇస్తున్నప్పుడు రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలని కోరారు.

## రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



మంథని/పెద్దపల్లి,ఫిబ్రవరి-20 నేటి శుభోదయ: విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలలో పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో సి.డబ్ల్యూ.ఎస్.ఎన్ విద్యార్థుల కోసం నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన జిల్లా విద్యార్థులను శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో తన చాంబర్ లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ.... ఫిబ్రవరి 17న హైదరాబాద్ లోని దోమలగూడ లో ప్రభుత్వ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో సి.డబ్ల్యూ.ఎస్.ఎన్ విద్యార్థుల కోసం నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలలో పెద్దపెల్లి జిల్లాకు చెందిన 20 మంది సి.డబ్ల్యూ.ఎస్.ఎన్ విద్యార్థులు వివిధ క్రీడా విభాగాల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారని అన్నారు. జూలపల్లి మండలానికి చెందిన బడుగు సందీప్ జిగ్ జాగ్ వాకింగ్ లో 1వ బహుమతి , కమాన్ పూర్ మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎడునూరి పౌర్ణమి చెస్ పోటీలో 1వ బహుమతి, రొంపికుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కటకం శ్రీరామ్ చరణ్ పరుగుపందెంలో 1వ బహుమతి, మ్యూజికల్ చైర్ లో 2వ బహుమతి, జిగ్‌జాగ్ వాకింగ్ లో 2వ బహుమతి సాధించారు. విజేతలను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష , జిల్లా విద్యాశాఖ అధికారి శారద ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి జి.శారద, ఐఈ కోఆర్డినేటర్ జి. కవిత సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 23 లోపు ఆసక్తి గల యువత దరఖాస్తు చేసుకోవాలి

### అగ్నివీర్ పరీక్షల కోసం 90 రోజులు ఉచిత శిక్షణ

### జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష




మంథని/పెద్దపల్లి ఫిబ్రవరి - 20 నేటి శుభోదయ: పెద్దపల్లి జిల్లాలో ఆసక్తి గల యువతకు అగ్ని యూపిహెచ్ఎస్ పరీక్షల సన్నద్ధం అయ్యేందుకు వీలుగా 90 రోజుల పాటు శారీరక ,లిఖిత పరీక్షల కోసం ఉచిత శిక్షణ అందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని యువతకు సైన్యంలో చేరే అర్హత సాధించేందుకు "అగ్నివీర్ యూపీహెచ్ఎస్ శిక్షణ పథకం -- 2026" కార్యక్రమ ద్వారా అగ్నివీర్ అభ్యర్థులకు పూర్తి స్థాయి శారీరక లిఖిత పరీక్షల శిక్షణ అందిస్తున్నామని, ఈ శిక్షణలో ఫిజికల్ ట్రైనింగ్, మెడికల్ పరీక్షల అవగాహన, రాత పరీక్ష కోచింగ్, గ్రౌండ్ ప్రాక్టీస్, యూనిఫామ్, స్టడీ మెటీరియల్ వంటి సౌకర్యాలు కల్పిస్తామని కలెక్టర్ తెలిపారు. ఆసక్తిగల యువత ఫిబ్రవరి 23 లోపు తమ పేర్లు ఉచిత శిక్షణ కోసం రిజిస్టర్ చేసుకోవాలని, ఫిబ్రవరి 25న దరఖాస్తు చేసుకున్న వారికి మెడికల్ పరీక్షల నిర్వహించి శిక్షణ కొరకు అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని ఒకటి నుంచి మే 31 వరకు శిక్షణ నిర్వహిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లా పురుష అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుందని దరఖాస్తు చేసుకునే వారు తప్పనిసరిగా 10వ తరగతి ఉత్తీర్ణత సాధించాలని వీరి వయస్సు 17.5 నుండి 22 మధ్యలో ఉండాలని అన్నారు.శిక్షణ సమయంలో అభ్యర్థులకు భోజనం, శిక్షణ తరగతులు, గ్రౌండ్ ప్రాక్టీస్, స్టడీ మెటీరియల్ అందించబడుతుంది. ఆసక్తి గల అభ్యర్థులు సంబంధిత తేదీలలో రుద్రమదేవి స్టేడియం, సెంటెనరీ కాలనీ, రామగిరి నందు ఉదయం 6:00 గంటల నుండి 8:00 గంటల వరకు హాజరై రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు తమ వెంట ఆధార్ కార్డు, పదవ తరగతి మెమో, రెండు పాస్ పోర్ట్ సైజు ఫోటోలు తీసుకొని రావాలని మరిన్ని వివరాలకు 9573688952, 9949725997, 8106807784 నెంబర్లను సంప్రదించగలరని కలెక్టర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## ప్రజల సంక్షేమమే లక్ష్యం సర్పంచ్ వేణుగోపాల్ స్పష్టమైన సందేశం



కేశంపేట,నేటి శుభోదయ: కేశంపేట మండలం సంగెం గ్రామం లో గ్రామాభివృద్ధికి మరొక కీలక ముందడుగు పడింది. సర్పంచ్ వేణు గోపాల్ ఆధ్వర్యంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. 2వ వార్డులో అండర్ డ్రైనేజీ పనులకు శ్రీకారం చుట్టగా, వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో తాగునీటి సమస్యను దృష్టిలో ఉంచుకొని 6వ వార్డులో పైప్‌లైన్ పనులను కూడా ప్రారంభించారు.గ్రామంలో పారిశుధ్యం, తాగునీరు, అండర్ డ్రైనేజ్, విద్యుత్ వంటి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామని సర్పంచ్ వేణు గోపాల్ తెలిపారు. ప్రజలు అడగకముందే సమస్యలను గుర్తించి పరిష్కరిస్తున్నామని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రముఖ కాంట్రాక్టర్ ఎన్నం గోపాల్ రెడ్డి, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు నల్లవోలు మురళీందర్ రెడ్డి, ఉపసర్పంచ్ మహ్మద్ షకీల్, మాజీ ఎంపీటీసీ యాదగిరి, గ్రామ పెద్దలు బ్రహ్మయ్య, విష్ణు, గౌస్ వాహేద్, వార్డు సభ్యులు సలీం, జపర్, మహేందర్ యాదవ్, మన్సూర్, సాయిరాం, రోజా, అర్జునయ్య, నర్సింగ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు మహేశ్వరం మండల కేంద్రంలో విద్యుత్ అంతరాయం



( నేటి శుభోదయ ప్రతినిధి మహేశ్వరం ఫిబ్రవరి 20:): రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలోని తుక్కుగూడ సబ్ స్టేషన్ లో మరమ్మత్తుల దృష్ట్యా ఉదయం 10.30నుండి మధ్యాహ్నం 2.30వరకు విద్యుత్ అంతరాయం తుక్కుగూడ, సర్దార్ నగర్, బాసగూడ, నార్త్ స్టార్ అలాగే మధ్యాహ్నం 2గంటల నుండి సాయంత్రం 5.30వరకు పెండ్యాల సబ్ స్టేషన్ లో మరమ్మత్తుల దృష్ట్యా మనసానపల్లి, పెండ్యాల, డబిల్ గూడ, రాంచంద్రగూడ మరియు కల్వకోల్ గ్రామాలలో విద్యుత్ అంతరాయం ఉంటుంది.మహేశ్వరం ఏఈ చక్రపాణి తెలియజేశారు

## జాతీయస్థాయి అండర్ 16 వాలీబాల్ పోటీలకు గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపిక



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి చిలుక విజయకుమార్ ఫిబ్రవరి 20 నేటి శుభోదయ: జిల్లాలోని ముగ్పాల్ మండలం కంజర మహాత్మ జ్యోతిరావు బాపులే గురుకుల బాలుర పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి మనీష్ జాతీయ స్థాయిలో జరుగుతున్న సబ్ జూనియర్ అండర్ 16 వాలీబాల్ పోటీలకు ఎంపిక అయినట్లు ప్రిన్సిపాల్ వి.మురళి,పి ఈ టి కే.వినోద్ తెలిపారు.క్రీడల్లో చక్కని ప్రతిభాను కనబరుస్తూ జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక కావడంపై నిజామాబాద్,కామారెడ్డి ఉమ్మడి జిల్లాల ఆర్ సి ఓ కే.సత్యనాథ్ రెడ్డి,పాఠశాల అధ్యాపక బృందం,తోటి విద్యార్థులు అభినందించారు.ఈ పోటీలు పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని హుగ్లీలో ఈనెల 24 నుండి మార్చ్ 01 వరకు జరుగుతాయని పిఈటి వినోద్ తెలిపారు.విద్యార్థులు మనీష్ (కంజర),గోవింద్ సింగ్,అరవింద్(ధర్మోరా) లు కూడా ఎంపిక కావడం జరిగిందని తెలిపారు.వీళ్లు ముగ్గురు కూడా గురుకుల పాఠశాలలకు చెందిన విద్యార్థులు కావడం విశేషం.దీనితో పాటు జాతీయస్థాయిలో విద్యార్థులు తమ ప్రతిభను కనబరచారని క్రీడల్లో చక్కగా రణించాలని అధ్యాపక బృందం కోరుకుంటుంది.

# మార్చి 01 వరకు సంక్షేమ పథకాల కోసం దరఖాస్తు చేసుకోవాలి

### జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి పి.నరేష్ కుమార్ నాయుడు




మంథని/పెద్దపల్లి, ఫిబ్రవరి -20 నేటి శుభోదయ: మైనారిటీ శాఖ ద్వారా అమలు చేసే వివిధ సంక్షేమ పథకాలకు అర్హులైన మైనారిటీ అభ్యర్థులు మార్చి 1 నాటికి ఆన్లైన్లో తమ దరఖాస్తులు సమర్పించాలని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి పి.నరేష్ కుమార్ నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా మైనారిటీల సంక్షేమం కోసం 2025-26 సంవత్సరంలో ఆర్థిక సహాయ కింద నిరుద్యోగ మైనారిటీ (ముస్లిం, సిక్కు, బౌద్ధ, జైన మరియు పార్శి) యువత (పురుషులు) సాధికారత కోసం ఇ-స్కూటర్లు పంపిణీ చేయుటకు స్వయం ఉపాధిని అందించడానికి తెలంగాణ ప్రభుత్వం పైలట్ ప్రాజెక్ట్ ప్రారంభించిందని అన్నారు. పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసిన మైనారిటీ నిరుద్యోగ యువత (పురుషుల) కు తెలంగాణ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా లక్షా 50 వెల రూపాయల విలువగల ఈ-స్కూటర్ 80% సబ్సిడీతో అందిస్తామని అన్నారు. మైనార్టీ వర్గానికి చెందిన అభ్యర్థులు తమ ఆధార్ కార్డు, రేషన్ కార్డుతో మార్చ్ 1 లోగా దరఖాస్తు చేసుకోవాలని, వీరికి 21 నుంచి 40 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలని, అభ్యర్థి 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, కుటుంబంలో ఒకరికి మాత్రమే పథకం అందుతుందని, అభ్యర్థికి ఆర్టిఏ జారీ చేసిన డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని, ఉబర్ / రాపిడో / ఓలా, ఇతర సర్వీస్ ప్రొవైడర్లతో క్రమం తప్పకుండా పనిచేస్తానని దరఖాస్తుదారు స్వీయ ప్రకటన కలిగి ఉండాలని, దరఖాస్తుదారుడి వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాలకు రూ. 1.5 లక్షలు మరియు పట్టణ ప్రాంతాలకు రూ. 2 లక్షలు మించకూడదని, ఈ-స్కూటర్ తెలంగాణ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ హామీ కింద ఉండాలని అన్నారు. గత ఐదు సంవత్సరాలలో తెలంగాణ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ యొక్క ఏ పథకం నుండి తాను ప్రయోజనం పొందలేదని దరఖాస్తుదారు స్వీయ ప్రకటన, డ్రైవింగ్ లైసెన్స్ పై ఎటువంటి కేసు ఉండకూడదని తెలిపారు. ముస్లిం తుర్క కాష పథకమునకు సంబంధించి జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి, పెద్దపల్లి గారు వివరిస్తూ ఈ పథకము క్రింద అర్హత కలిగిన ఎంపిక అయిన అభ్యర్థులకు ఉచిత టూల్ కిట్లు, జనరేటర్స్ అందిస్తామని, ఈ పథకము వల్ల లబ్ది పొందాలంటే అభ్యర్థి తుర్క కాష ముస్లిం అయి ఉండాలి, (ఆధార్ కార్డు/ రేషన్ కార్డు అభ్యర్థి చిరునామా కొరకు సమర్పించాలి), అభ్యర్థి వయస్సు 21 నుంచి 55 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలి (వోటర్ ఐడి./ఆధార్ కార్డు/ఎఫ్ఎస్సీ వయస్సు ధృవీకరణ కొరకు సమర్పించవలెను), తుర్క కాష కమ్యూనిటీ అసోసియేషన్ ద్వారా జారీ చేయబడిన తుర్క కాష కమ్యూనిటీ ఉండవలెను, గత ఐదు సంవత్సరాలలో తెలంగాణ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ యొక్క ఏ పథకం నుండి తాను ప్రయోజనం పొందలేదని దరఖాస్తుదారు స్వీయ ప్రకటన ఇవ్వవలెను. అభ్యర్థి తుర్క కాష కమ్యూనిటీకి చెందిన వాడని స్వయం ప్రకటన ఇవ్వాలని తెలిపారు. ఈ రెండు పథకాలకు సంబంధించిన దరఖాస్తులను 01.03.2026 నాటికి కార్పొరేషన్ పోర్టల్ https://tgobmms.cgg.gov.in/ లో నమోదు చేసుకోవాలని, ముఖ్యమైన పత్రాలను ఆన్. లైన్ దరఖాస్తుతో పాటు సంబంధిత ఎంపిడిఓ/ మున్సిపల్ కమిషనర్ కార్యాలయములో సమర్పించాలి. అర్హత కలిగిన మైనారిటీలు ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మరిన్ని వివరాల కోసం జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి కార్యాలయము, రూమ్ నెం.232, ఫస్ట్ ఫ్లోర్, ఐ డి ఓ సి కార్యాలయం లో సంప్రదించగలరని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## తుర్కపల్లి లో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో పాల్గొన్న పీసీసీ సభ్యుడు కే.శ్రీనివాస్



నారాయణఖేడ్ ఫిబ్రవరి 20 నేటి శుభోదయ ప్రతినిధి: ఖేడ్ మండలంలోని తూర్కపల్లి గ్రామానికి చెందిన కమ్మరి బ్రహ్మయ్య కు మంజూరైన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి పీసీసీ సభ్యుడు కే.శ్రీనివాస్ హాజరై కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి పేద కుటుంబాలకి సొంత ఇల్లు కలగాలనే ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ గృహ పథకాన్ని ప్రవేశపెట్టింది,అర్హులైన ప్రతి కుటుంబానికి గృహ సౌకర్యం అందేలా కట్టుబడి పనిచేస్తున్నామని అన్నారు. పేద ప్రజల జీవన స్థితిగతులు మెరుగుపడటానికి గృహం ఎంతో ప్రధానమని,సొంత ఇల్లు కలగడం ప్రతి కుటుంబానికి గౌరవప్రదమైన విషయం అని అన్నారు.ఇందిరమ్మ గృహ పథకం ద్వారా అనేక కుటుంబాలు ఆదుకుంటుందని, గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధికి ఇది ఒక కీలక ముందడుగు అని తెలిపారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమమే లక్ష్యంగా వివిధ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని చెప్పారు.ఈ కార్యక్రమంలో వారితోపాటు ఖేడ్ పట్టణ అధ్యక్షుడు: శివకుమార్, తుర్కపల్లి గ్రామ సర్పంచ్ మల్కారెడ్డి ప్రతాప్ రెడ్డి, చిలుముల నరసింహారెడ్డి, మాజీ ఎంపిటిసి దత్త గౌడ్, వార్డు సభ్యులు పాల్వంచ విటోబా, గైనీకాడి.దుర్గ గౌడ్, బోయినీ దామోదర్, మను మయ సంఘ అధ్యక్షుడు: కమ్మరి ప్రవీణ్, వడ్ల గుండన్న కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు,మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రెసిడెన్షియల్ స్కూల్స్, భవిత కేంద్రాల నిర్వహణ మరింతగా మెరుగుపడాలి

### మండల ప్రత్యేక అధికారులతో కలెక్టర్ సమీక్ష



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి చిలుక విజయకుమార్ ఫిబ్రవరి 20 నేటి శుభోదయ : ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలు,భవిత కేంద్రాల నిర్వహణ తీరుతెన్నులపై కలెక్టర్ ఇలా త్రిపాఠి మండల ప్రత్యేక అధికారులతో శుక్రవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో సుదీర్ఘ సమీక్ష జరిపారు.ఒక్కో మండలం వారీగా స్పెషల్ ఆఫీసర్లు జరిపిన క్షేత్రస్థాయి సందర్శనలు,ఆయా పాఠశాలల్లో వారు గమనించిన అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు.ఆయా స్కూళ్ళలో నెలకొని ఉన్న స్థితిగతులు,పెండింగ్ పనులు,ఎం.ఎస్.ఓ లు సందర్శించిన దృశ్యాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు.క్రమం తప్పకుండా క్షేత్రస్థాయి పరిశీనలు కొనసాగించాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఎంఎస్ఓ లకు ఆదేశించారు. జిల్లాలో ఇప్పటికే అందుబాటులో ఉన్న భవిత కేంద్రాల నిర్వహణ మరింతగా మెరుగుపడాలని,వివిధ దశలలో నిర్మాణాలలో ఉన్న కేంద్రాల పనులను వేగంగా పూర్తి చేయించాలని సూచించారు.మంజూరీలు తెలుపబడిన అన్ని పనులను మార్చి నెలాఖరు నాటికి పూర్తి చేయాలని ఇంజినీరింగ్ విభాగం అధికారులకు గడువు విధించారు.రెసిడెన్షియల్ స్కూల్స్,వసతి గృహాలు,పాఠశాలల్లో విద్యార్థులకు భోజనం మెనూ ప్రకారం అందుతుందా లేదా అన్నది పరిశీలించాలని,మెనూ పాటించని వారిపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ స్పష్టం చేశారు. కలుషిత ఆహారం వంటివి చోటుచేసుకోకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కేజీబీవీలు సహా అన్ని బాలికల విద్యాలయాల్లో సీ.సీ టీ.వీలు వర్కింగ్ కండీషన్ లో ఉండాలని,అవసరమైన చోట వెంటనే మరమ్మతులు చేయించాలని అన్నారు.విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ,భద్రతకు ఎనలేని ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు.సమావేశంలో డీఆర్డీఓ సాయాగౌడ్,డీఈఓ అశోక్,ఆర్.సీ.ఓలు,ఇంజినీరింగ్ విభాగం అధికారులు,మండల స్పెషల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.



## వీరాంజనేయ స్వామి ఆలయానికి ప్రధాన ప్రవేశ ద్వారం ఏర్పాటు

### ఆలయ కమిటీ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్.



సదాశివపేట ఫిబ్రవరి 20 నేటి శుభోదయ ప్రతినిధి :హనుమాన్ నగర్ లోని వీరాంజనేయ స్వామి ఆలయానికి ప్రవేశ ద్వారం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రధాన ఆలయ ప్రవేశ ద్వారానికి అర్చకులచే వేద మంత్రాలతో, పూజల నిర్వహించి ఏర్పాటు చేయడమైనదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, హనుమాన్ నగర్ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఏసీబీకి చిక్కిన సబ్ రిజిస్టర్ రాజేందర్ - రైటర్ రషీద్



మంథని,ఫిబ్రవరి -20 నేటి శుభోదయ: మంథని మండలం పుట్టపాక గ్రామానికి చెందిన కన్నూరి బాబు ఫ్లాట్ రిజిస్ట్రేషన్ కోసం సబ్ రిజిస్టర్ రాజేందర్, రైటర్ రషీద్ డబ్బులు డిమాండ్ చేయగా ఏసీబీ అధికారులను సంప్రదించి శుక్రవారం 16,500 ఇస్తుండగా ఏసీబీ అధికారులు నిఘా వేసి పట్టుకున్నారు. ఏసీబీ అధికారి కరీంనగర్ ఇన్చార్జి డిఎస్పి మధు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. మంథనిలో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించగా మంథనిలో పలు సంబంధిత అధికారులు ఉలిక్కిపడ్డారు. ఎవరైనా అధికారులు లంచం డిమాండ్ చేస్తే ఏసీబీ అధికారులను సంప్రదించాలని ఏసీబీ డిఎస్పి మధు ఈ సందర్భంగా తెలిపారు.

## తెలంగాణ గ్రామీణ బ్యాంక్ నుండి జేసీబీని పొందిన శ్రీకాంత్ రెడ్డి

### బ్యాంక్ చైర్మన్ ప్రతాపరెడ్డి చేతుల మీదగా నూతన జెసిబిని అందుకున్న కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు శ్రీకాంత్ రెడ్డి

### తెలంగాణ గ్రామీణ బ్యాంక్ వినియోగదారులకు అందుబాటులో ఉంటుంది



షాద్నగర్ నియోజకవర్గం మీరు శుభోదయ ప్రతినిధి ఫిబ్రవరి 20: హైదరాబాదులోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, మహబూబ్ నగర్ రీజినల్ మేనేజర్ ఎల్ శిలా, మహబూబ్ నగర్ బిజినెస్ మేనేజర్ పి కిషోర్, కొత్తూరు బ్రాంచ్ మేనేజర్ ఉదయశ్రీ సహకారంతో నూతన జెసిబిని పొందిన కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు శ్రీకాంత్ రెడ్డి కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ గ్రామీణ బ్యాంక్ చైర్మన్ శ్రీ ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ..తెలంగాణ గ్రామీణ బ్యాంకు డిపాజిట్లపై అత్యధిక వడ్డీ రేట్లు ఇస్తున్నట్లు ఆయన తెలియజేశారు. వివిధ రకాల గవర్నమెంట్ స్కీమ్స్ (ఎమ్మెస్ యమ్మి) మైక్రో స్మాల్ యూనిట్స్ ద్వారా బిజినెస్ లోన్లు విరివిగా అందజేస్తున్నట్లు వారు తెలిపారు. కొత్తగా సహస్ర స్కీం ద్వారా అత్యధిక వడ్డీ రేట్లు ఇస్తున్నామని బ్యాంక్ చైర్మన్ ప్రతాపరెడ్డి తెలియజేశారు.ఈ సందర్భంగా చైర్మన్ కి,బ్యాంక్ మేనేజర్ కి, శ్రీకాంత్ రెడ్డి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు మామిడి సిద్ధార్థ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

### గురువులకు ఘన సత్కారం





ఖమ్మం, నేటి శుభోదయ ::: ఖమ్మం నగరంలోని ఎస్ ఎస్ ఆర్ జె సి ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాల 1993 -96 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం శుక్రవారం ఖమ్మం నగర సమీపంలోని సువర్ణపురం గ్రామం వద్ద ఉన్న సూర్య అగ్రో ఫార్మ్స్ లో ఘనంగా జరిగింది. వివిధ హోదాలలో ఉన్న పూర్వ విద్యార్థులు ఈ సమ్మేళనంలో పాల్గొని గురువులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కళాశాల నాటి చదువుకున్న రోజులు, అనంతరం సమాజంలో ఎదిగిన తీరును గుర్తు చేసుకున్నారు. ఆటలు ఆడి పాటలు పాడి ఆనందంగా గడిపారు. సీనియర్ కామర్స్ లెక్చరర్ ఆంజనేయులు దంపతులను వారి ఇంటి వద్ద కలిసి శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు. ఈ వేడుకలో పూర్వ విద్యార్థులుగా వివిధ హోదాలలో స్థిరపడిన చార్టెడ్ అకౌంటెంట్లు త్రినాధ్, సుధీర్, రమేష్, పాణి, సీనియర్ జర్నలిస్ట్ మైస పాపారావు, హరి కాశ్యప్, శ్రీ పాల్, రంగా, హమీద్, ఎన్నారై ప్రశాంతి, ఎలక్ట్రికల్ జే ఏ ఓ రజిని, రాధిక, పావని, మాధురి, చంద్రకళ, భారతి తదితరులు పాల్గొన్నారు.



## మైత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎగ్జామ్ ప్యాడ్స్ అందజేత




గజ్వేల్ నియోజకవర్గం, 20 ఫిబ్రవరి 2026 : నేటి శుభోదయ: సిద్ధిపేట జిల్లా : కుకునూరుపల్లి మండల కేంద్రంలో మైత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థిని, విద్యార్థులకు ఎగ్జామ్స్ ప్యాడ్స్ పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా మైత్రి ఫౌండేషన్ అధ్యక్షులు రిప్పల స్వామి, సభ్యులు మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులకు పరీక్షల సమయంలో ఉపయోగపడడం కోసం సాక్షి దినపత్రికలో వచ్చినటువంటి మోడల్ పేపర్లను చూసి పదవ తరగతి పిల్లలకు ఉపయోగపడుతుందని గతంలో కొన్ని సాక్షి పేపర్లను ఇవ్వడం జరిగిందని, అదేవిధంగా ఈరోజు 100 ఎగ్జామ్ ప్యాడ్లను అందించడం జరిగిందని తెలిపారు. ఈ సంవత్సరం టాప్ స్కోర్ చేసిన ముగ్గురు విద్యార్థులకు మొదటి, ద్వితీయ, తృతీయ విద్యార్థులకు మంచి బహుమతులు ఇస్తామని తెలియజేయడం జరిగింది. మైత్రి ఫౌండేషన్ ఎప్పటికీ పేద పిల్లల చదువుల కొరకు పనిచేస్తుందని మైత్రి ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. అనంతరం ఎంఈఓ సత్తయ్య మాట్లాడుతూ 2006 సంవత్సర పూర్వ విద్యార్థులు మైత్రి ఫౌండేషన్ స్థాపించి విద్యార్థులకు ఇలా సహాయం చేయడం చాలా మంచి కార్యక్రమం అని, ఎంఈఓ సత్తయ్య మైత్రి ఫౌండేషన్ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సత్తయ్య, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, మైత్రి ఫౌండేషన్ సభ్యులు,డా శివకుమార్, మహేందర్, కిషన్, నాగరాజు, కిరణకుమార్ రెడ్డి, రాజు, మల్లేష్ గౌడ్, భూపాల్, ప్రసాద్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ధోతి వేడుకలో వానరాసి వెంకటేష్



నేటిశుభోదయ: తలకొండపల్లి (ఫిబ్రవరి 20): జడ్చర్ల పట్టణంలో జరిగినటువంటి దోతి వేడుక కార్యక్రమంలో పాల్గొన్న తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామ బిఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు వానరాశి వెంకటేష్, కూన నరేష్ కుమారుల ఫంక్షన్ పాల్గొని కూన నరేష్ కుమారులను ఆశీర్వదించిన వెంకటేష్,మాట్లాడుతూ ధోతీ వేడుక యొక్క ప్రాముఖ్యత మరియు చరిత్రను అర్థం చేసుకోవడం అనేది ధోతి వేడుక, ధోతి కృష్ణ సంబంధం అని కూడా పిలుస్తారు, ఇది అనేక భారతీయ సంస్కృతులలో ఒక ముఖ్యమైన సంప్రదాయం, ఇది బాలుడు పురుషత్వపు తొలి దశల్లోకి మారడాన్ని సూచిస్తుంది. ఈ సంఘటన బాలుడి వస్త్రధారణ పిల్లల నుండి పెద్దవాడిగా మారే సమయాన్ని సూచిస్తుంది,ఇది గౌరవం మరియు పరిపక్వతకు చిహ్నంగా ఉంటుంది.గతంలో, ధోతీ ఒక సాంస్కృతిక వస్త్రం మాత్రమే కాదు, జీవితంలో ఒక వ్యక్తి పాత్ర మరియు స్థానం యొక్క చిహ్నంగా కూడా ఉండేది. ధోతీ ధరించడం అనేది జీవితంలోని కొత్త దశలోకి ప్రవేశించడాన్ని సూచిస్తుంది, పరివర్తన మరియు పెరుగుదలకు గుర్తుగా దుస్తులపై ఉంచిన ప్రాముఖ్యతకు అనుగుణంగా ఉంటుంది. ఈ వేడుక ఈ గొప్ప చారిత్రక అర్థాలను కలిగి ఉంది, సాంస్కృతిక కొనసాగింపు మరియు చిన్న పిల్లల జీవితంలో మైలురాళ్ల ప్రాముఖ్యతను నొక్కి చెబుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పొద్దుటూరు రాజు గుప్తా, కాంగ్రెస్ నాయకులు విష్ణు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## "ఆట విడుపు"

### కృష్ణానదిలో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి దంపతులు పడవలో విహార యాత్ర



నంద్యాల, నేటి శుభోదయ ::: నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజకవర్గం పగిడ్యాల మండలం పాత ముచ్చుమర్రి గ్రామ సమీపంలో ఉన్న కృష్ణానదిలో శుక్రవారం నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి, ఆమె భర్త డాక్టర్ శివచరణ్ రెడ్డిలు పడవలో విహార యాత్ర చేశారు. బైరెడ్డి కుటుంబం ఆధ్వర్యంలో, వేద పండితులు తెలకపల్లి రఘురామ శర్మ పర్యవేక్షణలో వైభవంగా శ్రీ చౌడేశ్వరీదేవీ, శ్రీ మశమ్మ, శ్రీ గంగమ్మ అమ్మవార్ల నూతన ఆలయాలు, విగ్రహాల ప్రతిష్ట నిర్వహించారు. ఈ కార్యక్రమం అనంతరం కొత్తపల్లి మండలం సిద్దేశ్వరం గ్రామానికి చెందిన తిక్కస్వామి, వెంకటేశ్వర్లు ల పడవతో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ని చూసేందుకు ఏటి అవతలి ఒడ్డు నుంచి పడవతో ఇవతలికి వచ్చారని తెలుసుకున్నారు. వారి విన్నపం మేరకు పడవలో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి, ఆమె భర్త డాక్టర్ శివ చరణ్ రెడ్డి లు విహరించారు.



## మండలకేంద్రంలో గల విద్యుత్ సమస్యలపై రాష్ట్ర విద్యుత్ చైర్మన్ కి వినతిపత్రం అందజేసిన

### - సిరికొండ సర్పంచ్



నిజామాబాద్ జిల్లా రూరల్ ప్రతినిధి సిరికొండ మండలం (నేటిశుభోదయ)ఫిబ్రవరి 20.: సిరికొండ మండల కేంద్రంలో 33కెవి మరియు 11కెవి సబ్ స్టేషన్ లో విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదులు పరిష్కారముల వేదిక కార్యక్రమంలో భాగంగా సిరికొండ సర్పంచ్ శ్రీ మల్లెల సాయిచరణ్ వారికి సిరికొండలో ప్రమాదకరంగా ఇండ్ల మధ్యలో ఉన్న 33కెవి లైను ఊరి బయటకు మార్చుటకు మరియు లోవోల్టేజ్ సమస్య ఏ,బి కేబుల్ తీసివేసి థర్డ్ వైరు వేసి లోవోల్టేజ్ సమస్యలకు పరిష్కారం చూపలని కిందికి వేలాడెట్టు ఉన్న లైన్లు ఉన్నచోట లైన్లు సరిచేసి అవసరమున్న చోట మరియు ఐరన్ స్తంభాలు ఉన్నచోట కొత్త సిమెంట్ స్తంభలు వేయవలసిందిగ రాష్ట్ర విద్యుత్ వినియోగదారుల చైర్మన్ వై.నారాయణని కోరడం జరిగింది. ఇందుకు గాను ఆయన సానుకూలంగ స్పందిస్తూ 33కెవి లైన్ గురించి సర్వే చేసి సమస్య పరిష్కారం అయ్యే విధంగ అలాగే గ్రామంలో ఎక్కడైతే లూజ్ లైన్ ఉన్నాయో వాటిని కూడ చూస్తామని తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కనగందుల మురళి, చిట్యాల రంజిత్, ఇందూరి అమృత, తదితరులు పాల్గొన్నారు

## చెల్లని చెక్కు కేసులో ఏడాది జైలు శిక్ష

ఖమ్మం లీగల్, నేటి శుభోదయ ::: తిరువూరు కు చెందిన చెల్లని చెక్కు కేసులో నిందితుడైన కే. రాజేంద్ర ప్రసాద్ కుసంవత్సరం జైలు శిక్ష తో పాటు ఫిర్యాదికి నష్టపరిహారం కింద 12 లక్షల రూపాయలు చెల్లించాలని ఖమ్మం రెండో అదనపు ప్రథమ శ్రేణి కోర్టు న్యాయాధికారి ఏపూరి బిందుప్రియ శుక్రవారం తీర్పు చెప్పారు. కేసు వివరాలు.. ఖమ్మం పట్టణం కి చెందిన ఫిర్యాది మేదరమట్ల శ్రీనివాసరావు వద్ద నిందితుడు 9 జనవరి 2016 నాడు, 10 జనవరి 2016 నాడు ఫిర్యాది వద్ద నిందితుడు తమ కుటుంబ అవసరాల నిమిత్తం 5 లక్షల రూపాయలు, 5 లక్షల రూపాయల ను అప్పుగా తీసుకుని అదేరోజు ప్రామిసరీ నోటు రాసిచ్చాడు. ఫిర్యాది తన రుణం తిరిగి చెల్లించాలని వత్తిడి చేయగా 11 నవంబర్ 2016 నాడు 12 లక్షల రూపాయల కు 3 చెక్కులు జారీ చేశాడు. అట్టి చెక్కు లను ఫిర్యాది తన బ్యాంకు ఖాతాలో జమ చేయగా నిందితుని ఖాతాలో సరైపడా నగదు లేనందున తిరస్కరణకు గురైనాయి. ఫిర్యాది తన న్యాయవాది అయిన ఆర్.నారాయణ స్వామి ద్వారా లీగల్ నోటీసు జారీ చేసి కోర్టులో ప్రైవేటు కేసు దాఖలు చేయగా కేసు లోని సాక్షులను విచారించిన న్యాయాధికారి నేరం రుజువు కావడంతో పై విధంగా తీర్పు చెప్పారు.

# గెలిచిన వారందరూ సమర్థులే..

## ఎమ్మెల్యేగా నేను మీ వెంటే ఉంటాను..

- కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి, ఇండిపెండెంట్ కౌన్సిలర్లకు ఎమ్మెల్యే హామీ
- పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ పని చేయండి..
- నూతన కౌన్సిలర్లకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దిశా నిర్దేశం..
- బాధ్యతలు తీసుకున్న మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బస్వం, వైస్ చైర్మన్ అందెమోహన్..
- బిఆర్ఎస్ తదితర కౌన్సిలర్లకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే శంకర్..
- అంగరంగ వైభవంగా మున్సిపల్ పాలకవర్గం బాధ్యతల స్వీకరణ కార్యక్రమం



షాద్నగర్ నియోజకవర్గం నేటి శుభోదయ ప్రతినిధి ఫిబ్రవరి 20 : ప్రస్తుతం పార్టీ ఏదైనప్పటికీ గెలిచిన వారందరూ సమర్థులే.. పార్టీలకు అతీతంగా పనిచేయండి... యువకుల సంఖ్య ఎక్కువగా ఉంది.. మీ యువశక్తిని చాటండి.. ఎమ్మెల్యేగా నేను మీ వెన్నంటే ఉంటాను..షాద్ నగర్ ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మున్సిపల్ కొత్త చైర్మన్ గా అగ్గనూరు బసవేశ్వర్, వైస్ చైర్మన్ గా అందెమోహన్ శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే నూతన చైర్మన్, వైస్ చైర్మన్లతో పాటు కాంగ్రెస్, టిఆర్ఎస్, బిజెపి ఇండిపెండెంట్ పార్టీల కౌన్సిలర్లకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో పార్టీలు, నాయకులు వస్తుంటారు.. పోతుంటారు.. కానీ గెలిపించిన ప్రజలు పెట్టుకున్న ఆశలను వమ్ము చేయకుండా పనిచేసే తమదైన ముద్రవేయాలని అప్పుడే గెలిచినవారు సమర్థులు అవుతారని సూచించారు. బాధ్యతగా వ్యవహరిస్తూ ప్రజలతో అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరించే దిశగా బాధ్యతగా ఉండాలని హితవు చెప్పారు. కౌన్సిలర్లు అందరూ పార్టీలను పక్కనపెట్టి అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని అన్నారు. గెలిచిన చైర్మన్ నుండి కౌన్సిలర్ దాకా అందరూ ప్రజలకు అణిగిమణిగి పని చేయాలని సూచించారు. ఎమ్మెల్యేగా తాను నిరంతరం కౌన్సిలర్లకు అండగా ఉంటానని, పెద్ద ఎత్తున నిధులు తీసుకువచ్చి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరిస్తానని వెల్లడించారు. ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ఈ విషయంలో కౌన్సిలర్లకు తన సహకారాన్ని అందిస్తాడని ఆయన స్పష్టం చేశారు. రెండు పార్టీల్లో యువకులే ఉన్నారని, సమర్థవంతంగా పనిచేసే షాద్ నగర్ ను ఆదర్శవంతంగా తీర్చిదిద్ది యువసత్తాను చాటాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

### సీఎం మెచ్చారు.. అడిగింది ఇస్తారు..

మున్సిపాలిటీ ఎన్నికల్లో షాద్ నగర్ గెలిచిన సంగతి చెప్పగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంతో సంతోషపడ్డారని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. వెంటనే హెచ్ఎండిఏ కమిషనర్ తో మాట్లాడి షాద్ నగర్ మున్సిపాలిటీ అభివృద్ధికి ఏం కావాలన్నా చేయాలని సూచించారని తెలిపారు. దీనిని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుందామని కౌన్సిలర్లకు వెల్లడించారు. అభివృద్ధికి సహకరిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి, పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పార్టీలు ఏవైనా ప్రజలు మాత్రం సమర్థులనే ఎన్నుకున్నారని ఈ సందర్భంగా ఆయన అన్నారు. ఎన్నికలలో కాంగ్రెస్ విజయానికి సహకరించిన మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి శ్యామసుందర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు విశ్వం, కాశీనాథ్ రెడ్డి, శివ శంకర్ గౌడ్, రఘునాయక్, మహమ్మద్ అలీ ఖాన్ బాబర్ తదితరులను ఆయన అభినందించారు. కౌన్సిలర్లు పాలన బాగుండేలా, అవినీతి రహితంగా పాలించాలని సూచించారు. అవకాశాలను అందిపుచ్చుకునేందుకు అవకాశం ఇచ్చిన ప్రజలకు ఎప్పుడు పనిచేసేందుకు సంసిద్ధులై ఉండాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. మున్సిపల్ కౌన్సిలర్లకు పాలకవర్గానికి అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.

### అభినందనల సన్మానాల వెల్లువ

షాద్ నగర్ మున్సిపల్ కొత్త పాలకవర్గం కొలువుదిరిన వేళ వారికి అభినందనలు సన్మాన సత్కారాలు భారీ ఎత్తున జరిగాయి. ఎమ్మెల్యే శంకర్ మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి శ్యాంసుందర్ రెడ్డి శివశంకర్ గౌడ్ రఘునాయక్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్ ఇంకా పార్టీ క్యాడర్ పుర ప్రముఖులు పెద్ద ఎత్తున హాజరై వారికి అభినందనలు తెలుపుతూ శాలువాలు పూల బొకేలతో ఘనంగా సన్మానించారు. చైర్మన్ వైస్ చైర్మన్ తమ సతీమణులతో కలిసి బాధ్యతలు స్వీకరించారు. కౌన్సిలర్లు వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. కుటుంబ సభ్యులతో కౌన్సిలర్లు తదితర పాలకవర్గ సభ్యులు బాధ్యతలు చేపట్టడంతో ఆనందం వెల్లివిరిసింది..

## స్వేరో పలకరింపు: మాజీ జెడ్పిటిసి పరమళ్ల బాలకిష్టయ్యకు నివాళి

### - బాధిత కుటుంబాలకు పరామర్శ

వనపర్తి జిల్లా నేటి శుభోదయ, ఫిబ్రవరి 20: చిన్నంబావి మండల కేంద్రంలోని వెల్లటూరు గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన మాజీ జెడ్పిటిసి పరమళ్ల బాలకిష్టయ్య చిత్రపటానికి స్వేరో సభ్యులు నివాళులు అర్పించారు. "స్వేరో పలకరింపు" కార్యక్రమం ద్వారా మృతిచెందిన వారి కుటుంబాలను ఓదార్చుతూ, మద్యం వంటి అలవాట్లకు దూరంగా ఉండాలని సందేశం ఇచ్చారు. ఒకరి మరణం సమాజానికి ఆరోగ్యకరమైన మార్గదర్శకంగా మారాలని వారు సూచించారు.అదే గ్రామంలో ఇటీవల మృతిచెందిన




మరికొన్ని కుటుంబాలను కూడా పరామర్శించారు. పురుగుల మందు ప్రభావంతో ప్రాణాలు కోల్పోయిన మల్లేశ్వరి (30) కుటుంబాన్ని ఓదార్చి, బాధితులకు ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ మరియు కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి చిన్నంబావి మండలంలోని కొన్ని సంఘటనలపై స్పందించారు. కొంతమంది ప్రజలను బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలంటూ పోలీసులు తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారనే ఫిర్యాదులు అందినట్లు తెలిపారు.ఈ విషయంపై చిన్నంబావి పోలీస్ స్టేషన్ ఎస్ఐను కలిసి వివరాలు తెలుసుకున్న వారు, ప్రజలు తప్పు చేస్తే నిజాయితీగా కేసులు నమోదు చేయాలని, కానీ రాజకీయ కారణాలతో



నిర్దోషులపై కేసులు పెట్టవద్దని కోరారు.

**ఈ కార్యక్రమంలో స్వేరో సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు**

మాజీ ఎంపిపి సోమేశ్వరమ్మ , మాజీ జెడ్పీటిసి వెంకటరమణమ్మ చిన్నరెడ్డి, మాజీ సర్పంచ్ గోవింద్ శ్రీధర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఈదన్న, చిన్నమారు సర్పంచ్ శంకర్ వెలగోండ సర్పంచ్ శరత్ రెడ్డి గారు, మాజీ సర్పంచ్ రంజిత్ కుమార్ గారు, మాజీ సర్పంచ్ రాజేశ్వర్ రెడ్డి శివ రెడ్డి ,స్వరో డైరెక్టర్ బ్రహ్మం ,సంపంగి మద్దిలేటి,స్వామి,మల్లేష్,కే మధు, వంశీ.చిన్నంబావి బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## మీ ఇంటి బిడ్డగా నా ఆడబిడ్డ సేవలందిస్తుంది

### సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్

### అభివృద్ధిలో 31 డివిజన్ ను అగ్రగామిలో నిలుపుత : కౌన్సిలర్ శ్రీజ



ఖమ్మం రూరల్, నేటి శుభోదయ ::: మీ ఇంటి బిడ్డగా నా ఆడబిడ్డ సేవలు అందిస్తుందని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ అన్నారు. శుక్రవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని, 30 డివిజన్లోని శ్రీ సాయి బృందావనం కాలనీలో అభినందన సభను నిర్వహించారు. కౌన్సిలర్ గా ఎన్నికైన 28వ వార్డు కౌన్సిలర్ దండి రంగారావు, 30వ వార్డు కౌన్సిలర్ దండి శ్రీ జాను పూలమాలలు వేసి , సెలవులతో సత్కరించారు. అలాగే ఆ కాలనీవాసైనా భగత్ వీడు తండా సర్పంచ్ భూక్య వసంత లక్ష్మి దంపతులకు సన్మానం చేశారు. తొలుత కాలనీవాసులు మౌలిక వసతులతో పాటు పలు సమస్యలను పరిష్కారం చేయాలని కౌన్సిలర్ శ్రీజ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో దండి సురేష్ మాట్లాడుతూ ప్రజల పక్షాన ప్రశ్నించే గొంతుకైనా భారత కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థి శ్రీజాను గెలిపించటం అభినందనీయంగా కొనియాడారు. ఏ ఆశలు ఆకాంక్షల కోసమై ఇచ్చిన ప్రజల ఆశీర్వాదాన్ని నిలబెట్టుకుంటామన్నారు. పిలిస్తే పలికే గొంతుకల ఈ వార్డు ప్రజల కష్టసుఖాలలో ప్రాంత అభివృద్ధిలో శ్రీజ అలుపెరగని కృషి చేస్తుందన్నారు. అనంతరం విజయ సూచిక కు అభినందనీయంగా ఏర్పాటు చేసిన కేకును కట్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యుడు వెంపటి సురేందర్, కాలనీవాసులు గుడివాడ శ్రీను, సురభి సాయి, సాంబశివరావు, ఆంగోతి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతా

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సహకారంతో 31 డివిజన్ ను అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతానని కౌన్సిలర్ దండి శ్రీజ అన్నారు. తన గెలుపులో ప్రత్యక్షంగా పరోక్షంగా కృషి చేసిన వారితో పాటు ఓటు వేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపింది. ప్రజల ఆశలు ఆకాంక్షలకు అనుగుణంగా తన పని విధానం ఉంటుందన్నారు. మున్సిపాలిటీ నుంచి నిధులు తీసుకువచ్చి, డివిజన్ రూపు రేఖలు మారుస్తానన్నారు.



## సదాశివపేట సంగారెడ్డి మున్సిపల్ అభివృద్ధికి..

# సదా నేను అండగా ఉంటా

### తనను కలిసిన సదాశివపేట సంగారెడ్డి మున్సిపల్ నూతన పాలకవర్గంతో కలెక్టర్ పి.ప్రావీణ్య హామీ



సదాశివపేట ఫిబ్రవరి 20 నేటి శుభోదయ ప్రతినిధి : టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి తో కలిసి కలెక్టర్ ను కలిసిన సదాశివపేట సంగారెడ్డి నూతన పాలకవర్గ సభ్యులుఇటీవల నూతనంగా ఎన్నికైన సదాశివపేట సంగారెడ్డి మున్సిపల్ పాలకవర్గ సభ్యులు ఈరోజు శుక్రవారం సంగారెడ్డి కలెక్టర్ పి. ప్రావీణ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈరోజు సంగారెడ్డి జిల్లా కేంద్రంలో సంగారెడ్డి కలెక్టరేట్ కార్యాలయంలో ఆమెను కలిసారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన చైర్ పర్సన్, వైస్ చైర్పర్సన్, కౌన్సిలర్లకు ఆమె అభినందనలు తెలియజేశారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, నిర్మల ఇచ్చిన మాట మేరకు సదాశివపేట సంగారెడ్డి మున్సిపాలిటీలో అభివృద్ధి కార్యక్రమాలకు మేం కట్టుబడి ఉన్నామని వారు కలెక్టర్ కు వివరించారు.టీ పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మల సూచనల మేరకు సదాశివపేట సంగారెడ్డి మున్సిపల్ సమగ్ర అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని వారు కలెక్టరుకు వివరించారు. మెరుగైన పారిశుద్ధం, ఇంటింటికి స్వచమైన తాగునీరు, ప్రతి గల్లీలో సిసి రోడ్లు,ఇలా అన్ని సదుపాయాలు కల్పిస్తామని వాళ్ళు వివరించారు. సదాశివపేట సంగారెడ్డి మున్సిపల్ పాలకవర్గంలో యువతీ యువకులు ఎక్కువగా ఉన్నారని, ఇది మున్సిపాలిటీకి చాలా ప్రయోజనం చేకూర్తుందని ఈ సందర్భంగా కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలను తెలుసుకుని, వాటిని పరిష్కరించాలని పాలకవర్గానికి ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత కిషన్, సంగారెడ్డి మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ షఫీ హాఫిజ్, సదాశివపేట చైర్ పర్సన్ అంజమ్మ సత్యనారాయణ. వైస్ చైర్మన్ రేణుక చిరంజీవి. సదాశివపేటకు సంబంధించిన కౌన్సిలర్లు సంగారెడ్డికాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బొంగుల రవి, కూన సంతోశ్, కౌన్సిలర్లు శ్రీకాంత్, ప్రశాంత్ రెడ్డి, రవి నాయక్, గుర్రం ఝాన్సీ, మోతే శ్యామ్, వీణ తదితరులు పాల్గొన్నారు.



## తాళ్లగూడ గ్రామంలో అండర్ డ్రైనేజీ సిసి రోడ్లకు శంకుస్థాపన చేసిన షాద్నగర్ ఎమ్మెల్యే

### సట్లపల్లి గోవింద్ గౌడ్ ఆధ్వర్యంలో హెచ్ఎండిఏ నిధులతో అండర్ డ్రైనేజీ సిసి రోడ్



**(నేటి శుభోదయ):** షాద్నగర్ నియోజకవర్గం పరిధిలోని నందిగామ మండల పరిధిలోని తాళ్లగూడ గ్రామంలో హెచ్ఎండిఏ నిధుల ద్వారా రూ.10 లక్షల వ్యయంతో చేపట్టిన అండర్ డ్రైనేజ్, సీసీ రోడ్ పనులను షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు.గ్రామ సర్పంచ్ సట్లపల్లి గోవింద్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే శంకర్ ముఖ్య అతిథిగా హాజరై పనులకు శంకుస్థాపన చేశారు. గ్రామాభివృద్ధికి మౌలిక వసతులు అత్యంత కీలకమని, సీసీ రోడ్డు మరియు డ్రైనేజ్ మరియు రోడ్ల అభివృద్ధి ద్వారా గ్రామ ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం కలుగుతుందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు నరసింహ యాదవ్, కొత్తూరు మున్సిపాలిటీ మండల పార్టీ అధ్యక్షుడు జే సుదర్శన్ గౌడ్, కొత్తూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు హరినాథ్ రెడ్డి, వెంకమ్మగూడ మాజీ సర్పంచ్ బుయ్యని రజినిత వీరేందర్ గౌడ్, తాళ్లగూడెం ఉప సర్పంచ్ లక్ష్మయ్య వార్డ్ మెంబర్ కుడుముల ప్రవీణ్ కుమార్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు బోకుల సత్తయ్య జిపిఓ నరసింహులు ఎంపీఓ చక్రధర్ గౌడ్ మాజి వార్డ్ మెంబర్ కందదా రాజేందర్ గ్రామ పెద్దలు సట్లపల్లి మల్లేష్ గౌడ్ కుడుముల యాదయ్య గౌడ్ విక్రమ్ గౌడ్ బొమ్ము యాదయ్య గౌడ్ కందాడ ఈశ్వరయ్య కృష్ణ విట్టలయ్య గ్రామ పెద్దలు నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థులు చదువుకునే కళాశాలలో మెరుగైన విద్యా బోధన చేయాలి : ఎమ్మెల్యే కూనంనేని



ఖమ్మం, కొత్తగూడెం, నేటి శుభోదయ ::: పేద విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ కళాశాలల్లో మెరుగైన విద్యాబోధన కొనసాగించాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేసిన సరస్వతి మాత విగ్రహాన్ని శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జూనియర్ కాలేజీ అభివృద్ధి కోసం ప్రభుత్వంతో మాట్లాడి రూ.3.86 కోట్లు మంజూరు చేయించడం జరిగిందన్నారు. గతంలో కూడా కళాశాల నూతన భవన సముదాయం కోసం రూ.కోటి రూపాయలు, బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ విభాగం నుంచి రూ.58 లక్షలు మంజూరు చేయించానన్నారు. ఇక్కడ చదువుకునే పేద విద్యార్థులకు వారికి అర్థమయ్యే పద్ధతిలో లెక్చరర్లు ముందుగానే సిద్ధమై బోధించాలన్నారు. మంచి చదువు ఉంటేనే సమాజంలో గౌరవం, గుర్తింపుతో పాటు విదేశాల్లో చదువుకునే అవకాశం ఉంటుందన్నారు. అందుకే ప్రతి విద్యార్థి కష్టపడి చదువుకోవాలని ఎమ్మెల్యే కూనంనేని పిలుపునిచ్చారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కత్తి రమేష్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా, కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, విద్యానగర్ పంచాయతీ సర్పంచ్ శాంతి ప్రియ, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు సంఘం వెంకట పుల్లయ్య, ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి హెచ్.వెంకటేశ్వరరావు, సరస్వతి విగ్రహ దాత సరంజన్ కుమార్ అగ్రవాల్, బీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.సీతారాం, కళాశాలలోని అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ఈ కార్యక్రమానికి విచ్చేసిన అతిథులను, పూర్వ విద్యార్థులను, విగ్రహ ఏర్పాటుకు సహకరించి, ఆర్థిక సాయం అందించిన వారిని ఘనంగా సన్మానించారు.

## ఏన్కూరు మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం

### ఏన్కూర్ లో ఐటిఐ కాలేజీ.

### సేవాలాల్ మహారాజ్ సేవలను ఆదర్శంగా తీసుకోవాలి.



ఏన్కూర్,( నేటి శుభోదయ):: బంజారా జాతికి సేవాలాల్ మహారాజ్ మహనీయుని స్మరిస్తూ జయంతి ఉత్సవాలు జరుపుకోవటం ఎంతో సంతోషం కలిగిస్తుందని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. ఏన్కూరు మండల పరిధిలోని హిమామ్ నగర్ ప్రాంగణములో శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.... .. ఏన్కూరు మండలాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తాం .ఐటిఐ కాలేజ్ ని త్వరలో ఏర్పాటు చేస్తామని



తెలిపారు. ఈ ప్రాంతానికి రైతాంగం ఎక్కువ ఉండటంతో సీతారామ ప్రాజెక్టును, గోదావరి జలాల నీళ్లను తీసుకొని రావడంతో రైతుల కళ్ళలో ఆనందం చూస్తున్నానని అన్నారు. సేవాలాల్ మహారాజ్ బంజారా జాతికి ఒక గొప్ప మార్గదర్శకుడు అన్నారు. కేవలం గిరిజనుల ఆరాధ్య దైవమే కాకుండా బడుగు ,బలహీన వర్గాల కోసం అనేక పోరాటాలు చేశారని స్మరించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ గిరిజనుల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. సేవాలాల్ గుడికి కమ్యూనిటీ హాలుకు ఎకరం భూమిని కేటాయించి ఇవ్వాలని ఏన్కూర్ తాహసిల్దార్ ను ఆదేశించారు. అదేవిధంగా గోదాము కు 5 ఎకరాల భూమిని కేటాయించి ఇవ్వాలని తాహసిల్దార్ ను కోరారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ మహారాజ్ నియోజకవర్గ కన్వీనర్ జ్యోతి, ట్రైబల్ వెల్ఫేర్ డిడి విజయలక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ లచ్చిరాం నాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు స్వర్ణ నరేందర్, తాహసిల్దార్ సిహెచ్ శేషగిరిరావు, మేడ ధర్మారావు, బంజారా నాయకులు, సేవాలాల్ కమిటీ సభ్యులు, గ్రామ సర్పంచులు, ఉప సర్పంచులు వివిధ శాఖ అధికారులు, వివిధ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శాంతినికేతన్ పూర్వ విద్యార్థులు పీజీ మెడికల్ లో ఉత్తమ ర్యాంకులు



### మాలిపటేల్ ప్రభు -ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి

సదాశివపేట ఫిబ్రవరి 20 నేటి శుభోదయ ప్రతినిధి : పట్టణం నందు గత 28 సంవత్సరాలుగా నడపబడుతున్న శాంతినికేతన్ విద్యాలయం విద్యార్థులు ఎన్నో రంగాలలో అద్భుత ప్రతిభను చాటి ఉత్తమ పౌరులుగా ఎదగడం శాంతినికేతన్ విద్యాలయానికి గొప్ప గర్వకారణం అని ప్రైవేటు పాఠశాల యాజమాన్యాల సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మాలిపటేల్ ప్రభు అన్నారు. సాధారణ విద్యార్థులను అసాధారణ స్థాయికి తీసుకెళ్లినటువంటి విద్యా సంస్థ శాంతినికేతన్ విద్యాలయం అని గర్వంగా తెలియజేస్తున్నాం అన్నారు గతంలో చాలామంది విద్యార్థులు ఇండియన్ రూపీ లో మరియు రామగుండం జన్ కో లో మరియు జే ఎన్ టి యు లో విజ్ఞాన శాస్త్రవేత్త చిత్రం మీదిగా మరియు బీటెక్ రంగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విధంగా ఈరోజు ఎంబిబిఎస్ పూర్తి చేసుకొని మాస్టర్ ఆఫ్ సర్జికల్ ( ఎంఎస్ ) నందు మా పాఠశాల పూర్వ విద్యార్థులు డి శ్రావణి మరియు శ్రీశైలం లు ఉత్తమ ర్యాంకులు సాధించి ప్రభుత్వ మెడికల్ కళాశాల యందు ఫ్రీ సీట్ పొందినందుకు విద్యార్థులను పాఠశాల యాజమాన్యం మాలి పటేల్ ప్రభు ఘనంగా సన్మానించారు. ఇంతటి విద్యావంతులను తయారుచేసిన ఉపాధ్యాయులకు పాఠశాల ఎల్లవేళలా రుణపడి ఉంటుందని అన్నారు .మరెన్నో ఉత్తమ ఫలితాలు సాధించడానికి ప్రస్తుత ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు తల్లిదండ్రులు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు

## ఇంజనీరింగ్ విద్యార్థుల ఆవిష్కరణలకు ప్రోత్సాహం- హ్యాకథాన్

### పొన్నేకల్ శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కాలేజీ





ఖమ్మం రూరల్, నేటి శుభోదయ ::: ఖమ్మం రూరల్ మండలం పొన్నేకల్ శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కాలేజీ లో నిర్వహించిన రెండు రోజుల జాతీయ స్థాయి హ్యాకథాన్ కార్యక్రమం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతంగా ప్రారంభం అయింది. సుమారు 114 టీమ్స్ ఈ హ్యాకథాన్‌లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించాయి. కలశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సాయి గీతిక మాట్లాడుతూ ఈ సాంకేతిక పోటీ విద్యార్థులకు ఒక గొప్ప వేదికగా నిలిచింది అని హ్యాకథాన్ యొక్క ముఖ్య ఉద్దేశ్యం కొత్త ఆలోచనలను వెలికి తీయడం,రియల్ టైమ్ సమస్యలకు టెక్నాలజీ ఆధారిత పరిష్కారాలు కనుగొనడం,టీమ్ వర్క్, లీడర్‌షిప్ మరియు టైమ్ మేనేజ్‌మెంట్ నైపుణ్యాలను అభివృద్ధి చేయడం,స్టార్టప్ ఐడియాలను ప్రోత్సహించడం అని అన్నారు.ఈ హ్యాకథాన్‌లో విద్యార్థులు 24 గంటల పాటు నిరంతర శ్రమతో తమ ఆవిష్కరణాత్మక ఆలోచనలను ప్రాజెక్టుల రూపంలో ఆవిష్కరించారు. ముఖ్యంగా సెమికండక్టర్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ( ఏఐ ), ఎలక్ట్రిక్ వెహికిల్ ( ఇవి) టెక్నాలజీ, కాంక్రీట్ టెక్నాలజీ, మెకానికల్ ఇంజనీరింగ్ రంగాలకు సంబంధించిన ఆధునిక మరియు పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన ప్రాజెక్టులు ప్రదర్శించబడ్డాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ ( టిఐటిఏ ) హెడ్ మాట్లాడుతూ సందీప్ ముక్తాలా , తెలంగాణ వ్యాప్తంగా ఇంత పెద్ద ఎత్తున టీమ్స్ పాల్గొనడం అభినందనీయమని అన్నారు. ఇలాంటి హ్యాకథాన్‌లు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను అభివృద్ధి చేసేందుకు దోహదపడతాయని తెలిపారు. కళాశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ మాట్లాడుతూ, రాష్ట్ర స్థాయి పోటీల ద్వారా విద్యార్థుల్లో పోటీ భావన, ఆవిష్కరణాత్మక దృక్పథం పెంపొందుతుందని పేర్కొన్నారు.ఇంత భారీ స్థాయిలో నిర్వహించిన ఈ హ్యాకథాన్ సాంకేతిక రంగంలో కొత్త ఆవిష్కరణలకు మార్గదర్శకంగా నిలిచిందని తెలిపారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ రావు తేజ మాట్లాడుతూ, మెడికల్,సెమికండక్టర్ మరియు ఎలక్ట్రిక్ వెహికిల్ రంగాల్లో తెలంగాణ యువతకు అపార అవకాశాలు ఉన్నాయని, విద్యార్థులు గ్లోబల్ స్థాయిలో పోటీ పడగల స్థాయికి ఎదగాలని సూచించారు. కళాశాల డైరెక్టర్ విద్య మాట్లాడుతూ, పరిశ్రమలతో అనుసంధానమైన ప్రాజెక్టులపై కళాశాల ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు.ఈ హ్యాకథాన్ ద్వారా విద్యార్థులు పరిశ్రమలో ఎదురయ్యే సవాళ్లకు మరియు డేటా విశ్లేషణలో ఆధునిక పద్ధతులు నేర్చుకోవడం మరయు ప్రాక్టికల్ హాండ్స్-ఆన్ అనుభవం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ రంగాల్లో కంపెనీ ల లో రియల్-టైమ్ కేస్ స్టడీస్ కి ఎంతగానో ఉపయోగ పడుతుంది అని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మి నారాయణ మాట్లాడుతూ, ఈ హ్యాకథాన్ విద్యార్థుల్లో టీమ్ వర్క్, టైమ్ మేనేజ్‌మెంట్, సమస్య పరిష్కరణ నైపుణ్యాలను పెంపొందించిందని పేర్కొన్నారు. సెమికండక్టర్ రంగంలో తక్కువ పవర్ వినియోగంతో



పనిచేసే చిప్ డిజైన్‌లు, ఎంబెడెడ్ సిస్టమ్ నమూనాలు ఆకట్టుకున్నాయి. ఏఐ విభాగంలో హెల్త్ మానిటరింగ్ సిస్టమ్స్, ఫేస్ రికగ్నిషన్ ఆధారిత సెక్యూరిటీ మోడల్స్, స్మార్ట్ అనలిటిక్స్ అప్లికేషన్లు ప్రదర్శించబడ్డాయి. ఇవి టెక్నాలజీలో అధిక సామర్థ్యం కలిగిన బ్యాటరీ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్, స్మార్ట్ ఛార్జింగ్ స్టేషన్లు, ఎనర్జీ ఎఫిషియెంట్ డ్రైవ్ సిస్టమ్స్ రూపొందించారు. కాంక్రీట్ టెక్నాలజీలో పర్యావరణహిత మరియు అధిక బలమైన కాంక్రీట్ మిశ్రమాలపై వినూత్న పరిశోధనలు చోటుచేసుకున్నాయి.మెకానికల్ విభాగంలో ఆటోమేషన్ ఆధారిత యంత్రాలు, తక్కువ ఖర్చుతో వ్యవసాయ యంత్రాల నమూనాలు, స్మార్ట్ తయారీ విధానాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ముగింపు కార్యక్రమంలో ఉత్తమ ప్రాజెక్టులకు నగదు బహుమతులు, ట్రోఫీలు మరియు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల జరిగిన కార్యక్రమం లో టి ట ప్రతినిధులు యామిని, వంశీ, కలశాల డీన్ డాక్టర్ వి సుదర్శన్, టి పి ఓ డాక్టర్ రాజేష్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వైశాలి, డిప్లమా ఇన్చార్జి కృష్ణ ప్రసాద్, డాక్టర్ జ్యోతి, డాక్టర్ ప్రణతి, డాక్టర్ చార్యులు, సురేష్ పాల్గొన్నారు.

## పదోన్నతి ఉద్యోగులు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

### జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

### జవాబుదారితనంతో పనిచేస్తూ ప్రభుత్వ వ్యవస్థ పై నమ్మకం పెంచాలి

### ఖమ్మం రెవెన్యూ శాఖలో పదోన్నతులు పొందిన 15 మందికి నియామక ప్రతాలను అందజేసిన జిల్లా కలెక్టర్



ఖమ్మం, నేటి శుభోదయ ::: విధుల పట్ల నిబద్ధతతో ఉంటూ, ప్రభుత్వ వ్యవస్థ పై నమ్మకాన్ని పెంచుతూ కొత్తగా నియమితులైన ఉద్యోగులు జవాబుదారితనంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ నందు ఖమ్మం రెవెన్యూ శాఖలో పదోన్నతులు పొందిన 15 మందికి అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తో కలిసి జిల్లా కలెక్టర్ నియమాక ప్రతాలను అందజేశారు. ముందుగా జిల్లా రెవెన్యూ శాఖలో విధులను నిర్వహిస్తున్న 15 మంది నాలుగో తరగతి, డ్రైవర్లు, రికార్డ్ అసిస్టెంట్ కేటగిరీ ఉద్యోగులకు జూనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు లభించిన సందర్భంగా తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ ఖమ్మం జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ కొత్త బాధ్యతలు స్వీకరిస్తున్న సిబ్బంది విషయ పరిజ్ఞానాన్ని, విధుల పట్ల అవగాహన పెంపొందించుకోవాలని, డ్రాఫ్టింగ్, కంప్యూటర్ వినియోగంపై పట్టు సాధించాలని సూచించారు. నిరంతరం నేర్చుకునే తత్వాన్ని అలవరుచుకొని, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని, ప్రజలకు త్వరితగతిన, పారదర్శకమైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని, నిబద్ధతతో విధులు నిర్వహించి ప్రజా సేవలో ముందుండాలని కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ ఉద్యోగ వ్యవస్థను బలోపేతం చేసేందుకు పోస్టింగ్ ఎక్కడ వచ్చిన మంచి పని చేస్తే గుర్తింపు వస్తుందని, ఉత్తమంగా పనిచేస్తున్న వారికి ప్రోత్సాహం ఉంటుందని అన్నారు. ఉత్తమ సేవలతో పనిచేసే శాఖకు, జిల్లాకు మంచి పేరు తేవాలని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాల అమలు చేసేందుకు బాధ్యతతో పనిచేయాలని, మీపై అధికారులతో కలిసి వృత్తి పట్ల, నిజాయితీ, నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని, ఉత్తమ సేవలతో అందరి అభిమానం పొందుతూ మంచి పేరు తేచ్చుకోవాలని కలెక్టర్ తెలిపారు. ట్రెసా జిల్లా అధ్యక్షులు తుంబూరు సునీల్ రెడ్డి మాట్లాడుతూ, రెవెన్యూ ఉద్యోగుల సంక్షేమానికి జిల్లా యంత్రాంగం అందిస్తున్న సహకారం అభినందనీయమని అన్నారు. కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు స్వయంగా అభినందించి, భవిష్యత్తుపై దిశానిర్దేశం చేయడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. “కష్టానికి తగిన ప్రతిఫలం లభించినప్పుడు కలిగే ఆనందం వెలకట్టలేనిది” అన్నారు. ఒకేసారి 15 మందికి పదోన్నతులు లభించడంతో జిల్లా రెవెన్యూ శాఖలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో ట్రెసా జిల్లా కార్యవర్గ సభ్యులు, వివిధ డివిజన్ల ప్రతినిధులు, కలెక్టరేట్ యూనిట్ సభ్యులు మరియు పదోన్నతి పొందిన ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## మలకపేట యశోదా హాస్పిటల్ లో అధునాతన వైద్య సదుపాయాలు అనుభవజ్ఞులైన నిపుణులతో అత్యవసర సేవలు అందుబాటులోకి



ఖమ్మం, నేటి శుభోదయ ::: ఖమ్మం ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మలక్ పేట్ యశోదా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ కన్సల్టెంట్ న్యూరో ఫిజీషియన్ డాక్టర్ సూరిశెట్టి భరత్ కుమార్ పలు విషయాలను వెల్లడించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రామవరం ప్రాంతానికి చెందిన 33 సంవత్సరాల శ్రీమతి మరముల్ల ప్రియాంక భర్త రాంబాబు 12/06/2025 న వాంతులు , విరేచనాలు వంటి లక్షణాలతో కండర బలహీనత వల్ల మలకపేటలో యశోదా హాస్పిటల్ లో చేరారని వెంటనే సమగ్ర రక్తపరీక్షలు , బయోకెమికల్ మూల్యాంకనం, బహుళ విభాగాల వైద్యుల పరిశీలన అనంతరం మొదట బయట హైవికలేమియా గా గుర్తించి అధునాతన చికిత్స కోసం అడ్మిట్ అయ్యారని పేర్కొన్నారు . ఆసుపత్రిలో చేరిన సమయంలో తీవ్రమైన పోటాషియం లోపం, శారీరక అస్థిరత గమనించబడిందని అన్నారు . తీవ్రమైన ఎలక్ట్రోలైట్ అసమతుల్యతలు, ఆటోఇమ్యూన్ సంబంధిత మెటబాలిక్ వ్యాధులు సకాలంలో చికిత్స చేయకవిత ప్రాణాపాయ స్థితులకు దారితీసే అవకాశం ఉంటుంది . ముఖ్యంగా హైపోకలేమిక్ పీరియాడిక్ ప్యారాలిసిస్ వంటి వ్యాధులు మూత్రపిండ సమస్యలు మరియు ఆటోఇమ్యూన్ రుగ్మతలతో కలిసివస్తే నరాల వ్యవస్థపై తీవ్రమైన ప్రభావం చూపవచ్చు . ఇలాంటి



క్లిష్ట పరిస్థితుల్లో ముందస్తు గుర్తింపు , సమగ్ర వైద్య మూల్యాంకనం, బహుళ విభాగాల సమన్వయంతో కూడిన చికిత్స అత్యంత అవసరమన్నారు . హైపోకలేమిక్ పీరియాడిక్ పెరాలిసిస్ మెరుగుదలలో ప్రైమరీ షోన్స్ సిండ్రోమ్ , డిస్టల్ రీనల్ ట్యూబ్యులర్ అసిడోసిస్ , సెంట్రల్ ఫాంటైన్ మైలినోలిసిస్ , కొత్తగా ప్రారంభమైన సిక్స్ హైపర్కలేమియా సరిచేయబడింది . రోగిని అత్యంత జాగ్రత్తతో పర్యవేక్షించే విభాగంలో ఉంచి , నియంత్రిత విధానంలో విటాషియం స్థాయిలను సరిచేయడం , ఎలక్ట్రోలైట్ సమతుల్యతను క్రమం తప్పకుండా పరిశీలిస్తూ , ఆకస్మిక మార్పులు జరగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నాము . చికిత్సలో భాగంగా తీవ్రమైన హైపోకలేమియా నియంత్రితంగా సరిచేయడం , సీల్డ్స్ నియంత్రణకు యాంటీ ఎపిలెప్టిక్ మందులు , రీనల్ ట్యూబ్యులర్ ఆసిడోసిస్ కు తగిన చికిత్స ప్రైమరీ షోన్స్ సింద్రోమ్కు ఇమ్యూనోథెరపీ , చికిత్స సమయంలో వచ్చిన హైపర్కలేమియాను వెంటనే గుర్తించి సరిచేయడం , న్యూరాలజీ , నెఫ్రాలజీ , రుమటాలజీ , క్రిటికల్ కేర్ , జనరల్ మెడిసిన్ తదితర విభాగాల వైద్యులు సమన్వయంతో చికిత్స అందించము . క్రమంగా రోగిలో కండర బలం మెరుగుపడి , ఏటాషియం స్థాయిలు స్థిరపడ్డాయి . హైపోకలేమిక్ పీరియాడిక్ ప్యారాలిసిస్ ప్రాణాపాయ స్థితికి దారితీసి వ్యాధి . తీవ్ర పొటాషియం లోపం వల్ల అకస్మాత్తుగా కండర బలహీనత, శ్వాస సమస్యలు రావచ్చు . ముఖ్యంగా ఆటోఇమ్యూన్ మరియు మూత్రపిండ సంబంధిత కారణాలను గుర్తించడం అత్యంత కీలకం . సకాలంలో ఎలక్ట్రోలైట్ సరిచేయడం, బహుళ విభాగాల సమన్వయం ఈ కేసులో కీలక పాత్ర పోషించాయి అని



అన్నారు . ఫలితంగా ఆసుపత్రి చికిత్స సమయంలో రోగి స్థిరంగా కోలుకుని , కండర బలం మెరుగుపడి , ఎలక్ట్రోలైట్ స్థాయిలు సాధారణ స్థాయికి చేరి 18/06/2025న రోగిని స్థిర స్థితిలో డిశ్చార్జ్ చేసి , ఔషధాలు , ఆహార నియమాలు, క్రమమైన ఫాలోఅప్ సూచనలు ఇచ్చాము . ఈ కేసు యశోదా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ మలకపేట లో అందుబాటులో ఉన్న అత్యాధునిక నిర్ధారణ సదుపాయాలు , అనుభవజ్ఞులైన నిపుణులు మరియు 24 గంటల క్రిటికల్ కేర్ సేవల సామర్థ్యాన్ని మరోసారి చాటిచెప్పిందని అన్నారు .

## నూతనంగా ఎన్నుకోబడిన 8 మంది బీఆర్ఎస్ పార్టీకి సంబంధించిన మున్సిపల్ కౌన్సిల్ సభ్యులుప్రమాణ స్వీకారం




సదాశివపేట ఫిబ్రవరి 20 నేటి శుభోదయ ప్రతినిధి : మున్సిపల్ కార్యాలయంలో నూతనంగా ఎన్నుకోబడిన 8 మంది బీఆర్ఎస్ పార్టీకి సంబంధించిన మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ శివాజీ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా కౌన్సిల్ సభ్యులు మాట్లాడుతూ తమ వార్డుల అభివృద్ధికి కొరకు కృషి చేస్తూ, అధికార పార్టీ ఏవైతే హామీలు చెప్పి అధికారంలోకి వచ్చారో ఆ హామీలు అమలు చేసే వరకు నిరంతరం ప్రజాక్షేత్రంలో, మున్సిపల్ కౌన్సిల్ లో ప్రజల పక్షాన నిలబడి కొట్లాడతాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 26 నుండి 29 వరకు శ్రీ రామలింగేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం ప్రారంభం

### గోడ పత్రిక ఆవిష్కరణలో - మల్లి బాబు యాదవ్



ఖమ్మం, కామేపల్లి, నేటి శుభోదయ ::: కామేపల్లి మండలం కొమ్మినేపల్లి - పండితాపురం గ్రామంలో వేంచేసియున్న శ్రీ రామలింగేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం( తాళ్ల తిరునాళ్ల) కొమ్మినేపల్లి పండితాపురం భక్త జన బృందం వారి ఆధ్వర్యంలో ఈనెల 26వ తారీకు గురువారం నుండి 1/3/2026 ఆదివారం వరకు జరుగుతుందని, మహోత్సవ కార్యక్రమంలో భక్తులు విశేషంగా పాల్గొన వలసిందిగా మాజీ జడ్పిటిసి డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ పిలుపునిచ్చారు. శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయము వద్ద శుక్రవారం సర్పంచ్ ధరావత్ అనురాధ, ఉప సర్పంచ్ మల్లికార్జునరావు, మద్దినేని రమేష్ బాబు, ధనియాకుల మాధవరావు ల తో కళ్యాణ మహోత్సవ గోడపత్రికను మల్లి బాబు యాదవ్ లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్లిబాబు యాదవ్ మాట్లాడుతూ కొమ్మినేపల్లి పండితాపురం గ్రామంలో దాదాపు 200ల సంవత్సరాల క్రితం కాకతీయుల కాలంలో శ్రీ రామలింగేశ్వర స్వామిని ప్రతిష్టించడం జరిగిందని, నాటినుండి ప్రతి ఏడాది మహాశివరాత్రి తదనంతరం తొమ్మిదో రోజు నుండి కళ్యాణ మహోత్సవం జరుగుతుందని, ఈ సందర్భంగా మహా తిరునాళ్ల( జాతర) నిర్వహించబడుతుందని, ఈ కార్యక్రమానికి ఖమ్మం వరంగల్, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల నుండి భారీ ఎత్తున భక్తులు పాల్గొంటారని, తెలిపారు. శ్రీ రామలింగేశ్వర స్వామిని తలుచుకుని ఏ కార్యక్రమం చేపట్టినా విజయవంతంగా జరిగితీరుతుందని బత్తుల విశ్వాసంగా పేర్కొనటం జరుగుతుందని, కావున ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయవలసిందిగా మల్లి బాబు యాదవ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ కొమ్మినేని శ్రీనివాసరావు ధరావత్ లాలు, శీలం పుల్లయ్య తోటకూరి భద్రయ్య, వార్డ్ మెంబర్లు దొడ్డ పరమేష్, బానోతు రామచంద్రు, బానోతు స్వర్ణ గూగులోత్ భావసింగ్ గ్రామ నాయకులు పాటిబండ్ల ప్రసాదు ఉప్పుగుండ్ల వీరభద్రం దిండిగల శబరినాథ్, దొడ్డ నాగేశ్వరరావు, బండి ఎల్లయ్య జన్నారపు లింగయ్య బత్తుల ఉపేందర్, దొడ్డ వేణు, అంబడిపూడి వెంకటయ్య పాటి బాబు కొమ్మిని వెంకన్న దొడ్డ మల్లేశం చల్లా వీరన్న బాధావత్ నాగరాజు బత్తుల వీరబాబు బేతి వెంకటేశ్వర్లు మరియు తదితరులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

## వనంపల్లి జంగమ్మ మృతికి జైపాల్ రెడ్డిని కలిసి పరామర్శించిన సిపిఐ పార్టీ రంగారెడ్డి జిల్లా సమితి సభ్యులు జె ఆనంద్ గౌడ్ బ్రదర్స్...



రాజేంద్రనగర్,ఫిబ్రవరి20(నేటి శుభోదయ):రంగారెడ్డి జిల్లా ఏఐటియుసి కార్యదర్శి,తెలంగాణ మున్సిపల్ సంఘం రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డిని నాగర్ కర్నూల్ జిల్లా తాడూర్(మండలం)భల్లాన్ పల్లి (గ్రామం)వనంపల్లి జైపాల్ రెడ్డి అమ్మ వనంపల్లి జంగమ్మ మహబూబ్ నగర్ హాస్పిటల్ లో చికిత్స పొందుతూ మరణించడం జరిగిందని సిపిఐ పార్టీ రంగారెడ్డి జిల్లా సమితి సభ్యులు జె ఆనంద్ గౌడ్ తెలిపారు.అనంతరం వనంపల్లి జైపాల్ రెడ్డిని స్వగ్రామమైన భల్లాన్ పల్లి గ్రామానికి సిపిఐ పార్టీ రంగారెడ్డి జిల్లా సమితి సభ్యులు జె ఆనంద్ గౌడ్,రాజేంద్రనగర్ మండలం సిపిఐ పార్టీ సహాయ కార్యదర్శి జె విజయానంద్ గౌడ్,రంగారెడ్డి జిల్లా గౌడ సంఘం ఉపాధ్యక్షులు జే సదానందం గౌడ్ బ్రదర్స్ కలిసి వెళ్లి వనంపల్లి జంగమ్మ ఆత్మకు శాంతి చేకూరాలి ఆ భగవంతుని కోరుతున్నాను అని తెలిపారు.అనంతరం కుటుంబ సభ్యులందరూ అధైర్య పడకుండా ధైర్యంగా ఉండాలని ఓదార్చి రావడం జరిగిందన్నారు.

## ఛేదించారు -బొగ్గుల శ్రీనివాస్ హత్యకేసులో వీడుతున్న మిస్టరీ

### ఆర్థిక, హార్దిక కారణాలే అంతమొందించాయ్

ఖమ్మం, నేటి శుభోదయ ::: ప్రముఖ రచయిత, సాహితీ వేత్త, తన రచనల ద్వారా వివాదాలలో ఉండే గొల్ల అలియాస్ బొగ్గుల శ్రీనివాస్ హత్య కేసు కొలిక్కి వచ్చినట్లు తెలుస్తుంది. స్నేహితుడే హంతకునిగా మారి నమ్మించి మర్డర్ చేసినట్లు, దానిని కప్పిపుచ్చుకునేందుకు కారుప్రమాదం నాటకం ఆడినట్లు పోలీసులు ఇప్పటికే అవగాహనకు వచ్చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు, కారు యజమాని, మృతుని మిత్రుడు ఎం విజి రెడ్డి కోసం ఇప్పటికే మూడు బృందాలుగా పోలీసులు వెతుకుతుండగా, నేడో రేపో దర్యాప్తు పూర్తి చేసేస్తారని తెలుస్తుంది. వెనుక సీట్లో కూర్చున్న శ్రీనివాస్ కారు ప్రమాదంలో పాలేరు జలాశయం లో మునగటంతోనే చనిపోయాడని మొదట అనుకున్నా, కారు డ్రైవర్ వెంటనే పరారు కావటం, కారు యజమాని ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ లో ఉండటం, మృతుని శరీరంపై అనేక గాయాలు ఉండటం మొత్తంగా వ్యవహారమే అనుమానాస్పదం గా ఉండటం చేత హత్యగా పరిగణలోకి తీసుకున్న బొగ్గుల మర్డర్ కేసులో అనేక సంచలన విషయాలు ఉన్నట్లు చర్చ జరుగుతుంది. పాలేరు జలాశయం ప్రమాదానికి 12గంటల ముందే శ్రీనివాస్ ను పదునైన ఆయుధాలతో దాడిచేసి, పొడిచి చంపి, అప్పుడు కార్లో రాత్రంతా తిప్పి పాలేరు లో ప్రమాదపు నాటకానికి తెర లేపినట్లు తెలుస్తుంది. అయితే ఈ హత్య లో ఒక్కడే నిందితుడా, మరెవరైనా ప్రధాన నిందితునికి సహకరించారా, ఆయా మాధ్యమాలలో వస్తున్న కథనాల ప్రకారం కేవలం 60లక్షల జీఎస్టీ ఎగ్గొట్టేందు కోసమే నమ్మకద్రోహం చేశారా అనేది పోలీసుల దర్యాప్తు పూర్తి అయితేనే బయటకు వస్తుంది. కానీ కేవలం 60లక్షల రూపాయల కోసమే అయితే విలువైన కారు, తన జీవితాన్ని పణంగా పెట్టి మరీ హత్య చేస్తాడా అనే సంశయం కూడా ఆయన కుటుంబీకులతో, పరిచయస్తులలో జరుగుతున్న చర్చ ఇప్పుడు హాట్ టాపిక్ గా మారుతోంది.

## అఫ్జల్‌గంజ్ ఇన్స్ పెక్టర్ మోహన్ రావు కు సత్కారం




నేటి శుభోదయ హైదరాబాద్, ఫిబ్రవరి 20: అఫ్జల్‌గంజ్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ గా కె. మోహన్ రావు బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా శుక్రవారం బజరంగ్ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ ఆర్ లక్ష్మణ్ రావు నేతృత్వంలో పలువురు ప్రముఖులు ఇన్ స్పెక్టర్ ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇన్ స్పెక్టర్ మోహన్ రావు ను శాలువాతో సత్కరించి పూల బొకే అందజేసి లక్ష్మణ్ రావు అభినందించారు. ఇన్ స్పెక్టర్ నేతృత్వంలో అఫ్జల్‌గంజ్ ప్రాంతంలో శాంతిభద్రతలు మరింత బలోపేతం అవుతాయని మరియు ప్రజా భద్రత అత్యంత ప్రాధాన్యతగా ఉంటుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బజరంగ్ సేన సభ్యులు మరియు స్థానిక శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

## శ్రీ మహాలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో బండలాగుడు పోటీలు

### సంప్రదాయాలను కాపాడాలని పిలుపునిచ్చిన ఎమ్మెల్యే
### మాజీ జెడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి హాజరు
### భారీ సంఖ్యలో పాల్గొన్న ప్రజలు, రైతులు

కేశంపేట, నేటి శుభోదయ: కేశంపేట మండలం కాకునూర్ గ్రామంలో వెలసిన శ్రీ మహాలింగేశ్వర స్వామి సన్నిధిలో నిర్వహించిన బండలాగుడు పోటీలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమాన్ని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్య అతిథిగా పాల్గొని, గ్రామాల్లో సంప్రదాయాలు, సంస్కృతిని నిలబెట్టడం ప్రతి ఒక్కరి



బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. పెద్దలు పాటించిన ఆచారాలను యువత అనుసరించాలని సూచించారు.ఈ సందర్భంగా కేశంపేట మండలం మాజీ జెడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి కూడా పాల్గొని కార్యక్రమాన్ని ఉత్సాహపరిచారు. రైతులు తమ ఒంగోలు గిత్తలతో పోటీల్లో పాల్గొని ప్రేక్షకులకు కనులపండువగా ప్రదర్శనలు ఇచ్చారు. పోటీలు ఉత్కంఠభరితంగా సాగగా ప్రజలు హర్షధ్వానాలతో



ప్రోత్సహించారు.పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు, భక్తులు, రైతులు హాజరై ఉత్సవాలను విజయవంతం చేశారు.ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు, యువకులు పాల్గొని ఏర్పాట్లను పర్యవేక్షించారు. గ్రామ దేవాలయ ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ బండలాగుడు పోటీలు భక్తి, క్రీడా స్ఫూర్తి, సంప్రదాయాల సమ్మేళనంగా నిలిచాయి. స్థానికులు ఇలాంటి కార్యక్రమాలు గ్రామ ఐక్యతను పెంచుతాయని, పాత సంప్రదాయాలను కొత్త తరానికి పరిచయం చేస్తాయని ఆనందం వ్యక్తం చేశారు. విజేతలకు ఘన సత్కారం ఈ పోటీల్లో రైతులు తమ ఒంగోలు గిత్తలతో ప్రతిభ చాటుకుని ప్రేక్షకులను అలరించారు. అత్తోట శిరీష చౌదరి-శివకృష్ణ చౌదరి జంట 2311 ఫీట్లతో మొదటి బహుమతి ?1,11,000 అందుకున్నారు. రెండో స్థానంలో బోరెడ్డి కేశవరెడ్డి, మూడో స్థానంలో గుదవల్లి దీక్షిత చౌదరి నిలిచారు. తదుపరి స్థానాల్లో ఎం. రామాంజనేయులు, పావులూరి వీరస్వామి చౌదరి, ఎం. నాగయ్య, పర్వత్ రెడ్డి--శ్రీవర్ధన్ రెడ్డి తదితరులు బహుమతులు గెలుచుకున్నారు. విజేతలకు నగదు ప్రోత్సాహకాలు అందజేసి నిర్వాహకులు అభినందించారు. భారీ సంఖ్యలో గ్రామస్తులు, భక్తులు హాజరై పోటీలను ఆస్వాదించారు. గ్రామీణ క్రీడలను ప్రోత్సహిస్తూ సంప్రదాయాలను కాపాడేందుకు ఇలాంటి పోటీలు ఎంతో అవసరమని పెద్దలు తెలిపారు. రైతుల కష్టం, గిత్తల శక్తి, గ్రామీణ ఐక్యత ప్రతిబింబంగా నిలిచిన ఈ కార్యక్రమం కాకునూరులో పండుగ వాతావరణాన్ని నెలకొల్పింది.

## ప్రభుత్వ నిర్లక్ష్యంతో రిటైర్మెంట్ డబ్బుల కోసం ఎదురుచూస్తూ మాజీ ఎస్సై మృతి చెందడం బాధాకరం

### సరెండర్ లీవ్స్ లేవు 'ఆరోగ్య భద్రత' అటకెక్కింది, స్టేషన్ల నిర్వహణకు నిధుల్లేవు మాజీ ఎస్సై మైసయ్య మృతి ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వ హత్యే

హైదరాబాద్, ఖమ్మం, నేటి శుభోదయ ::: ఖమ్మం జిల్లాకు చెందిన రిటైర్డ్ ఎస్సై మైసయ్య మృతి పట్ల, పోలీసుల సంక్షేమాన్ని గాలికొదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ఎక్స్ వేదికగా స్పందించిన మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీష్ రావు. ఖమ్మం జిల్లాకు చెందిన విశ్రాంత ఏఆర్ ఎస్సై మైసయ్య రిటైర్మెంట్ బకాయిలు అందక, ఆసుపత్రి ఖర్చులకు డబ్బుల్లేక ప్రాణాలు కోల్పోవడం తీవ్ర దిగ్భ్రాంతి కలిగించింది. జీవితకాలం ప్రజల రక్షణ కోసం అహర్నిశలు శ్రమించిన ఒక పోలీస్ అధికారి దుస్థితికి కాంగ్రెస్ ప్రభుత్వమే బాధ్యత వహించాలి. గత ఏడాది ఫిబ్రవరిలో రిటైర్ అయిన మైసయ్య కి సుమారు 60 లక్షల వరకు బకాయిలు రావాలి. ఏడాదవుతున్నా ప్రభుత్వం ఆ డబ్బులు ఇవ్వకపోవడంతో ఆ కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయింది. భార్యాభర్తలిద్దరూ అనారోగ్యం పాలైతే ఆసుపత్రిలో కనీసం బిల్లులు కట్టుకోలేని దయనీయ స్థితికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం నెట్టింది. చివరకు బిల్లు కట్టలేక తోటి విశ్రాంత పోలీసు అధికారులు చందాలు వేసి మృతదేహాన్ని ఇంటికి పంపాల్సిన పరిస్థితి రావడం ఈ ప్రభుత్వ చేతకానితనానికి, అమానవీయ కోణానికి అద్దం పడుతోంది. ఇది ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన హత్యే. ఒకవైపు రిటైర్డ్ ఉద్యోగులను బకాయిలు ఇవ్వకుండా ఏడిపిస్తున్న ఈ ప్రభుత్వం, మరోవైపు విధి నిర్వహణలో ఉన్న పోలీసుల పట్ల కూడా కర్కశంగా వ్యవహరిస్తోంది. రాత్రింబవళ్లు ప్రజల కోసం కష్టపడుతున్న పోలీస్ కుటుంబాలకు ఈ ప్రభుత్వం నరకం చూపిస్తోంది. సెలవులు కూడా తీసుకోకుండా డ్యూటీలు చేసే పోలీసులకు ఆర్థికంగా అండగా నిలిచే సరెండర్ లీవ్స్ బిల్లులను ప్రభుత్వం మంజూరు చేయడం లేదు. వాళ్ల కష్టానికి, శ్రమకు దక్కాల్సిన డబ్బులను ప్రభుత్వం ఇవ్వకపోవడం అత్యంత శోచనీయం. పోలీసులకు కొండంత అండగా ఉండే ఆరోగ్య భద్రత స్కీమ్‌ను ఈ ప్రభుత్వం అటకెక్కించింది. ఆసుపత్రులకు వెళితే ఈ స్కీమ్ కింద వైద్యం అందక పోలీస్ కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. కేసీఆర్ ప్రభుత్వం పోలీస్ కుటుంబాలకు ప్రైవేట్ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం అందించేది. నేడు వైద్యం అందక ఎంతోమంది పోలీసులు, వారి కుటుంబ సభ్యులు ప్రాణాలు కోల్పోతున్నా కాంగ్రెస్ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేకపోవడం సిగ్గుచేటు. కనీసం పోలీస్ స్టేషన్ల మెయింటెనెన్స్ కోసం ఇచ్చే నెలవారీ అలవెన్సులకు కూడా నిధులు ఇవ్వకుండా ప్రభుత్వం చేతులెత్తేసింది. దిక్కులేక స్టేషన్ అధికారులు తమ సొంత జేబుల నుంచి, అప్పులు చేసి మరీ స్టేషన్లను నెట్టుకొస్తున్న దౌర్భాగ్య పరిస్థితిలో నేడు పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. శాంతిభద్రతలు కాపాడే పోలీసులకు, తమ జీవితకాలం సేవలందించి రిటైర్ అయిన ఉద్యోగులకు ఈ ప్రభుత్వం ఇస్తున్న బహుమతి ఇదేనా? ఎస్సై మైసయ్య మరణం కేవలం ఒక ఉదాహరణ మాత్రమే. ఎంతోమంది రిటైర్డ్ ఉద్యోగులు బకాయిలు రాక వైద్యం చేయించుకోలేక ప్రాణాపాయ స్థితిలో ఉన్నారు. తక్షణమే మరణించిన ఎస్సై మైసయ్య కుటుంబానికి రావాల్సిన బకాయిలతో పాటు, ప్రత్యేక ఎక్స్ గ్రేషియా చెల్లించాలి. హైదరాబాద్ లో చికిత్స పొందుతున్న ఆయన భార్యకు ప్రభుత్వ ఖర్చులతో మెరుగైన వైద్యం అందించాలి. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలను వెంటనే విడుదల చేయాలి. అలాగే పోలీసులకు నిలిపివేసిన సరెండర్ లీవ్స్, ఆరోగ్య భద్రత, స్టేషన్ మెయింటెనెన్స్ నిధులను తక్షణమే పునరుద్ధరించాలి.

## అల్లిపురం నుంచి అమెరికా వరకు

### అమెరికాలో అల్లిపురం పేరు నిలబెట్టిన నివేధ్ రావూరి

ఖమ్మం, అమెరికా, నేటి శుభోదయ ::: అమెరికాలోని సూచీ మార్గ్ లో నివసిస్తున్న, ఖమ్మం జిల్లా అల్లిపురం గ్రామానికి చెందిన 12 ఏళ్ల నివేధ్ రావూరి 2025 సంవత్సరానికి గాను "నేషనల్ యూత్ ఎంట్రప్రెన్యూర్ ఆఫ్ ది ఇయర్" అవార్డును అందుకుని జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాడు. చిన్న వయసులోనే సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, వ్యాపార దక్షతను చాటుతూ ఈ ప్రతిష్టాత్మక పురస్కారం అందుకోవడం తెలుగు సమాజానికి గర్వకారణమైంది. అల్లిపురం పల్లె నేలలో మొదలైన ఈ ప్రయాణం ఈ రోజు అమెరికా వేదికపై జాతీయ గౌరవంగా మారింది. ఈ విజయగాథ వెనుక కుటుంబ విలువలు, క్రమశిక్షణ, విద్యాపట్ల నిబద్ధత ఉన్నాయి. రిటైర్డ్ హెడ్‌మాస్టర్లు రావూరి








నాగేశ్వరరావు, వేద కుమారి జీవితాంతం విద్యార్థులకు అక్షరాల వెలుగు పంచారు. అదే విద్యా విలువలు వారి మనవడు నివేధ్‌లో ప్రతిఫలించాయి. నివేధ్ తల్లిదండ్రులు సతీష్ రావూరి, శిల్ప రావూరి ప్రస్తుతం చాచీగో లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పనిచేస్తున్నారు. విదేశాల్లో ఉన్నా, తమ గ్రామపు మూలాలను మరువకుండా పిల్లలలో విలువలు, క్రమశిక్షణ, కొత్త ఆలోచనలను నాటారు. నివేధ్ విజయంతో ఆ కుటుంబ సంప్రదాయం మరింత గౌరవప్రదంగా నిలిచింది. అమెరికా వ్యాప్తంగా వినూత్న ఆలోచనలతో ముందుకు సాగే యువ వ్యాపారవేత్తలకు ప్రదానం చేసే ఈ అవార్డు అతని ప్రతిభకు నిదర్శనం. లిమిండీ డే కార్యక్రమంలో భాగంగా నివేధ్ తన స్వంత లెమన్‌డే స్టాల్‌ను ప్రణాళికాబద్ధంగా ప్రారంభించి విజయవంతంగా నిర్వహించాడు. చిన్న ఆలోచనను పెద్ద అవకాశంగా మార్చుకున్నాడు. లక్ష్యాల నిర్ధారణ, బడ్జెట్ నిర్వహణ, వినియోగదారుల సేవ, సమాజంతో అనుబంధం, ఇవన్నీ అతను చిన్న వయసులోనే నేర్చుకున్న జీవన పాఠాలు. ప్రతి గ్లాస్ లెమన్‌డే వెనుక అతని పట్టుదల ఉంది; ప్రతి చిరునవ్వు వెనుక కుటుంబం నేర్పిన సంస్కారం ఉంది. "నేషనల్ యూత్ ఎంట్రప్రెన్యూర్ ఆఫ్ ది ఇయర్ 2025 అవార్డు అందుకోవడం నాకు గర్వంగా ఉంది. నా లెమన్‌డే స్టాండ్ ద్వారా డబ్బు నిర్వహణ, లక్ష్యాల సాధన, సమాజానికి సేవ చేయడం నేర్చుకున్నాను. 12 ఏళ్ల వయసులోనే పిల్లలు కూడా పెద్ద మార్పు తీసుకురాగలరని ఈ అనుభవం నాకు తెలియజేసింది," అని నివేధ్ తెలిపాడు. ఈ అవార్డు కేవలం ఒక బాలుడి విజయం కాదు రావూరి నాగేశ్వరరావు బోధనలకు గౌరవం, వేద కుమారి ఆశీస్సులకు ప్రతిఫలం, సతీష్ రావూరి, శిల్ప రావూరి కష్టానికి ఫలితం, అల్లిపురం గ్రామానికి గర్వకారణం. అల్లిపురం నుంచి అమెరికా వరకు సాగిన ఈ ప్రయాణం అమెరికాలో అల్లిపురం పేరు ప్రతిష్టలు చాటిన విజయగాథగా నిలిచింది.

## మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యం

### - ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్.




రాజేంద్రనగర్,ఫిబ్రవరి 20(నేటి శుభోదయ):నియోజకవర్గంలో మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నమని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు.శుక్రవారం మైలర్ దేవ్ పల్లి డివిజన్ లోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో సుమారు 9కోట్ల80 లక్షల రూపాయలతో చేపట్టే సిసి రోడ్,అండర్ డ్రైనేజీ పనులకు అధికారులు,స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మైలార్ దేవ్ పల్లి డివిజన్ లోని కాలనీలలో మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ప్రభుత్వం అభివృద్ధి పనులకు ఎంతో సహకారం అందిస్తుందని అన్నారు.స్థానిక ఎమ్మెల్యేగా ప్రజా సమస్యలను తెలుసుకుంటూ దశలవారీగా పరిష్కారం చూపిస్తున్నానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు,కాలనీవాసులు పాల్గొన్నారు.

## శ్రీ విజయ గణపతి దేవాలయం వార్షికోత్సవంలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ప్రత్యేక పూజలు...



రాజేంద్రనగర్,ఫిబ్రవరి 20(నేటిశుభోదయ):బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సన్ సిటీలోని శ్రీ విజయ గణపతి దేవాలయం వార్షికోత్సవంలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగిందని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అన్నారు.

## సిపిఐలో చేరిన నారాయణరావుపేట ఎస్సీ కాలనీ సర్పంచ్ సరస్వతి

### కండువా కప్పి ఆహ్వానించిన కూనంనేని



ఖమ్మం, కొత్తగూడెం, నేటి శుభోదయ ::: పాల్వంచ మండల పరిధిలోని నారాయణ రావుపేట ఎస్సీ కాలనీ సర్పంచ్ బండా సరస్వతి సిపిఐ పార్టీలో చేరారు. ఆమెకు ఎంఎల్ కూనంనేని సాంబశివరావు శుక్రవారం ఎర్రకండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఇండిపెంటెంట్ అభ్యర్థిగా మొన్నటి గ్రామపంచాయితీ ఎన్నికల్లో 178 ఓట్ల మెజార్టీతో సర్పంచ్గా గెలిచిన సరస్వతి ఎంఎల్ కూనంనేని సాంబశివరావు సారధ్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా జరుగుతున్న అభివృద్ధికి ఆకర్షితురాలై సిపిఐ చేరినట్లు తెలిపారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న గ్రామ పంచాయితీ సమగ్రాభివృద్ధి సాధించాలంటే అది సిపిఐతోనే సాధ్యమని ఆమె అన్నారు. అనంతరం ఎంఎల్ఎ మాట్లాడుతూ



కమ్యూనిస్టు పార్టీలో చేరిన సర్పంచ్ సరస్వతి ప్రజా సమస్యల పరిష్కారం కోసం పాటు పడాలని, పంచాయితీలో ఉన్న ప్రతీ సమస్యను గుర్తించి పరిష్కరించేందుకు కృషి చేయాలని, ప్రజలతో మమేకమై ముందుకు సాగాలని సూచించారు. పాల్వంచ మండల సిపిఐ అనుబంధ రైతు సంఘం అధ్యక్షులు కొంగర అప్పారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ చేరికలో సిపిఐ నాయకులు వాసిరెడ్డి మురళీ, చలిగంటి శ్రీనివాస్, బొర్రా కేశవులు, రాంబాబుతో పాటు తదితరులున్నారు.

Printed Published and owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao RNI Title Code :- RNI TELTEL/2024/89620

## షాకింగ్ న్యూస్! సీనియర్ తెలంగాణ జర్నలిస్టుల ఇళ్లకే రేవంత్ గురి!




రాజేంద్రనగర్,ఫిబ్రవరి 20(నేటి శుభోదయం):మూసీ సుందరీకరణ పేరిట లక్షన్నర కోట్లు కొల్లగొట్టే ప్లాన్ వేసి వేలాది పేదోళ్ల ఇళ్లను కూలగొట్టేందుకు వేసిన ప్లాన్,తీవ్ర ప్రజా వ్యతిరేకత వల్ల బెడిసికొట్టడంతో కొన్నాళ్ల పాటు సైలెంట్‌గా ఉన్న రేవంత్ రెడ్డి మళ్లీ పంజా విసిరారు.ఈసారి మూసీ సుందరీకరణలో భాగంగా దేశంలోనే ఎత్తైన గాంధీ విగ్రహాన్ని వేలకోట్ల ప్రజా ధనం వెచ్చించి నిర్మించే పని మొదలుపెట్టాడు.దీనికోసం ఈ వారం చుట్టుపక్కల ఉన్న కొన్ని అపార్ట్‌మెంట్లు,భూములకు భూసేకరణ నోటిఫికేషన్ విడుదల చేశారు.అందులో లంగర్ హౌజ్ వద్ద ఉన్న మధు పార్క్‌రిడ్జ్ అపార్ట్‌మెంట్ కూడా ఉండటం పలువురిని షాక్‌కు గురిచేసింది.ఎందుకంటే తెలంగాణలో ఎంతో పాపులర్ జర్నలిస్టులు,మేధావులు నివసించే అపార్ట్‌మెంట్ అది.డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఘంటా చక్రపాణి,ఆంధ్రజ్యోతి మాజీ ఎడిటర్ కె.శ్రీనివాస్,ప్రముఖ యూట్యూబర్ చందు తులసి,రేవంత్ రెడ్డికి కొత్త తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించిన ఆర్టిస్ట్ రమణా రెడ్డి,ఇంకెందరో ప్రముఖ జర్నలిస్టులు ఇదే అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లో ఉంటారు.ఈ వార్త బయటికి పొక్కడంతో ఒక్కసారిగా తెలంగాణలో అలజడి రేగింది.సామాన్యుల ఇండ్ల మీదికి గత రెండేళ్లుగా బుల్డోజర్లు పంపుతున్న రేవంత్ ప్రభుత్వం ఇప్పుడు ఏకంగా తెలంగాణలో ప్రముఖ జర్నలిస్టులను,మేధావుల ఇండ్లను టార్గెట్ చేయడం సర్వత్రా చర్చనీయాంశం అయ్యింది.దేశ చరిత్రలోనే బహుశా తొలిసారిగా ఒక విగ్రహం పెట్టడానికి 15 ఏళ్ల క్రితమే కట్టిన అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌ను కూలగొట్టడానికి ప్లాన్ వేసిన ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి అపఖ్యాతి సాధిస్తున్నాడు.

## ప్రతి ఒక్కరు “ఎయిడ్స్ అవగాహన” కలిగి ఉండాలి

### ఆశమిత్ర లంకా కొండయ్య




ఖమ్మం, మధిర, నేటి శుభోదయ ::: మధిర పట్టణంలో గత 5 రోజుల నుండి నడుస్తున్న మధిర శివాలయం జాతరలో నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ (నాకో )తరపున తెలంగాణ వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ తరపున ఖమ్మంజిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి రామారావు జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ (జిల్లా ఎయిడ్స్ అండ్ లెప్రోసి ప్రోగ్రాం )అధికారి డాక్టర్ చందు నాయక్ సూచనల మేరకు పీహెచ్ సీ దెందుకూరు నుండి ఆరోగ్య పరివేక్షకులు మధిర ఆశమిత్ర లంకా కొండయ్య స్వచ్ఛందంగా రాత్రిపూట శివరాత్రి జాతర కొచ్చిన యువతకు, ప్రజలకు సంపూర్ణశీగా ఎయిడ్స్ పై అవగాహన పరచినారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ ప్రపంచాన్ని పట్టిపిడిస్తున్న హెచ్ఐవి , ఎయిడ్స్ మహా మ్మారి పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలనే ఉద్దేశ్యంతో నిత్యం జన సమూహములో ఎయిడ్స్ పై వినూత్న రీతిలో అవగాహన పరుస్తున్న కొండయ్య తిరునాళ్ళకు వచ్చిన ప్రజలకు తనదైన శైలిలో చిత్ర పటాలు కరపత్రాల ద్వారా సంపూర్ణ ముగా అవగాహన పరుస్తూ న్నట్లు వివరించారు. ఈ అవగాహన కార్యక్రమంనకు పీహెచ్ సీ వైద్యులు డాక్టర్ పృథ్విరాజ్ నాయక్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వి వెంకటేశ్వర్లు పారా మెడికల్ సిబ్బంది కొండయ్యకు సహకరిస్తున్నట్లు కొండయ్య వివరించారు. అదే విధంగా ఐ ఇ సీ మెటీరియల్ (ప్రచార సామాగ్రి, కరపత్రాలు ఫ్లెక్సీలు ) జిల్లా మాస్ మీడియా విభాగం (ఆరోగ్య శాఖలో ఇది ఒక వింగ్ ) మధిర షేర్ ఎన్ జీ ఓ గోపాల్ రెడ్డి, కిండ్లీ స్వచ్ఛంద సంస్థ వి అనుషా కృష్ణారెడ్డి దంపతులు అందిస్తూన్నట్లు కొండ య్య తెలిపారు.

## యువతలో వ్యవసాయ రంగంపై సృజనాత్మకత, ఆవిష్కరణలను ప్రోత్సహించడమే లక్ష్యంగా పోటీలు



రాజేంద్రనగర్,ఫిబ్రవరి 20 (నేటి శుభోదయ):ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ అగ్రికల్చర్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో యూనివర్సిటీ ఆడిటోరియంలో నిర్వహిస్తున్న “అగ్రిబిజ్ కాంపిటిషన్--2026” కార్యక్రమం ఉత్సాహభరితంగా కొనసాగుతోంది. కల్టివేటింగ్ ఐడియాస్..హార్వెస్టింగ్ ఫ్యూచర్స్” అనే థీమ్‌తో జరుగుతున్న ఈ పోటీలు యువతలో వ్యవసాయ రంగంపై సృజనాత్మకత, ఆవిష్కరణలను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఏర్పాటు చేయబడ్డాయి.ఈ పోటీల్లో అగ్రిబిజినెస్ ఆవిష్కరణలు,అగ్రి-టెక్,ఏఐ పరిష్కారాలు,వాతావరణ మార్పులకు అనుగుణమైన స్థిరమైన వ్యవసాయం,అగ్రి-ఎంటర్‌ప్రెన్యూర్షిప్ వంటి విభాగాలలో విద్యార్థులు తమ ప్రాజెక్టులు ప్రదర్శిస్తున్నారు. అదనంగా వ్యవసాయంపై కవితా పోటీలు కేస్ స్టడీ ప్రజెంటేషన్ పోటీలు (కేస్ స్టడీస్ కాంపిటీషన్) కూడా నిర్వహించబడుతున్నాయి. కవితా పోటీలలో విద్యార్థులు రైతు జీవితం,సుస్థిర





వ్యవసాయం వంటి అంశాలపై తమ భావాలను వ్యక్తపరుస్తుండగా,కేస్ స్టడీ పోటీలలో వాస్తవ వ్యవసాయ సమస్యలకు వినూత్న పరిష్కారాలను సూచిస్తున్నారు.ఈ కార్యక్రమాన్ని నిర్వాహకులు డాక్టర్ ఎం.గోవర్ధన్ సమన్వయంతో విజయవంతంగా నిర్వహిస్తున్నారు.రాష్ట్రం నలుమూలల నుండి వచ్చిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు.విజేతలకు నగదు బహుమతులు,ప్రశంసాపత్రాలు, ప్రోత్సాహకాలు అందజేయబడనున్నాయి.ఈ కార్యక్రమం యువతలో వ్యవసాయ రంగంపై చైతన్యం పెంపొందించి, భవిష్యత్తులో సృజనాత్మక ఆవిష్కరణలకు మార్గం సుగమం చేస్తుందని నిర్వాహకులు తెలిపారు.

## కోనేరు చిన్ని ను కలిసిన ఎస్.జె.కె.అహ్మద్





ఖమ్మం, కొత్తగూడెం, నేటి శుభోదయ ::: కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా ఇటీవల నియమితులైన కాంగ్రెస్ నాయకులు ఎస్.జె.కె. అహ్మద్ శుక్రవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కోనేరు సత్యనారాయణ (చిన్ని) నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అహ్మద్‌కు కోనేరు చిన్ని శుభాకాంక్షలు తెలియజేస్తూ కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా ఆయన నియమితులవడం అభినందనీయమని పేర్కొన్నారు. పార్టీ అభివృద్ధికి కృషి చేసి, సేవాదళ్‌ను మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు. కొత్తగూడెం-పాల్వంచ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలో 60 డివిజన్లకు గాను 12 స్థానాలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, వారి అనుచరులకు ఇప్పించుకొని అందులో 10 స్థానాల్లో అత్యధిక మెజార్టీ గెలిపించుకున్న కోనేరు చిన్ని ని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 59వ డివిజన్ కార్పొరేటర్ రావి రాంబాబు,33వ డివిజన్ కార్పొరేటర్ బానోత్ బాలు నాయక్,నాయకులు ఏవి రాఘవ, ఓం ప్రకాష్, ఎస్.డి.అంజాద్,వేదాద్రి తదితరులు పాల్గొన్నారు.

# గూడూర్ గ్రామం లో అభివృద్ధి జోరు

### విభిన్న పనులకు కోట్ల రూపాయల నిధుల మంజూరు

### ముఖ్య అతిథిగా షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, గూడూరు సర్పంచ్ ఉప్పల దయానంద్ గుప్తా ఆధ్వర్యంలో శంకుస్థాపన







షాద్ నగర్ నియోజకవర్గ నేటి శుభోదయ ప్రతినిధి ఫిబ్రవరి 20: కొత్తూరు మండలంలోని గూడూరు, పెద్దగుట్ట తండా తిమ్మాపూర్ రెడ్డిపాలెం గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగవంతమవుతున్నాయి. గిరిజన సంక్షేమ శాఖ, డీఎంఎఫ్‌టీఎఫ్ (ఐవీఖీ), హెచ్ఎండీఏ నిధులతో పలు కీలక రహదారి మరియు డ్రైనేజ్ పనులకు కోట్ల రూపాయల నిధులు మంజూరయ్యాయి. గూడూరు నుండి పెద్దగుట్ట తండా వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి గిరిజన సంక్షేమ శాఖ నిధులతో రూ. 3.00 కోట్లు కేటాయించారు. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే గిరిజన ప్రాంత ప్రజలకు సౌకర్యవంతమైన రవాణా సదుపాయం లభించనుంది. గూడూరు గ్రామంలో డ్రైనేజ్ నిర్మాణానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి మజీద్ వరకు డీఎంఎఫ్‌టీఎఫ్ నిధులతో రూ. 8.00 లక్షలు మంజూరయ్యాయి. దీంతో గ్రామంలో వర్షాకాలంలో నిల్వ నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది. అలాగే గూడూరులో సీసీ రోడ్డు నిర్మాణానికి హెచ్ఎండీఏ నిధులతో రూ. 10.00 లక్షలు కేటాయించారు. గ్రామంలోని అంతర్గత వీధులు మరింత బలంగా, సౌకర్యవంతంగా మారనున్నాయి. తిమ్మాపూర్ రైల్వే స్టేషన్ నుండి గూడూరు వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి హెచ్ఎండీఏ నిధులతో రూ. 5.75 కోట్లు మంజూరయ్యాయి. ఈ రహదారి పూర్తయితే ప్రయాణికులకు, రైతులకు విద్యార్థులకు ప్రయాణం సులభతరం కానుంది అదేవిధంగా రెడ్డిపాలెం గేట్ నుండి రాగ్య తండా వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి హెచ్ఎండీఏ నిధులతో రూ. 75.00 లక్షలు కేటాయించారు రెడ్డిపాలెంలో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ. 15.00 లక్షలు మంజూరు చేశారు. ఈ అభివృద్ధి పనులు పూర్తయిన తర్వాత మండలంలోని పలు గ్రామాల్లో రవాణా పారిశుద్ధ్య సదుపాయాలు మెరుగుపడతాయని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు అధికారులు పనులను నాణ్యతతో వేగంగా పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, సుదర్శన్ గౌడ్,హరినాథ్ రెడ్డి,సర్పంచులు బోకుల శ్రీరాములు, గబ్రు చౌహాన్, డిప్యూటీ సర్పంచ్ ఆరోగ్యం,మాజీ సర్పంచులు, రాందాస్ నాయక్, అంబటి ప్రభాకర్, కే సిద్ది గౌడ్, పద్మారావు, వార్డు సభ్యులు, అరవింద్ గౌడ్,మీసాల స్వప్న, మైలారం దేవేందర్,మోడీ దర్శన్ వినోద,గట్టు లక్ష్మీ చంద్రయ్య, జ్ఞానేశ్వర్, శివ చారి, యూత్ కాంగ్రెస్ నాయకులు గ్రామస్తులు మహిళలు తదితరులు పాల్గొన్నారు

## నీడనిచ్చిన దేవుడిని ఇంటికి పిలిచి తండావాసులు

### ఇళ్ళు కట్టించి సారె పెట్టిన ఎమ్మెల్యే, లబ్ధిదారుల ఇందిరమ్మ ఇంట ఎమ్మెల్యే సందడి, ఆర్భాటంగా ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం, ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే శంకర్ స్థానిక నేతలు, లబ్ధిదారులు రతన్ నాయక్ దంపతులకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే,




షాద్ నగర్ నియోజకవర్గ నేటి శుభోదయ ప్రతినిధి, ఫిబ్రవరి 20: ఇండ్లు లేని నిరుపేదలకు సొంత ఇంటి స్వప్నాన్ని సాకారం చేసి ఇందిరమ్మ రాజ్యంలో సుభిక్షంగా బ్రతకాలనే ఆలోచనలతో కాంగ్రెస్ కట్టించిన ఇందిరమ్మ గృహాన్ని లబ్ధిదారులు అట్టహాసంగా ప్రారంభిస్తున్నారు. నీడనిచ్చిన దేవుడిని ఇంటికి పిలిచి పండగ చేస్తున్నారు. రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం (మక్తగూడ పెద్దగుట్ట తండా) సర్పంచ్ బోకుల శ్రీరాములు,ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశాన్ని లబ్ధిదారులు రతన్ నాయక్ దంపతులు అట్టహాసంగా చేపట్టారు గృహప్రవేశానికి స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరయ్యారు. స్థానిక నాయకులతో రతన్ నాయక్ దంపతులకు ఆయన ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా ఇంటి యజమానులకు తెలంగాణ సంస్కృతి సంప్రదాయ బద్ధంగా చీరసారె పెట్టి అభినందించారు మక్తగూడ పెద్దగుట్ట తండా లో మొట్టమొదటి ఇందిరమ్మ గృహాన్ని మంజూరు చేసిన అనంతరం లబ్ధిదారులు ఇల్లు కట్టుకొని నేడు పండుగ చేసుకుంటున్నారు ఈ పండుగకు పెద్దమనిషిగా వీర్లపల్లి శంకర్ తదితర స్థానిక నాయకులను పిలవడంతో పూర్తిగా పండగ వాతావరణం నెలకొంది.

### పెద్దగుట్ట తండాలో రూ. 9 లక్షలలిడ్రైనేజ్ నిర్మాణ లిపనులకు శంకుస్థాపన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూరు మండలంలోని పెద్దగుట్ట తండాలో రూ. 9 లక్షల వ్యయంతో చేపట్టనున్న డ్రైనేజ్ నిర్మాణ పనులకు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శంకుస్థాపన చేశారు గ్రామ ప్రజల దీర్ఘకాలిక సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా ఈ పనులు ప్రారంభం కావడం ఆనందకరమని ఆయన తెలిపారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పెద్దగుట్ట తండాలో వర్షాకాలంలో నీరు నిల్వ ఉండటం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు డ్రైనేజ్ వ్యవస్థ పూర్తయిన తర్వాత మురుగు నీటి సమస్య పూర్తిగా పరిష్కారమవుతుందని గ్రామంలో పరిశుభ్రత మెరుగుపడుతుందని పేర్కొన్నారు గ్రామాభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయిస్తోందని అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు గ్రామ ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు అభివృద్ధి పనులు చేపట్టడం వల్ల తమ తండాకు కొత్త రూపు వస్తుందని వారు ఆనందం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హరినాథ్ రెడ్డి, సుదర్శన్ గౌడ్,సర్పంచ్ బోకుల శ్రీరాములు,ఉప్పల దయానంద్ గుప్తా,మాజీ సర్పంచ్ రాందాస్ నాయక్,వార్డు సభ్యులు,కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు


## రెడ్డిపాలెం-రాగ్య తాండవరకు బీటి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

### మల్లాపూర్ సర్పంచ్ నర్సింహారెడ్డి దశరథ్ నాయక్ ఆధ్వర్యంలో శంకుస్థాపన,



షాద్ నగర్ నియోజకవర్గం నేటి శుభోదయ ప్రతినిధి ఫిబ్రవరి 20: రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలంలోని రెడ్డిపాలెం గ్రామ ముఖద్వారం నుండి మల్లాపూర్ తాండ గ్రామపంచాయతీ పరిధిలోని రాగ్య తాండవరకు నిర్మించనున్న బీటి రోడ్డుకు నేడు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శంకుస్థాపన చేశారు. ఈ రోడ్డు నిర్మాణం అంచనా వ్యయం రూ. 75 లక్షలు మంజూరు అయినట్లు ఎమ్మెల్యే తెలిపారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం మౌలిక వసతుల విస్తరణకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు రోడ్డు నిర్మాణం పూర్తయితే గ్రామస్తులకు రాకపోకలు సౌకర్యవంతంగా మారుతాయని స్థానికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామపంచాయతీల సర్పంచులు, మల్లాపూర్ నరసింహారెడ్డి,దశరథ్ నాయక్,ఉప్పల దయానంద్ గుప్తా, బోకుల శ్రీరాములు, గబ్రు చౌహాన్,వార్డు సభ్యులు పాల్గొని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు అలాగే గ్రామస్తులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## చరిత్ర తెలియకుండా విచ్చినాన్ని రెచ్చగొడుతు జరిగే ప్రదర్శనలకు అనుమతి ఎట్లా ఇచ్చారు : సలాం



ఖమ్మం, నేటి శుభోదయ ::: దేశ చరిత్ర తెలియకుండా రెచ్చగొట్టే నినాదాలతో మతం ముసుగులో ప్రజలని రెచ్చగొడుతు విచ్చలవిడిగా నినాధలు చేస్తూ జరిగే ప్రదర్శనలకు ప్రజలను డిజే లతో తీవ్ర ఇబ్బంది పెడుతు జరుగుతున్న కార్యక్రమలకు ఏ రకంగా అనుమతులు ఇస్తున్నారని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు, ఇన్సాఫ్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి మొహమ్మద్ సలాం ప్రశ్నించారు. శుక్రవారం వాహిదియా మస్జీద్ వద్ద పవిత్ర రంజాన్ మాసం ని ఉద్దేశించి అయినా మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు కనీసం అధికారులు సమయాన్ని అయిన చూసి మార్చకుండా అనుమతులు ఇస్తున్నారని అదే వేరే ప్రదర్శనలు అయితే ఇప్పటికి అనేక రకాల వాదనలను తెరె మీద తెచ్చేవారని సలాం అన్నారు. దేశ ఐక్యత ప్రశాంతత కోరుకుంటున్నాం కాబ్బట్టి అదే రకంగా అందరిని కలుపాకోపోతున్నాం అని అధికారులు తక్షణమే తప్పులను సరి చేసుకొని రెచ్చగొట్టే వారిపై చర్యలు తీసుకోకపోతే సహించేది వుండదని మైనార్టీలు ఎవరి జాగిరి తినటం లేదని అలా బ్రతికే వారు అలవాటు అయ్యి రెచ్చగుడుతున్నారని సలాం అన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ సైదా, ఎండీ రెహమాన్, నిజాంపేట్ యాఖుబ్, షేక్ చానా, షేక్ రెహమాన్, కరీం తదితరులు వున్నారు.

## ఎమ్మెల్యేని కలిసిన డీకంపల్లి గ్రామ అభివృద్ధి కమిటీ



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి చిలుక విజయకుమార్ ఫిబ్రవరి 20 శుభోదయ: శుక్రవారం డీకంపల్లి గ్రామాభివృద్ధి కమిటీ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డిని కలిసి ఆలూరు నుండి డికంపల్లి మీదుగా గాలిబ్ నగర్ వరకు డబుల్ రోడ్డు సాంక్షన్ చేయమని కోరడం జరిగింది.ఎమ్మెల్యే స్పందించి తొందర్లోనే అమలు చేయిస్తానని చెప్పడం జరిగింది.ఈ కార్యక్రమంలో విడిసి సభ్యులు కలగడ్డ వినోద్ కుమార్,పెద్దగోండ రవి,తంబాకు శేఖర్,జాడు గంగాధర్,జిలకర రమేష్,నాగన్న,డిష్ పోశెట్టి,ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

## కెసిఆర్ దొరను తెలంగాణ జాతిపితగా రుద్దడాన్ని బి.ఎం.పి పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుంది:గుర్రంపల్లి శామలచ రాజ్



రాజేంద్రనగర్,ఫిబ్రవరి20(నేటి శుభోదయ):కెసిఆర్ తెలంగాణ ఉద్యమ అవతారం ఎత్తడానికి ప్రధాన కారణం 1999 సంవత్సరంలో చంద్రబాబు నాయుడు మంత్రివర్గంలో కీలకమైన మంత్రి పదవి ఇవ్వకుండా డిప్యూటీ స్పీకర్ పదవి ఇవ్వడంతో ఈ పదవి సంపాదించు కోవడానికి గానీ,అధికార భోగభాగ్యాలు అనుభవించడానికి గినీ అంతగా ఉపయోగపడదు అనుకున్నాడో మరి ఏమో!అంతేకాకుండా తెలంగాణలో కమ్మాఆంధ్ర కాపు నాయకులు ఉండగా ముఖ్యమంత్రిని కాలేను అనుకున్నాడో ఏమో గానీ తెలంగాణ పత్యేక రాష్ట్ర రాగం ఎత్తాడు.అంతకుముందు నుంచే దశబ్దాలుగా తెలంగాణ ఉద్యమం సాగుతున్నందున ప్రజల్లో తెలంగాణ ఆకాంక్ష బలంగా నాటుకు పోయిన విషయం అందరికీ తెలిసినదే.ఇది పసిగట్టి పరిస్థితిని అంచనా వేసుకుని తెలంగాణ ఉద్యమ అవతారమెత్తాడు.సంపన్నుడైన దొర అనే గౌరవము,పరపతి,రాజకీయ పదవులు నిర్వహించిన పలుకుబడి ఇంకా మాటల గారడొ గానీ ఉద్యమానికి ఆయనే పెద్ద అయ్యాడు.విద్యార్థులు యువకులు ఉద్యోగులు కవులు కళాకారులు మేధావులు ఆయన ఆయన వెన్నంట ఉద్యమంలో పాల్గొన్నారు.సుమారు1200 మందికి పైగా ప్రాణాలు బలిచ్చారు.తెలంగాణ వచ్చాక దళితుడే ముఖ్యమంత్రి అన్నాడు కానీ ఎందరో బలిదానాల పునాదుల మీద ఏర్పడిన తెలంగాణ ముఖ్యమంత్రి కూర్చిమీద తానే కూర్చున్నాడు.కొడుకు,కూతురు,అల్లుడు హరీష్ రావుకు పదవులు కట్టబెట్టాడు.ఉద్యమ సమయంలో చంద్రబాబు నాయుడు మంత్రివర్గంలో మంత్రులుగా ఉంటు తెలంగాణకు వ్యతిరేకంగా వ్యవహరిస్తూ ఉద్యమకారులను ఇబ్బందులకు గురిచేసిన వారికి కేసీఆర్ దొర మంత్రివర్గంలో పదవులు కట్టబెట్టాడు కానీ ఉద్యమంలో ప్రాణాలను అర్పించిన వారి కుటుంబాలకు మాత్రం పదవులు ఇవ్వకుండా మొండి చెయ్యి ఇచ్చాడు.ఉద్యమానికి ఊపిరందించిన తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ కు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వకుండా కన్నీరు పెట్టించాడు కేసీఆర్ దొర అని చెప్పుకుంటారు.మరి దొరగారు తెలంగాణ పితా ఎలా అవుతాడో అర్థం కాకుండా ఉందని బహుజన ముక్తి పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుఱ్ఱంపల్లీ శామలచ రాజ్ తెలిపారు.

## స్వర్ణ గిరికి ముఖ్య అతిథిగా తంగేళ్లపల్లి శ్రీవాణి






యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో ఫిబ్రవరి 20 (నేటి శుభోదయ)భువనగిరి పట్టణ స్వర్ణకార సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవానికి స్వాగతం పలికింది తంగేళ్లపల్లి శ్రీనివాస్ చారి అధ్యక్షుడిగా ప్రధాన కార్యదర్శిగా వనభోజు సతీష్ కుమార్ ఎన్నికయ్యారు కార్యవర్గ సభ్యునిగా తంగళ్ళపల్లి పాండు గారిని నియమించడం జరిగింది ఈ ప్రమాణ స్వీకార మహోత్సవానికి ముఖ్యఅతిథిగా తంగేళ్లపల్లి శ్రీవాణి రవికుమార్ గారు మున్సిపల్ చైర్మన్ హాజరయ్యారు

## గ్రామ సమస్యలపై విద్యుత్ అధికారికి సర్పంచ్,విన్నతి

### తలకొండపల్లి విద్యుత్ శాఖ అధికారి విజయ కుమార్ నాయక్ విన్నతి పత్రం అందజేసిన సర్పంచ్ చంద్రశేఖర్



నేటిశుభోదయ: తలకొండపల్లి: తలకొండపల్లి మండలం గట్టు ఇప్పలపల్లి గ్రామంలోని విద్యుత్ సమస్యలపై సర్పంచ్ జినుకుంట్ల చంద్రశేఖర్ తలకొండపల్లి లో విద్యుత్ శాఖ అధికారి (ఏ ఇ) వినతి పత్రం అందించడం జరిగింది.గ్రామంలో ఉన్న కరెంటు సమస్యల పైన ప్రజలు,రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు.గ్రామంలో ఉన్న ప్రజలు కూడా చాలా అవస్థలు పడుతున్నారు.లో ఓల్టేజ్ కారణంగా, ఎర్త్ లు సరిగా పనిచేయడం లేదని ఇంటిలో స్విచ్ ఆఫ్ చేసిన కూడా లైట్ వస్తుంది కావున. ఈ సమస్యను పరిష్కరించాలని గ్రామ సర్పంచ్ విన్నపించుకోవడం జరిగింది.రైతులు ప్రధానంగా సాయంత్రం.05 :00. గంటలకు త్రీఫేస్ కరెంటు పోవడం తోటి చాలా ఇబ్బంది పడుతున్నారు కావున. సాయంత్రం 06:30: వరకు త్రీఫేస్ కరెంటు ఉండే విధంగా చేయాలని విద్యుత్ అధికారిని కోరడం జరిగింది.గ్రామంలో ఇళ్ల పైన ఉన్నటువంటి. వైర్లు తొలగించాలి అని. మరియు గ్రామంలో. ప్రతి ట్రాన్స్ఫార్మర్ దగ్గర: ఏ బి స్విచులు ఏర్పాటు చేయాలి. ఎల్ సి తీసుకున్నప్పుడు గ్రామ మొత్తం కరెంటు పోతుంది చాలామందికి ఇబ్బంది అవుతుంది.అదేవిధంగా గట్టు ఇప్పలపల్లి గ్రామానికి 24 గంటల వరకు సపరేట్ లైను ఏపించండి అని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళ్యాణ్ కార్ సాయిరాం. రాగుల నరేష్. పాల్గొనడం జరిగింది.

## శ్రీ నందిని నృత్యాలయంలో షీ టీం అవగాహన సదస్సు

### గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌పై విద్యార్థులకు మార్గనిర్దేశం చేసిన షీ టీం ఎస్ఐ హైమ




మంచిర్యాల ఫిబ్రవరి 20, నేటి శుభోదయ స్టేట్ బ్యూరో : మహిళలు, బాలికల భద్రత లక్ష్యంగా మంచిర్యాల జిల్లా కేంద్రంలోని శ్రీ నందిని నృత్యాలయంలో శుక్రవారం విద్యార్థులకు గుడ్ టచ్--బ్యాడ్ టచ్ అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి షీటీం ఎస్ఐ హైమ హాజరై విద్యార్థులతో ప్రత్యక్షంగా సంభాషిస్తూ కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ హైమ మాట్లాడుతూ, మహిళలపై వేధింపులు, ఆకతాయిల వేధింపులను అరికట్టడం షీ టీం ప్రధాన లక్ష్యమని తెలిపారు. బాలికలు, మహిళలు ఎలాంటి బెదిరింపులకు గురైనా భయపడకుండా ముందుకు రావాలని సూచించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ మధ్య తేడాను స్పష్టంగా వివరించి, అనుచిత ప్రవర్తన ఎదురైన వెంటనే తల్లిదండ్రులు, గురువులు లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. మహిళలను వేధించినా, రోడ్డుపై అవమానకరంగా ప్రవర్తించినా, ఉద్దేశపూర్వకంగా వెంబడించినా వెంటనే 6303923700 నంబర్‌కు సంప్రదించాలని, అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100కు కాల్ చేయాలని కోరారు. ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచబడతాయని స్పష్టం చేశారు. అనంతరం నృత్యాలయ గురువు కల్పన ఎస్ఐ హైమను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో షీ టీం సభ్యులు శ్రవణ్, జ్యోతి, నృత్యాలయ గురువు కల్పన, విద్యార్థులు పాల్గొన్నారు.

### తాళం వేసున్న ఇండ్లను అదనుగా చూసి

## చోర బడుతున్న దొంగలు


### దొంగల బెడదతో భయభ్రాంతుల్లో మండల ప్రజలు



ముత్తారం:నేటి శుభోదయ-20 ముత్తారం మండలంలోని ఓడేడు గ్రామంలో కజం రమణయ్య చిరు దుకాణ వ్యాపారి ఇంట్లో చొరబడిన దొంగలు.రమణయ్య దుకాణం వ్యాపారి రెండు రోజుల క్రితం బంధువుల సంవత్సరీకా కార్యక్రమానికి హాజరుకావడానికి ఇంటికి తాళం వేసి వెల్లారు.రెండు రోజులకు తిరిగి వచ్చి చూడగా వెనక తలుపులు పగలగొట్టి ఇంటిలో చెరబడి నగదు రూపాయలను ఎత్తుకెల్లినట్లు బోరున విలపిస్తూ తెలిపారు.గత నాలుగు నెలల క్రితం ఇదే గ్రామానికి చెందిన చకిలం రమణయ్య అనే చిరు వ్యాపారి ఇంట్లో ఇంటి వెనకాల తలుపులు పగల కొట్టి నగదు రూపాయలను ఎత్తుకెళ్లారు. అట్లాగే సుధాడి జగ్గారావు ఇంటి తాళాలు వేసి బంధువుల ఇంటికి పోయి వచ్చి చూడగా ఇదే సంఘటన జరిగింది. మండల కేంద్రంలో ఓరుగంటి రవీందర్రావు ఇంటి కి తాళాలు వేసి ఊరికి వెళ్లి వచ్చి చూడగా ఇదే సంఘటన జరిగింది.ఇండ్లకు తాళలు వేసి ఉండటాన్ని గమనించిన దొంగలు ఇదే అదునుగా భావించి తాళం పగలగొట్టి ఇళ్లల్లో చొరబడుతుంటే మండల ప్రజలు ఊరికి వెళ్లాలి అంటేనే జంకుతున్నారు.ఇకనైనా దొంగతనాలపై పోలీసు వారు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై పోలీసువారి ని వివరణ కోరగా రంగంలోకి దిగి ఇచ్చిన సమాచారశీ మేరకు క్లూస్ టీంల తో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు.

## మైలార్దేవ్ పల్లి బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులుగా గుమ్మడి కుమార్ నియామకం

### మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి.



రాజేంద్రనగర్, ఫిబ్రవరి 20 (నేటి శుభోదయ): బిఆర్ఎస్ పార్టీలో కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు మంచి గుర్తింపు ఉంటుందని మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబిత ఇంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం బిఆర్ఎస్ పార్టీ కోసం ఉద్యమ కాలం నుండి పోరాటం చేసిన గుమ్మడి కుమార్ ను మైలార్దేవ్ పల్లి డివిజన్ అధ్యక్షులుగా రాజేంద్రనగర్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డితో కలిసి నియమిస్తున్నట్లు నియామక పత్రాన్ని అందించి అభినందించడం జరిగిందన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..పార్టీ కష్ట కాలంలో ఉన్నందున ప్రతి పోరాటంలో ముందుండి పోరాడి కార్యకర్తలను నాయకులను కలుపుకొని ముందుకు సాగాలని ఆమె సూచించారు.అంతేకాకుండా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న అక్రమాలు,ప్రజా వ్యతిరేక పరిపాలనను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ దిమాల ద్వారా చిప్పి కొట్టాలని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ డివిజన్ అధ్యక్షులు వెంకటేష్,లక్ష్మీరాజు,నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# భారతీయ సంస్కృతికి పల్లెలే పట్టుకొమ్మలు

### తిరుపతి లడ్డును కల్తీ చేసిన వైసీపీని ఇక ప్రజలు నమ్మరు

### ఉమ్మడి కుటుంబ వ్యవస్థను కాపాడుకోవాల్చిన భాధ్యత అందరిపై ఉంది

### మహిళలను రాజకీయంగా ప్రోత్సహించాలి

### మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి




నంద్యాల, నేటి శుభోదయ ::: భారతీయ సంస్కృతికీ పల్లెలే పట్టుకొమ్మలు అని, ఉమ్మడి కుటుంబ వ్యవస్థను భవిష్యత్ తరాల కోసం కాపాడుకోవాల్చిన భాధ్యత అందరిపై ఉందని, తిరుపతి లడ్డును కల్తీ చేసి ప్రపంచ వ్యాప్తంగా శ్రీ వేంకటేశ్వరస్వామి భక్తుల మనోభావాలు దెబ్బతీసిన వైసీపీ నాయకులను ప్రజలు నమ్మరని టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి అన్నారు. శుక్రవారం నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజకవర్గం పగిడ్యాల మండలం పాత ముచ్చుమర్రి గ్రామంలో బైరెడ్డి కుటుంబం ఆధ్వర్యంలో, వేద పండితులు తెలకపల్లి రఘురామ శర్మ పర్యవేక్షణలో వైభవంగా శ్రీ చౌదేశ్వరీదేవీ, శ్రీ మశమ్మ, శ్రీ గంగమ్మ అమ్మవార్ల నూతన ఆలయాల ప్రారంభం, అమ్మవార్ల విగ్రహాల ప్రతిష్ట వేడుకగా నిర్వహించారు. గ్రామ దేవతలకు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి, ఆమె భర్త డాక్టర్ శివచరణ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి, ఆయన భార్య బైరెడ్డి భారతమ్మ, బైరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, ఆయన భార్య బైరెడ్డి శ్రీలత, కూతురు బైరెడ్డి అనూషారెడ్డి, కర్నూలు ఎంపీ బస్తిపాడు నాగరాజు తదితరులు విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ మా గ్రామం ముచ్చుమర్రిలో నాలుగు తరాలుగా మా బైరెడ్డి వంశం పెద్దలు గ్రామాభివృద్ధికి, శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తున్నారన్నారు. మా కుటుంబం లోనే కొందరు స్వార్ధంతో గ్రామఅభివృద్ధి విరోధకులుగా మారారని, వారి ఆలోచన మారి కుటుంబంతో కలిసివచ్చి ఈ ప్రాంత అభివృద్ధికి పాటుపడుదామని పరోక్షంగా వైసీపీ నేత బైరెడ్డి సిద్ధార్థరెడ్డిని ఉద్దేశించి మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి వ్యాఖ్యలు చేశారు. గ్రామాల్లో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ దెబ్బతినడం వల్లే అనేక అనర్థాలు గ్రామాల్లో నెలకొన్నాయని అన్నారు. ఎంతో ఘన చరిత్ర ఉన్న ముచ్చుమర్రి గ్రామంలో గత వైసీపీ ఐదేళ్ళ పాలనలో విధ్వంసంకు గురైందని, గ్రామ పెద్దగా, కుటుంబ పెద్దగా గ్రామాన్ని బాగుచేసుకునే ఉన్నామని, గ్రామం బాగుంటే దేశం బాగుంటుందని బైరెడ్డి రాజశేఖరరెడ్డి అన్నారు. కుల మతాల ఐక్యత గ్రామ అభివృద్ధి ఎంతో ఉపయోగం అన్నారు. స్థానిక వైసీపీ నాయకులకు గ్రామాల అభివృద్ధి ఇష్టం లేదేమో అన్నారు. మహిళలను రాజకీయాల్లో ప్రోత్సహించినప్పుడే దేశం బాగుపడుతుందని బైరెడ్డి రాజశేఖరరెడ్డి అన్నారు. మీ అందరి దీవెనల వల్లే మా తాత బైరెడ్డి చిన్న శివారెడ్డి, మా నాన్న బైరెడ్డి శేషశయనారెడ్డిలు ఇండిపెండెంట్ అభ్యర్థులుగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ లుగా విజయం సాధించి చరిత్ర సృష్టించారని, తాను రెండు సార్లు ఎమ్మెల్యే గా సేవలు అందించానని, ప్రస్తుతం నంద్యాల ఎంపీ గా డాక్టర్ బైరెడ్డి శబరి కూడా ఈ ముచ్చుమర్రి గ్రామ బిడ్డనే అన్నది మరువవద్దాన్నారు. మీ అందరి సహకారంతో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి నీతివంతంగా, నిరంతరం ప్రజాసేవ చేస్తుందని బైరెడ్డి రాజశేఖరరెడ్డి అన్నారు.

## మంత్రి పొంగులేటి చొరవ, కిడ్నీ బాధితుడికి రూ. 9 లక్షల ఎల్వోసీ

### పొన్నెకల్ గ్రామ శాఖ నాయకుల విన్నపంపై స్పందించిన మంత్రి

### తుంబూరు దయాకర్ రెడ్డి సమన్వయంతో త్వరితగతిన సాయం మంజూరు

ఖమ్మం, పొన్నెకల్, నేటి శుభోదయ ::: పాలేరు నియోజకవర్గ ప్రజల కష్టాలను తన కష్టంగా భావించే తెలంగాణ రెవెన్యూ, గృహ



నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. అత్యవసర వైద్య చికిత్స కోసం ఎదురుచూస్తున్న ఒక నిరుపేదకు ప్రభుత్వ ఎల్వోసీ మంజూరు చేయించి కొండంత భరోసా ఇచ్చారు.

**వివరాల్లోకి వెళ్తే..**

ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్ గ్రామానికి చెందిన కత్రం



సిద్దు అనే వ్యక్తి రెండు కిడ్నీలు దెబ్బతిని తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స కోసం సుమారు రూ. 9 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు చెప్పడంతో ఆ నిరుపేద కుటుంబం ఆవేదనలో మునిగిపోయింది. ఈ క్రమంలో పొన్నెకల్ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ నాయకులు బాధితుడి పరిస్థితిని గమనించి అండగా నిలిచారు.

**పొంగులేటి దృష్టికి తీసుకెళ్లిన దయాకర్ రెడ్డి**

గ్రామ నాయకులు బాధితుడిని తీసుకుని ఖమ్మంలోని మంత్రి క్యాంప్ కార్యాలయ ఇన్-చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి ని కలిశారు. దయాకర్ రెడ్డి బాధితుడి ఆరోగ్య పరిస్థితిని, ఆర్థిక ఇబ్బందులను వెంటనే మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించి, ప్రభుత్వపరంగా ఎల్వోసీ మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు.

**త్వరితగతిన 9 లక్షల ఎల్వోసీ మంజూరు**


మంత్రి పొంగులేటి ప్రత్యేక చొరవతో, యుద్ధ ప్రాతిపదికన ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ. 9 లక్షల ఎల్వోసీ మంజూరైంది. కష్టకాలంలో ప్రభుత్వం నుంచి ఇంత పెద్ద మొత్తంలో సాయం అందేలా చేసిన మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డికి బాధితుడు సిద్దు, అతని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఈ ప్రక్రియను పర్యవేక్షించిన తుంబూరు దయాకర్ రెడ్డికి, వెన్నంటి నిలిచిన పొన్నెకల్ గ్రామ నాయకులకు ధన్యవాదాలు తెలియజేశారు.

## మేయర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఉమారాణి

### నిజామాబాద్ అభివృద్ధికి కాంగ్రెస్ సరికొత్త బాట



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి చిలుక విజయకుమార్ ఫిబ్రవరి 20 నేటి శుభోదయ: నిజామాబాద్ నగర పాలక సంస్థలో సరికొత్త అధ్యాయం మొదలైంది.నిజామాబాద్ నగర మేయర్‌గా ఉమారాణి అత్యంత వైభవంగా బాధ్యతలు స్వీకరించారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్,పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్,రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై నూతన మేయర్,డిప్యూటీ మేయర్‌లకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ



సందర్భంగా మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ..అవినీతి రహిత పాలనే మా లక్ష్యం.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తుంది.నిజామాబాద్ పట్టణాన్ని అవినీతికి తావులేకుండా,రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన నగరంగా తీర్చిదిద్దుతాం.గతంలో కాంగ్రెస్ చేసిన అభివృద్ధిని చూసే ప్రజలు ఇవాళ మేయర్ పీఠాన్ని అప్పగించారు.వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా నిజామాబాద్‌ను అభివృద్ధికి మారుపేరుగా నిలుపుతాం,అని ధీమా వ్యక్తం చేశారు. పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ..కార్యకర్తల కష్టానికి,ప్రజల ఆశీస్సులకు దక్కిన గౌరవం ఇది అని కొనియాడారు.?నిజామాబాద్ నగరం నా సొంత గడ్డ.ఇక్కడి ప్రతి గల్లీ సమస్య నాకు తెలుసు.ప్రభుత్వ సాయంతో,నిధుల కొరత లేకుండా చూస్తూ.. మౌలిక సదుపాయాల కల్పనలో నిజామాబాద్‌ను అగ్రగామిగా నిలబెడతాం.ఇక్కడ కేవలం పాలన మార్పు మాత్రమే కాదు,ప్రజల జీవితాల్లో వెలుగులు నింపే మార్పు వస్తుంది అని ఆయన ప్రసంగించారు. రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమ శాఖ ?మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ..స్థానిక సంస్థల బలోపేతానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.?ప్రజా పాలన ప్రజలకు అందుబాటులో ఉంటూ,వారి సమస్యలను తక్షణమే పరిష్కరించేలా మేయర్ పనిచేయాలని సూచించారు.?మౌలిక వసతులు:రోడ్లు,డ్రైనేజీ,తాగునీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు.?సమిష్టి కృషి:మంత్రివర్గం స్థానిక ప్రజాప్రతినిధుల సమన్వయంతో నిజామాబాద్ కార్పొరేషన్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తామని స్పష్టం చేశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన మేయర్ ఉమారాణి మాట్లాడుతూ....తనపై నమ్మకం ఉంచిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి,పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. అందరినీ కలుపుకుని నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతానని ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో కాంగ్రెస్ శ్రేణులు, కార్పొరేటర్లు,అభిమానులు పాల్గొన్నారు.

## ఎన్ ఆర్ డి పిఆర్ ఆధ్వర్యంలో శిక్షణ



ఖమ్మం అర్బన్, నేటి శుభోదయ ::: ఎన్ ఆర్ డి పిఆర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రతిష్టాత్మక శిక్షణ కార్యక్రమంలో జీకే బంజారా గ్రామ సర్పంచ్ జ్యోతి, డేవిడ్, చింతగుర్తి సర్పంచ్ టి. ప్రియాంక, మేకలకుంట సర్పంచ్ బి. అనిత, కొణిజర్ల సర్పంచ్ హేమిమా చక్రపాణి లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ శిక్షణ ద్వారా గ్రామస్థాయిలో మహిళా నాయకుల సామర్థ్యాలను పెంపొందించడం, స్థానిక పాలనలో వారి పాత్రను బలోపేతం చేయడం, మహిళా సాధికారతకు దిశానిర్దేశం చేయడం ప్రధాన లక్ష్యాలుగా పేర్కొన్నారు. గ్రామాభివృద్ధి, పారదర్శక పాలన, సమగ్ర సంక్షేమం సాధనలో మహిళా నాయకత్వం కీలకమని ఈ కార్యక్రమం స్పష్టం చేసింది. మహిళా నాయకత్వానికి శక్తినిచ్చే ఈ కార్యక్రమంలో పాల్గొన్న జీకే బంజారా సర్పంచ్ మాలోత్ జ్యోతి కి హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

## ఇందల్వాయి గ్రామ సర్పంచ్ గంగమణి గంగారం కాంగ్రెస్ పార్టీలో చేరిక



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి చిలుక విజయ కుమార్ ఫిబ్రవరి 20 శుభోదయ: ఇందల్వాయి సర్పంచ్‌గంగమణి గంగారం శుక్రవారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరడమైనది.ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మోత్కూరి నవీన్ గౌడ్,మాజీ ఎంపీపీ ఇమ్మడి గోపి,మోతీలాల్, బలరాం నాయక్ తదితరులు ఉన్నారు.

# ఖమ్మం లో ఓ కార్పొరేట్ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో విద్యార్థుల మధ్య ఘర్షణ

ఖమ్మం క్రైమ్, నేటి శుభోదయ ::: మద్యం మత్తులో ఇద్దరు విద్యార్థులు మధ్య తలెత్తిన ఘర్షణ దాడికి దారి తీసింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఖానాపురం హవేలీ పోలీస్ స్టేషన్ పరిధిలోని వెలుగుమట్లలో ఉన్న ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఇద్దరు విద్యార్థులు గత శుక్రవారం రాత్రి వసతి గృహంలో వివాదానికి దిగారు. ఇరువురు మద్యం మత్తులో ఉండటంతో మాట పెరిగి ఒకరిపై ఒకరు దాడికి దిగారని గడ నా సమయంలో ఉన్న తోటి విద్యార్థులు తెలిపారు. ఆ సమయంలో హాస్టల్ వార్డెన్, వాచ్మెన్ ఎవరూ లేకపోవడంతో వివాదం తారస్థాయికి చేరింది. గమనించిన తోటి విద్యార్థులు తమ సెల్ ఫోన్ లో ఈ దాడిని వీడియో తీశారు. విషయం సదరు విద్యార్థులు తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న కళాశాల యాజమాన్యం ఘటన బయటికి పోక్కకుండా విద్యార్థులను కట్టడి చేశారు. గాయాల పాలైన సదరు విద్యార్థిని ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు కళాశాలకు చేరుకొని యాజమాన్యాన్ని నిలదీయగా చిన్న చిన్న ఘర్షణలు హాస్టల్స్ లో సహజమైనది తోసిపిచ్చారు. విషయం ఎవరికీ చెప్పవద్దని చెబితే రానున్న పరీక్షలకు విద్యార్థుల హాల్ టికెట్లు నిలిపివేస్తామని తల్లిదండ్రు బెదిరింపులకు పాల్పడుతూ సమాచారం. దాడి ఘటన సోషల్ మీడియాలో వైరల్ కావడంతో దీనిపై కళాశాల యాజమాన్యాన్ని మీడియా ప్రతినిధులు వివరణ ఎందుకు ప్రయత్నించగా వారు దురుసుగా ప్రవర్తించటంతో పాటు వివరాలు తెలిపేందుకు నిరాకరించారు. తల్లిదండ్రులు సైతం దాడికి గల కారణాలు తెలిపేందుకు యాజమాన్యం బెదిరింపులకు భయపడి చెప్పేందుకు నిరాకరించారు. ఇదిలా ఉండగా విద్యార్థులకు మద్యం, మత్తు పదార్థాలు హాస్టల్ లోకి ఎలా వచ్చాయి అనే అనుమానాలు సర్వత్ర చర్చనీయాంశంగా మారింది. పరీక్షల సమీపిస్తున్న తరుణంలో విద్యార్థుల మధ్య తలెత్తిన వివాదం ఘర్షణ పై సంబంధిత శాఖ అధికారులు ఆరా తీయవలసిన అవసరం ఎంతైనా ఉందని ఇతర విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఈ విషయమై ఖానాపురం హవేలీ పోలీస్ స్టేషన్ సిఐ భాను ప్రకాష్ ను వివరణ కోరగా గత శుక్రవారం వివాదం జరిగిందని తమ దృష్టికి వచ్చినట్లు తెలిపారు, కానీ దీనిపై ఎవరు ఫిర్యాదు చేయలేదని సోషల్ మీడియాలో వైరల్ గా మారిన వీడియో క్లిప్పింగుల ఆధారంగా విచారణ చేపడతామని ఆయన బదులిచ్చారు.

## భీంగల్ కేజీబీవీలో అసిస్టెంట్ డ్రై స్వీపర్ పోస్టులు ఖాళీలు



నిజామాబాద్ జిల్లా రూరల్ ప్రతినిధి భీంగల్ మున్సిపాలిటీ (నేటిశుభోదయ)ఫిబ్రవరి 20. భీంగల్ మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) లో అసిస్టెంట్ డ్రై, స్వీపర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు స్పెషల్ ఆఫీసర్ డి.అనురాధ తెలిపారు. భీంగల్ మండలానికి చెందిన అర్హత కలిగిన మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె పేర్కొన్నారు. అర్హతలు, కనీస విద్యార్హత: ఏడవ తరగతి ఉత్తీర్ణత, వయస్సు.18 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాల మధ్య భీంగల్ మండలనికి చెందినవారై ఉండాలి. బోనఫైడ్ సర్టిఫికేట్ తప్పనిసరి. సమర్పించాల్సిన పత్రాలు. పూర్తిగ నింపిన దరఖాస్తు ఫారం, ఆధార్ కార్డు వగైర పత్రలు, విద్యార్హత ధ్రువపత్రలు, బోనఫైడ్ సర్టిఫికేట్ ఆసక్తిగల అభ్యర్థులు కుప్పకంటి రోడ్డులో ఉన్న కేజీబీవీ పాఠశాలలో స్వయంగ హాజరై తమ దరఖస్తులు,పత్రలు సమర్పించాలి. ఈ నెల 22వ తేదీ నుంచి 23వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ జరుగును. ఈ నెల 24వ తేదీన ఎంపిక ప్రక్రియ ఉంటుందిని ఫిబ్రవరి 25వ తేదీన ఫలితాలు ప్రక్రియ వెల్లడిస్తామని అభ్యర్థులు నిర్దిష్ట తేదీలలో అవసరమైన పత్రలతో హాజరుకావాలని స్పెషల్ ఆఫీసర్ డి.అనురాధ సూచించారు.

# అధర్మ యుద్ధంలో ధర్మంగా గెలిచాం

### కౌన్సిలర్ల అభినందన సభలో సిపిఐ నేత కూనంనేని సాంబశివరావు




ఖమ్మం, నేటి శుభోదయ ::: పార్టీ విస్తరణ, ప్రజా ఉద్యమ నిర్మాణమే లక్ష్యంగా పనిచేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో పలు చోట్ల అధర్మ యుద్ధం జరిగిందని సిపిఐని ఒంటరిని చేసి ఓడించేందుకు ప్రయత్నాలు జరిగాయని ఆధర్మ యుద్ధంలోనూ ధర్మంగా గెలిచామని ఆయన తెలిపారు. సిపిఐ పక్షాన ఏదులాపురం, వైరా మున్సిపాలిటీలలో గెలుపొందిన కౌన్సిలర్ల అభినందన సభ శుక్రవారం సిపిఐ కార్యాలయంలో జరిగింది. దండి సురేష్ అధ్యక్షతన జరిగిన సభలో కూనంనేని మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నికలు ఒక బాగమని ఇటీవల జరిగిన పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పొత్తు ధర్మాన్ని పాటించలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 41 చోట్ల మున్సిపల్, కార్పోరేషన్లలో విజయం సాధిస్తే అందులో 30 స్థానాల్లో సిపిఐ ఒంటరిగానే పోటీ చేసి గెలిచిందన్నారు.ఐదు చోట్ల కాంగ్రెస్ మద్దతు, ఆరు చోట్ల బిఆర్ఎస్ మద్దతుతో పోటీ చేసి విజయం సాధించడం జరిగిందన్నారు.ఎన్నికల్లో గెలుపు ప్రజలు హర్షించేవిధంగా ఉండాలి తప్ప ఏదో ఒకవిధంగా గెలవాలన్న ఆలోచన ప్రమాదకరమైందని అది ప్రజామోదం పొందదని కూనంనేని తెలిపారు.అధికార యంత్రాంగం సైతం ప్రజాస్వామ్య పద్ధతులను పరిరక్షించేందుకు కృషి చేయాలని అధికారంలో ఉన్న వారు ఏమి చెబితే అది చేయడం ఉద్యోగ ధర్మం కాదని సాంబశివరావు సూచించారు. ఈ సమావేశంలో సిపిఐ నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## వైరా మున్సిపాలిటీ అభివృద్ధిలో భాగస్వాములు అవుదాం



### బిఆర్ఎస్ కౌన్సిలర్ లు...

వైరా నేటి శుభోదయ..: వైరా మున్సిపాలిటీ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం అవుదామని శుక్రవారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో జరిగిన పదవీ బాధ్యతల స్వీకరణ సందర్భంగా వైరా మున్సిపల్ చైర్మన్ కాపా చంద్రకళను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేసిన బిఆర్ఎస్ కౌన్సిలర్లు. ఈ సందర్భంగా చైర్మన్ డాక్టర్ కాప చంద్రకళ మాట్లాడుతూ తమకు సహకరించాలని బి ఆర్ఎస్ కౌన్సిలర్లను కోరారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ కౌన్సిలర్లు కట్టా స్వరూప రాణి, దొంత బోయిన వెంకటేశ్వర్లు, మాదినేని సునీత, చిలక చిన్న కోటయ్య, తిరుపతి శివకుమారి, కెన్నెర కృష్ణ, నల్లమోతు శైలజ, సీనియర్ నాయకులు వనమ విశ్వేశ్వర రావు, కట్టా కృష్ణార్జున రావ్,మండల అధ్యక్షులు బాణాల వెంకటేశ్వర్లు, నూకల ప్రసాద్, నూకల వాసు, అప్పం సురేష్, కారుకొండ బోస్, కొల్లా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# వైరా నూతన మున్సిపల్ చైర్ పర్సన్ గా

### డాక్టర్ కాపా చంద్రకళ - వైస్ చైర్మన్ గా కట్ల సంతోష్



వైరా నేటి శుభోదయ : వైరా మున్సిపల్ కార్యాలయం మున్సిపల్ చైర్మన్గా డాక్టర్ కాపా చంద్రకళ వైస్ చైర్మన్గా కట్ల సంతోష్ బాధ్యతలు చేపట్టారు ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైరా నియోజకవర్గ ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ మరియుడిసిసిబిఅధ్యక్షులునూతిసత్యనారాయణ గౌడ్ మరియు మాజీ డిసిసిబి అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొనడం జరిగింది ఎమ్మెల్యే మాలోత్ రాందాసు నాయక్ మాట్లాడుతూ వైరా మున్సిపాలిటీఅన్నిమున్సిపాలిటీల కంటే మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని అలాగే మున్సిపాలిటీ కావాల్సిన నిధుల్ని రాష్ట్ర ప్రభుత్వం నుంచి విడుదలయ్యే విధంగా తన వంతు కృషి చేస్తానని వారు పేర్కొనడం జరిగింది ఈ యొక్క కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పట్టణ ప్రజలు పాల్గొనారు

# ఐదు సంవత్సరాలలోపు పిల్లల మరణాలను తగ్గించండి

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి చిలుక విజయకుమార్ ఫిబ్రవరి 20 నేటి శుభోదయ: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో 5 సంవత్సరాల లోపు మరణాల పై సమీక్షను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రాజశ్రీ ఆధ్వర్యంలో డీఎంహెచ్వో కార్యాలయంలో నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ మాట్లాడుతూ.. వైద్యాధికారులు, వైద్య సిబ్బంది మెడికల్ నాలెడ్జ్ ను పెంచుకుంటూ వైద్య సేవలను అందించాలని.దినేస్త్రీలో,చిన్నపిల్లల్లో ప్రమాదకర లక్షణాలను ముందే గుర్తించాలని,బాలింతలను క్రమం తప్పకుండా



వారి ఇంటి వద్ద ఫాలో అప్ చేయాలని అన్నారు.సిపిఆర్ పట్ల అందరు అవగాహన కలిగి ఉండాలని ప్రతి గర్భిణీ స్త్రీని,ప్రతి బాలింతని ఫాలోఅప్ విజిట్స్ లో తల్లిపాల ప్రాముఖ్యతపై వివరించాలన్నారు.వేరే ప్రాంతాల నుండి తల్లి గారి ఇంటికి వచ్చిన మన వద్ద నుండి వేరే ప్రాంతానికి వెళ్లిన మదర్ ఇన్,మదర్ ఔట్ సమాచారాన్ని ఇచ్చి పుచ్చుకోవాలన్నారు తద్వారా ఫాలోఅప్ సక్రమంగా నిర్వహించి ప్రాణాలను కాపాడే అవకాశం ఉందని అన్నారు.ప్రథమ చికిత్స కిట్టును ఎమర్జెన్సీ కిట్టును అందరివద్దా అందుబాటులో



ఉండాలని,బిడ్డకు బిడ్డకు మధ్య వ్యత్యాసం పాటించేలా అవగాహన కలిగించాలని,శాశ్వత,తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతులపై అవగాహన కౌన్సిలింగ్ చేసి అంతరా,ఐయుడి,పిపీఐయుసిడి,వాడేలా చూడాలన్నారు.అంతిమంగా మన చేతిలో ఉండి ఎటువంటి నిర్లక్ష్యం వహించకుండా కాపాడదగ్గ ప్రాణాలు అన్నిటిని కాపాడే బాధ్యత మనందరి పైన ఉందని ఈ సందర్భంగా వారు తెలియజేశారు.ఈ సందర్భంగా పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ శ్రీకాంత్,డాక్టర్ నవీన్ మాట్లాడుతూ.. అనుబంధ ఆహారంపై,తల్లిపాలపై,చెవిలో ముక్కులో నూనె వేయడం వల్ల కలిగే అనర్థాలపై,చిన్నపిల్లలు ప్రతిరోజు కనీసం 20 గ్రాముల బరువు పెరగాలన్నారు,సరిపడా నిద్రపోకపోయినా,పాలు త్రాగకపోయినా,మూత్రం చేయకపోయినా అనుమానించి వెంటనే వైద్యుల వద్దకు తీసుకువెళ్లాలి అన్నారు.స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ నిషాద్,అశ్విని మాట్లాడుతూ..గర్భిణీ స్త్రీలకు సీబీపీ,హిమగ్లోబిన్,బిపి రికార్డు హైట్,వెయిట్ పరీక్షించాలని కనీసం నాలుగు సార్లు వైద్యుని చేత పరీక్షించాలన్నారు.ఇంకా ఈ కార్యక్రమంలో డి ఐ ఓ డాక్టర్ ఎం అశోక్,స్త్రీ వైద్య నిపుణురాలు డాక్టర్ నిశాత్,పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ నవీన్,డాక్టర్ శ్రీకాంత్,డాక్టర్ హరీష్ కుమార్,అనస్థటిస్ట్ డాక్టర్ సుజయ్ కుమార్,డిప్యూటీ డి ఎం హెచ్ ఓ లు అశ్విని,సమత,పి ఓ ఎం సి హెచ్ డాక్టర్ శ్వేత,సిడిపిఓలు జానకి,జ్యోతి,రాంబాబు,డి హెచ్ ఈ లు గన్పూర్ వెంకటేశ్వర్లు,మనోహర్ వివిధ పీహెచ్ ల వైద్యాధికారులు,పర్యవేక్షణ అధికారులు,ఏఎన్ఎంలు,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ చిత్త శుదితో పని చేయాలి

రాజేంద్రనగర్ నేటి శుభోదయం : మొదటి సారి మైలర్ దేవ్ పల్లి డివిజన్ కార్పొరేటర్ గా గెలిచినా తర్వాత ఐదు సంవత్సరలలో 100 కోట్ల తో అభివృద్ధి చేయడం జరిగింది. అని మైలర్ దేవ్ పల్లి మాజీ కార్పొరేటర్ రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇంచార్జి తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కాటేదాన్ డివిజన్ బిజెపి కార్యాలయం తోకల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2016 లో బి ఆర్ ఎస్ పార్టీ నుండి మొదటి సారి గెలిచి మైలర్ దేవ్ పల్లి డివిజన్ ను 100 కోట్ల తో అభివృద్ధి చేయడం జరిగింది అన్నారు. ప్రజలకు బి.ఆర్.ఎస్ పార్టీ చేస్తున్న అన్యాయని వెతిరేకస్తూ బి ఆర్ ఎస్ పార్టీకి రాజీనామా చేసి భారతీయ జనత పార్టీ లో చేరడం జరిగిందన్నారు. రెండో సారి బిజెపి నుండి పోటీ చేస్తే ప్రజలు నేను చేసిన అభివృద్ధి ని గుర్తించి ప్రజలు నన్ను గెల్పించారన్నారు. రెండో సారి గెలిచిన తర్వాత మైలర్ దేవ్ డివిజన్ లో 114 కోట్ల తో అభివృద్ధి పనులు చెప్పట్టడం జరిగిందన్నారు. అధికారం లో ఉన్న లేకున్నా ప్రజల మధ్య ఉండి ప్రజల కోసం పనిచేస్తనన్నారు. బస్తి, కాలనీ లలో పర్యటిస్తు ప్రజల సమస్యలను తెలుసుకోని సమస్యలను పరిష్కారానికి కృషి చేశానరు. ప్రతిపక్ష పార్టీ లో ఉండి ధర్నాలు పోరాటలు చేసి నిధులు తీసుకునిరావడం జరిగిందన్నారు. సీసీ రోడ్లు, బాక్స్ డ్రైనేజ్, నాలాలు, పార్కు, యూత్ బిల్డింగ్స్, మహిళా బిల్డింగ్స్, వంటి అన్ని రంగాలలో మైలర్ దేవ్ పల్లి డివిజన్ అభివృద్ధి చెందడానికి కృషి చేశానరు. ఐదు సంవత్సరంలో 338 పనులకు జిహెచ్ఎంసి ద్వారా 86 కోట్ల 93 లక్షల నిధులను తీసుకోని రావడం జరిగిందన్నారు.



### 53 కోట్ల 72 లక్షలతో 254 పనులు పూర్తి చేశామన్నారు. 84పనులు

33 కోట్ల 21లక్ష పనులు ప్రభుత్వం నిధులు మంజురు చేయక టెండర్ ప్రక్రియ లో పెండింగ్ లో ఉన్నాయిన్నారు. జిహెచ్ఎంసి ప్రాజెక్ట్ విభాగం ద్వారా 22 కోట్లతో అప్పచెరువు, దుర్గ నగర్ నుండి పల్లె చెరువు వరకు బాక్స్ డ్రైనేజీ పనులు స్టేడియం అభివృద్ధి పనులను 6 కోట్ల రూపాయలు కేటాయించడం జరిగిందన్నారు. మైలర్ దేవ్ పల్లి డివిజన్ లో ప్రతి బస్తి, కాలనీలో 90% 7కోట్ల 20 లక్షల తో సీవరేజ్ పనులు చెప్పటము అన్నారు. కార్పొరేటర్ స్పెషల్ ఫండ్ కింద వచ్చిన 1కోటి తో లక్ష్మి గుడ్ శాఖ గ్రౌండ్, లో కమ్యూనిటీ హాల్,

### ప్రేమవతి పేట్ రజక సంగం
### మైలర్ దేవ్ పల్లి లో యూత్ బిల్డింగ్ టీఎన్జీవో
### సేవరేజ్ పైప్ లైన్ స్పెషల్ ఫండ్
### కేటాయించమానరు.

10 సంవత్సరలు ప్రంభోవత్సవలకు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ఎందుకు రాలేదు అని ప్రశ్నించరు.? పది సంవత్సరం లో అభివృద్ధి ప్రారంభోత్సవ సమయంలోగొడవలు చేశారు మా కార్యకర్తల పైన ఎమ్మెల్యే దాడులకు ప్రయత్నించారు. మైలర్ దేవ్ పల్లి అభివృద్ధి లో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పాత్ర ఏముంది అని ప్రశ్నించారు.? సీసీ రోడ్లు శివరేజ్ పైప్ లైన్ పనులు కార్పొరేటర్ హయాంలో శాంక్షన్ అయ్యా లేదా చెప్పాలిసిన బాధ్యత ఎమ్మెల్యే మీద ఉందానారు. ఐదు సంవత్సరం లో 100 కోట్ల అభివృద్ధి పనులు చేశాము ఎమ్మెల్యే చిత్త శుది తో పని చేయాలి అని హితువు పలికారు. ప్రజల సమస్యలను తెలుసుకో ప్రజల సమస్యలను పరిష్కారం కొసం కృషి చేస్తాను అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పాండు యాదవ్,



రావుల భాస్కర్, బుచ్చి రెడ్డి, సంతు గౌడ్, మాజీ అధ్యక్షుడు అడికే జనార్ధన్, ఎల్.వి రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, బబ్లూ, ఎన్ను శంకర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, ప్రభుదాస్, పృధ్వీ రాజ్, రఘునాథ్ రాజ్ కుమార్, గోపాల్ నాయక్, కుర్మయ్య, బి.రామ కృష్ణ, రామ రావు, శేఖర్, సురేష్, దినకర్, +. శంకర్, శ్రవణ్, తదితరులు పాల్గొన్నారు.

# యూరియా కోసం అన్నదాతల అష్ట కష్టాలు

### శాపంగా మారిన ఫర్టిలైజర్ యాప్
### ఓటీపీ నెంబర్ పేరుతో సర్కారు చీటింగ్
### ఆర్మూర్ నియోజకవర్గంలో రోడ్లెక్కిన అన్నదాతలు
### శ్రీరైతులను గోసపెడుతున్న కాంగ్రెస్
### బీఆర్ఎస్ నేత,మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి

జామాబాద్ జిల్లా ప్రతినిధి చిలుక విజయకుమార్ ఆర్మూర్ ఫిబ్రవరి 20 నేటి శుభోదయ :: యూరియా బస్తాల కోసం అన్నదాతలు అష్ట కష్టాలు పడుతున్నారని బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు,ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వ దిక్కుమాలిన పాలన వల్ల ఇటు షాపులోనూ,అటు యాపులోనూ యూరియా దొరకని దౌర్భాగ్య పరిస్థితి నెలకొందని ఆయన శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో మండిపడ్డారు.ఫర్టిలైజర్ యాప్ రైతుల పాలిట శాపంగా మారిందని ఆయన అన్నారు.ఓటీపీ నెంబర్ పేరుతో సర్కారు రైతులను చీటింగ్ చేస్తోందని ఆయన ఆరోపించారు.ఆర్మూర్ నియోజక వర్గంలో అన్నదాతలు యూరియా కోసం రోడ్లెక్కి ఆందోళన చేస్తున్నారన్నారు. నందిపేట్ మండలంలో ఫర్టిలైజర్ యాప్ మోసాలపై మండిపడుతూ సర్కార్ కు వ్యతిరేకంగా పోరాడుతున్నారని జీవన్ రెడ్డి పేర్కొన్నారు. యూరియా కోసం పడుతున్న బాధలు చూస్తుంటే ఆత్మహత్య చేసుకోవాలనిపిస్తుందని రైతులు కంటతడి పెడుతున్న దృశ్యాలు చూసి




గుండె తరుక్కుపోతోందని ఆయన అన్నారు.తమకు చదవు రాదని,ఓటీపీ అంటే ఏమిటో తెలవదని,ఫోన్లో యూరియా బుక్ చేయడం వస్తలేదని,ఇక తమకు యూరియా దొరికేదెట్లా అని రైతులు వాపోతున్నారని ఆయన తెలిపారు.చదువు రాని, ఫోన్లు వాడటం రాని రైతులకు ప్రభుత్వం తీసుకొచ్చిన ఫర్టిలైజర్ యాప్ శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు యూరియా కోసం ఆన్లైన్లో బుకింగ్ చేయడం,రైతులకు ఓటీపీలు రాకపోవడం, ఆండ్రాయిడ్ ఫోన్ లేకపోవడంతో యూరియా దొరకక పోవడం వల్ల రైతులు ప్రభుత్వం పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని జీవన్ రెడ్డి వివరించారు.యూరియా కూడా ఇవ్వలేని చేతగాని ప్రభుత్వం ఉండడం తాము చేసుకున్న దౌర్భాగ్యం అని రైతులు కాంగ్రెస్ ప్రభుత్వంపై దుమ్మెత్తి పోస్తున్నారన్నారు. యూరియా యాప్ ను తీసేయాలని,గతంలో ఇచ్చిన విధంగానే యూరియా అందించాలని రైతులు డిమాండ్ చేస్తున్నా రేవంత్ రెడ్డి సర్కారు చీమ కుట్టినట్లు కూడా లేదని ఆయన విమర్శించారు.రాష్ట్రంలో రైతులను గాలికొదిలి ఢిల్లీ పెద్దలకు గులాంగిరి చేయడం,అమరావతి గురువుకు సలాంలు కొడుతూ తిరగడమే రేవంత్ రెడ్డికి నిత్యకృత్యమైందని జీవన్ రెడ్డి మండిపడ్డారు.

# ప్రజాసేవ చేసే అవకాశం రావడం అదృష్టం నీరుడు శేఖర్ముదిరాజ్

### కిస్మత్పూర్లో సొంత ఖర్చులతో రోడ్లకు శాశ్వత పరిష్కారం

రాజేంద్రనగర్ నేటి శుభోదయ: తమ దృష్టికి వచ్చిన సమస్యలను తన సొంత ఖర్చులతో అభివృద్ధి పనులను చేపడుతున్నామని కిస్మత్పూర్ మాజీ ఉపసర్పంచ్, రంగారెడ్డి జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యులు నిరుడు శేఖర్ముదిరాజ్ అన్నారు. కిస్మత్పూర్ 122 డివిజన్





పరిధిలోని ఫైన్ ఆర్ట్స్ కాలనీలో గుంతల రోడ్లతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికి సరైన స్పందన లేకపోవడంతో ప్రజల కష్టాన్ని తన సమస్యగా భావించి వెంటనే స్పందించిన నిరుడు శేఖర్ముదిరాజ్ మరోసారి తన సేవాభావాన్ని చాటిచెప్పారు. ఫైన్ ఆర్ట్స్ కాలనీలో గుంతలతో, అస్తవ్యస్తంగా మారిన ఓడ్ల కారణంగా స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతి రోజూ పనులకు వెళ్లే ఉద్యోగులు, పాఠశాలలకు వెళ్లే చిఆన్నరులు, వృద్ధులు ఈ దుస్థితి వల్ల ఇబ్బందిపడుతుండడంతో సమస్యను శేఖర్ముదిరాజ్ దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే ఆయన స్పందించి తన సొంత



ఖర్చులతో గోతులమయంగా మారిన రోడ్లకు మరమ్మత్తులు చేయించి శాశ్వత పరిష్కారం చూపారు. ఈ సందర్భంగా శేఖర్ముదిరాజ్ మాట్లాడుతూ వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారి, రాకపోకలకు అంతరాయం కలుగుతుందన్నారు. ఈ సమస్యను స్థానికులు తన దృష్టికి తెచ్చిన వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి విషయం తీసుకెళ్లామన్నారు. అయితే ఆశించిన స్థాయిలో అధికారుల నుంచి స్పందన రాకపోవడంతో ప్రజల కష్టాన్ని మరింత కాలం చూడలేక స్వయంగా ముందుకు వచ్చి సొంత ఖర్చులతో మొరం తీసి రోడ్లను మరమ్మత్తులు చేశామన్నారు. ప్రజల కోసం పదవి అవసరం లేదని, నిజమైన నాయకత్వం అంటే సేవ అని అన్నారు. రాజకీయాలకు అతీతంగా, ప్రజల సమస్యల పరిష్కారమే తన ధ్యేయమని అన్నారు. ప్రజల సమస్యలపై వెంటనే స్పందిస్తూ, ప్రాంత అభివృద్ధి కోసం పనులు చేయిస్తున్న శేఖర్ముదిరాజ్ సేవాభాం నిజంగా ప్రశంసనీయమని స్థానికులు పేర్కొంటున్నారు. ఆయనలాంటి నాయకులు సమాజానికి ఆదర్శమని తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు మారుతున్న కాలానికి అనుగుణంగా సైన్స్ సాంకేతిక విద్యను అభ్యసించాలని

### జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ



వైరానేటి శుభోదయ: వైరా మండలం గరికపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గీతం యూనివర్సిటీ సౌజన్యంతో క్రిస్టోగ్రఫీ ఇన్ ఇండియా సహకారంతో సైన్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు ఎగ్జిబిషన్ ను జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ సర్పంచ్ లక్కిరెడ్డి నాగలక్ష్మి గీతం యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ గుండ్ల రాంబాబు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు ఈ సందర్భంగా విద్యార్థులు తయారుచేసిన సైన్స్ ఎగ్జిబిషన్ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు సాంకేతిక విద్యను ముందుకు తీసుకుపోవాలని కోరారు విద్యార్థులకు సైన్స్ టెక్నాలజీ ఎంతో అవసరమని అన్నారు ప్రస్తుత పరిస్థితుల్లో సెల్ ఫోన్ టెక్నాలజీ రోబోటిక్ టెక్నాలజీ ఎంతో అవసరం అని అన్నారు ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదివి దేశ అభివృద్ధికి పాటుపడాలని కోరారు ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు గీతం యూనివర్సిటీ ద్వారా ఆర్థిక చేయూతను అందిస్తున్నామని తెలిపారు గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల కోసం గీతం యూనివర్సిటీ వారు సైన్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు గరికపాడు పాఠశాలకు 60 వేల రూపాయల విలువైన సైన్స్ పరికరాలు గీతమ్స్ యూనివర్సిటీ వారు అందజేశారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లక్కిరెడ్డి నాగలక్ష్మి గీతం యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ గుండ్ల రాంబాబు ఎంఈఓ వెంకటేశ్వర్లు ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ ఉప సర్పంచ్ మాతంగి మౌనిక లక్కిరెడ్డి ప్రభాకర్ రెడ్డి గీతం యూనివర్సిటీ ప్రొఫెసర్లు డాక్టర్ శరత్ డాక్టర్ వెంకట్ డాక్టర్ సుధాకర్ ఏ ఎం ఓ ప్రభాకర్ రెడ్డి సీఎంఓ సురేష్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రంగా జనార్ధన్ కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ బాలకృష్ణ స్థానికులు ఐలూరు సత్యనారాయణ రెడ్డి మెరుగు రత్నం రాజు యాకోబ్ స్కూల్ చైర్మన్ తిరుపతమ్మ పాల్గొన్నారు



# మధిర ఓ బ్యాంకులో మాయాజాలం

ఖమ్మం, మధిర, నేటి శుభోదయ ::: ఖమ్మం జిల్లా, మధిర పట్టణానికి చెందిన ఓ వ్యక్తి బ్యాంకు మేనేజర్ తో కుమ్మక్కై బ్యాంకు లోనే ప్రైవేట్ గా ఫైనాన్స్ చేస్తున్న వైనం ఆలస్యంగా వెలుగులోకి వస్తోంది. వచ్చిన లాభంలో చెరొక రూపాయి తీసుకోనే విధంగా ఒప్పందం కుదుర్చుకున్నారనే ఆరోపణలు సర్వత్రా వ్యక్తమవుతోంది. గోల్డ్ లోన్ తీసుకున్న వ్యక్తి టాప్ పెంచాలి అంటే(పెంచే అవకాశం ఉన్న) తీసుకున్న మొత్తంలోని చెల్లిస్తేనే గోల్డ్ లోన్ అదనంగా ఇవ్వడం జరుగుతుంది. కావాలంటే మా బ్యాంకు లోనే ఒక వ్యక్తి దగ్గర ఫైనాన్స్ తీసుకోండి అంటూ బేరసారాలకు దిగిన సంఘటన ఇప్పుడు మధిర లో హార్ట్ టాపిక్ గా మారుతోంది. ఉదాహరణకు ఒక వ్యక్తి గోల్డ్ లోన్ సుమారుగా రూ 30, 000 లు తీసుకొని దాన్ని రెన్యువల్ చేయాలి అంటే కచ్చితంగా ఆ మొత్తాన్ని కడితేనే రెన్యువల్ అవుతుంది. ఆ మొత్తాన్ని పలాన వ్యక్తి దగ్గర తీసుకోవాల్సిందిగా మేనేజర్ రిఫర్ చేయడం వెనుక పలు అనుమానాలకు తావిచ్చింది. రూ 30 వేలకు, రూ 33,000 లు వసూల్ చేశారనే ఆరోపణలు ఉన్నాయి. బ్యాంకు మేనేజర్, ఫైనాన్సర్ ఇద్దరికీ చేరి సగం వాటాలు తీసుకోవడం జరిగింది అని ఆరోపణలు ఉన్నాయి. గత కొంతకాలంగా జరుగుతున్న తంతు పై క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. న్యాయం చేయాలంటూ లబోదిబో అంటున్న బాధితులు. పూర్తి వివరాలు త్వరలో వెల్లడి కానున్నాయి.

# సైఫాబాద్‌లో లంచం బండారం బహిర్గతం

### రూ.70 వేల డిమాండ్

### ఏసిబి రెడ్ హ్యాండెడ్‌గా పట్టివేత



హైదరాబాద్, నేటి శుభోదయ ::: హైదరాబాద్‌లోని సైఫాబాద్ ప్రాంతంలో మరో లంచం కేసు వెలుగులోకి వచ్చింది. 2026-2027 విద్యా సంవత్సరానికి సంబంధించిన సిబిఎస్ఈ నో డ్యూస్ సర్టిఫికేట్ దరఖాస్తును ప్రాసెస్ చేయడానికి అధికారులు లంచం డిమాండ్ చేసిన ఘటన కలకలం రేపుతోంది. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్ కార్యాలయంలో సూపరింటెండెంట్ (జనరల్)గా పనిచేస్తున్న సంగీన ఫణిరాజ్‌పై ఆరోపణలు వచ్చాయి. ఫిర్యాదుదారుడి పాఠశాలకు సంబంధించిన సిబిఎస్ఈ నో డ్యూస్ సర్టిఫికేట్ దరఖాస్తును ఉన్నతాధికారులకు పంపేందుకు లంచం కోరినట్లు సమాచారం. ఈ వ్యవహారంలో రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ (డిఇఓ ) కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న గుమ్మిడాల శ్రీధర్ ద్వారా రూ.70,000 ల లంచం డిమాండ్ చేసినట్లు వెల్లడైంది. ఫిర్యాదుదారుడు తెలంగాణ అవినీతి నిరోధక శాఖ (ఏసిబి) అధికారులను ఆశ్రయించగా, వారు పన్నిన ఉచ్చులో అధికారులు చిక్కుకున్నారు. లంచం స్వీకరిస్తున్న సమయంలో ఏసిబి అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని అరెస్ట్ చేశారు. అనంతరం సంబంధిత అధికారులపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనతో విద్యాశాఖలో అవినీతి వ్యవహారాలపై మరోసారి ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వం, ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# రాధకృష్ణ ఆలయ ప్రారంభ మహోత్సవం



నిజామాబాద్ జిల్లా రూరల్ ప్రతినిధి ధర్పల్లి మండలం(నేటిశుబోదయ)ఫిబ్రవరి 20.: ధర్పల్లి మండలంలోని దుబ్బాక గ్రామంలో నూతనంగా నిర్మించిన రాధాకృష్ణ ఆలయ ప్రతిష్ఠాపన మహోత్సవం శుక్రవారం కన్నులపండువగా జరిగింది. యాదవ సంఘం ఆధ్వర్యంలో గత మూడు రోజులగా నిర్వహిస్తున్న హోమలు, విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలు శాస్రోక్తంగా ముగిశాయి. ఉదయం యజ్ఞం, అనంతరం పూర్ణాహుతి నిర్వహించి, విగ్రహాలకు ప్రాణప్రతిష్ట చేసి ఆలయ ప్రవేశం చేశారు.

## చైల్డ్ రైట్స్-పోక్సోపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు



నిజామాబాద్ జిల్లా రూరల్ ప్రతినిధి భీంగల్ మున్సిపాలిటీ (నేటిశుభోదయ)ఫిబ్రవరి 20.: భీంగల్ పట్టణంలో గల కెజీబీవి పాఠశాలలోజిల్లా మహిళ సాధికారిత కేంద్రం ఆధ్వర్యంలో బేటి బచావో - భేటీ పడహో కార్యక్రమంలో భాగంగా టిఓటి శిక్షణ నిర్వహించరు. ఏఆర్ ఎడ్యుకేషన్ ట్రైనర్ అపర్ణ చైల్డ్ రైట్స్, జెండర్ ఈక్వాలిటీ, పోక్సో చట్టం, కెరీర్ గైడెన్స్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## భీంగల్ ప్రజలు మాపై దయ చుపలేదని వెల్లడించిన

### ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి.



నిజామాబాద్ జిల్లా రూరల్ ప్రతినిధి భీంగల్ మున్సిపాలిటీ (నేటిశుభోదయ) ఫిబ్రవరి 20.: భీంగల్ పట్టణ ప్రాంతం బిఆర్ఎస్ హయంలో అన్ని రకాలుగా అభివృద్ధి చేసిన మున్సిపాల్ ఎన్నికల్లో తమపై దయ చూపలేదని ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి అన్నారు. మీడియా సమావేశంలోఆయన మాట్లాడతు అన్ని వార్డులోబిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తారని అనుకున్నమన్నారు. ఎన్నికల్లో ఓడిన భీంగాల్ అభివృద్ధి కోసం సేవ కొనసాగిస్తామని పేర్కొ

# రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం

### కుదేలైన తెలంగాణ రాష్ట్ర ఖజానా?

### రెవెన్యూ రాబడుల్లో భారీ పతనం

### 2025-26లో అంచనా 2.29 లక్షల కోట్లు

### జనవరినాటికి వచ్చింది 1.38 లక్షల కోట్లే

### అప్పుల ఊబిలో కూరుకుపోతున్న రాష్ట్రం

### కాగ్ జనవరి నివేదిక గణాంకాల్లో వెల్లడి



హైదరాబాద్, నేటి శుభోదయ ::: రాష్ట్రం ఆర్థిక సంక్షోభం దిశగా పయనిస్తున్నదా? తెలంగాణ రాష్ట్ర ఖజానా కుదేలైందా? 2025-26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో వేసిన అంచనాలను అందుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలం అయ్యిందా? తాజా గణాంకాలను పరిశీలిస్తే అవును అనే సమాధానమే వస్తుంది. జనవరికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కాగ్‌కు సమర్పించిన నివేదిక రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని కండ్లకు కడుతున్నది. 2025-26 ఆర్థిక సంవత్సరం ముగియడానికి మరో 40 రోజుల సమయం కూడా లేని తరుణంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అత్యంత దయనీయంగా మారిందని నివేదిక స్పష్టం చేస్తున్నది. కొవిడ్ కాలం నాటి దారుణ గణాంకాలు నమోదవుతుండటం కాంగ్రెస్ పాలనకు నిదర్శనమని నిపుణులు మండిపడుతున్నారు. మందగించిన ఆదాయ వృద్ధి, పెరిగిన ఆర్థిక లోటు, అప్పులపై మితిమీరి ఆధారపడటం తప్ప రెండేండ్లకు పైబడిన కాంగ్రెస్ పాలనలో సాధించిందేమిటని ప్రశ్నిస్తున్నారు.

### వచ్చింది 60 శాతమే

2025-26 బడ్జెట్ గణాంకాల ప్రకారం ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.2.29 లక్షల కోట్ల మేర రెవెన్యూ రాబడులు వస్తాయని ప్రభుత్వం అంచనా వేసింది. కానీ, కాగ్ లెక్కల ప్రకారం జనవరి నాటికి రూ.1.38 లక్షల కోట్లు మాత్రమే వసూలయ్యాయి. ఇది అంచనాలో కేవలం 60.23 శాతం ఈ ఆర్థిక సంవత్సరంలో ఇంకా రెండు నెలలు మాత్రమే మిగిలి ఉన్నాయి. ఆర్థిక సంవత్సరంలో 85 శాతం కాలం గడిచిపోయింది. అయినా ప్రభుత్వం సాధించిన ఆదాయం కేవలం 60 శాతమే. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేనాటికి 2023-24లో నమోదైన 63.2 శాతం కన్నా గణనీయంగా తగ్గడం గమనార్హం. కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పాలన ప్రభావం కరోనా స్థాయిలో రాష్ట్ర ఖజానాపై పడిందని చెప్పడానికి కాగ్ నివేదికలే నిదర్శనం. గత ఐదేండ్ల రెవెన్యూ రాబడులను పరిశీలిస్తే 2021-22 ఆర్థిక సంవత్సరంలో మాత్రమే జనవరి నాటికి అత్యల్పంగా 55.80 శాతం ఖజానాకు చేరింది. ఆ ఏడాది కొవిడ్ ప్రభావంతో రాబడి తగ్గింది. ఆ తర్వాత కాంగ్రెస్ పాలనలోనే మళ్లీ రాబడులు పడిపోయాయి. 2024-25లో 55.96 శాతమే రాబడులు రాగా, ఈ ఏడాది 60.23 శాతం మాత్రమే వచ్చింది.

### పడిపోయిన పన్ను ఆదాయం

ఈ ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర పన్ను రాబడి లక్ష్యం రూ.1.75 లక్షల కోట్లుగా ప్రభుత్వం పేర్కొన్నది. కానీ జనవరి నాటికి రూ.1.26 లక్షల కోట్లు మాత్రమే వచ్చినట్టు కాగ్ నివేదిక స్పష్టం చేస్తున్నది. ఇది అంచనాల్లో 72శాతం. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర సొంత పన్నుల రాబడి ఏటికేడు రాకెట్ వేగంతో వృద్ధి సాధించింది. 2021-22లో బడ్జెట్ అంచనాల్లో జనవరి నాటికి ట్యాక్స్ రెవెన్యూ 79.87 శాతం, అలాగే 2022-23లో 80.72 శాతం, 2023-24లో 72.42 శాతం వసూలైంది. కానీ కానీ కాంగ్రెస్ పాలనలో పన్నుల రాబడి తగ్గిపోతున్నది. గడిచిన రెండేండ్ల గణాంకాలే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం. 2024-25లో 68.60 శాతం, 2025-26లో 72.04 శాతం మాత్రమే నమోదైందని కాగ్ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

### ఆదాయ వనరులు తీసికట్టు


కేసీఆర్ పాలనతో పోలిస్తే కాంగ్రెస్ రెండేండ్లపాలనలో ఆదాయ వనరుల పరిస్థితి రోజురోజుకూ తీసికట్టుగా మారింది. జనవరి నాటికి పన్నేతర ఆదాయం 24.87 శాతమే వచ్చింది. కేంద్రం నుంచి అందే గ్రాంట్లు కూడా కేవలం 18.49 శాతం వద్దే నిలిచిపోయాయి. జీఎస్టీ ఆదాయం 73.15 శాతం వసూళ్లతో కొంత ఊరటనిచ్చింది. ఎక్సైజ్ సుంకం 69 శాతం, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ఆదాయం 64.68 శాతంతో లక్ష్యానికి ఆమడ దూరంలోనే ఉన్నాయి. ఇవన్నీ 2024-25 కంటే కొంచెం మెరుగ్గా కనిపిస్తున్నా కేసీఆర్ పాలనతో పోల్చితే వెనుకబడి ఉన్నాయని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. రెవెన్యూ మిగులు ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వం ఆశించినప్పటికీ, అందుకు విరుద్ధంగా లోటు పెరిగిపోతున్నది. ప్రభుత్వం ఈ ఏడాది రూ.2,738 కోట్ల రెవెన్యూ మిగులు ఉంటుందని ఆశించగా, జనవరి నాటికి పరిస్థితి తారుమారై రూ. 10,566 కోట్ల లోటు నమోదైంది. మరోవైపు, రెవెన్యూ వ్యయం (జీతాలు, పెన్షన్లు, వడ్డీలు, సబ్సిడీలు) ఇప్పటికే రూ.1.48 లక్షల కోట్లకు (65.62 శాతం) చేరింది.

### అపరిమితంగా అప్పులు

ఆదాయం రాబట్టలేక కాంగ్రెస్ ప్రభుత్వం అప్పులపైనే ఆధారపడుతున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పులపై నియంత్రణ పాటిస్తామని కాంగ్రెస్ నేత బీరాలు పలికారు. కానీ కాగ్ గణాంకాలను పరిశీలిస్తే రాష్ట్ర ప్రభుత్వం ఏ స్థాయిలో అప్పులపై ఆధారపడిందో తెలుస్తుంది. నివేదిక ప్రకారం.. రాష్ట్రం ఇప్పటికే తన వార్షిక అప్పుల పరిమితిని మించిపోయింది. బడ్జెట్‌లో రూ.54,009 కోట్ల మేర అప్పులు చేస్తామని ప్రభుత్వం పేర్కొన్నది. కానీ జనవరి నాటికే రూ.69,148 కోట్ల మేర రుణాలు తీసుకున్నది. అంటే అంచనాకు మించి 128 శాతం చేరుకున్నది. దీంతో రాష్ట్ర ద్రవ్యలోటు రూ.69,148 కోట్లకు, ప్రాథమిక లోటు రూ.45,063 కోట్లకు పెరిగింది. పెరుగుతున్న వడ్డీ చెల్లింపులు, మందగించిన ఆదాయం, అదుపు తప్పుతున్న వ్యయాలను అరికట్టేందుకు తక్షణమే దిద్దుబాటు చర్యలు తీసుకోకపోతే, తెలంగాణ దీర్ఘకాలిక రుణ సంక్షోభంలో చిక్కుకునే ప్రమాదం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# మేనేజ్మెంట్ కోటాలో తాను రాజకీయాల్లోకి రాలేదు

### ఎంతో కష్టపడి ఎమ్మెల్యే స్థాయికి ఎదిగా



వైరా నేటి శుభోదయ: వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్నాయక్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారతాను రాజకీయాల్లో ఎవరిని మోసం చేయలేదని స్పష్టం చేశారు. వైరా మున్సిపాలిటీచైర్మన్ఎన్నికల తర్వాత నుంచి మున్సిపాలిటీ పరిధిలోని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వర్గీయులు కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటున్నారు. ఈ సమయంలో ఎమ్మెల్యే చేసిన ఆసక్తికర వార్తలు చర్చనీయాంశమయ్యాయి. వైరాలోని మున్సిపాలిటీ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం చైర్మన్ గా కాపా చంద్రకళ, వైస్ చైర్మన్ గా కట్ల సంతోష్ పదవి బాధ్యతలు తీసుకున్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరై చైర్మన్ కాపా చంద్రకళను దగ్గరుండి చైర్మన్ సీట్లో



కూర్చోబెట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ వైరా పట్టణ అధ్యక్షులు ఏదునూరి సీతారాములు అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ప్రసంగించారు. తనను వైరా నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజల రుణం తీర్చుకోలేనిదని చెప్పారు. తన ఎమ్మెల్యే పదవి శక్తిని వృధా కానివ్వకుండా రోజులో 18 గంటల పాటు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. సర్కార్‌పై రెచ్చిపోయిన హరీష్ రావుతనకు, తన కుటుంబానికి ఎలాంటి వ్యాపారాలు లేవని పేర్కొన్నారు. తాను రాజకీయాలకు అతీతంగా పనిచేస్తున్నానని వివరించారు. తాను ఎవరిని ఇబ్బంది పెట్టలేదని పేర్కొన్నారు. తన గెలుపు కోసం కృషి చేసిన ఎవరిని మోసం చేయలేదని, మోసం చేయబోనని స్పష్టం చేశారు. తనకు వైరా ఎమ్మెల్యే సీటు వచ్చేందుకు కాంగ్రెస్ జిల్లా మాజీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ కృషి చేశారని పేర్కొన్నారు. ఆ తర్వాత నాయకులు కార్యకర్తలు నియోజకవర్గ ప్రజల సహాయ సహకారాలతో గెలుపొందానని వివరించారు. తన గెలుపుకు కృషి చేసిన వారిని ఎప్పటికీ మర్చిపోనని పేర్కొన్నారు. తన పక్షాన శత్రువులకు కూడా నష్టం జరగదని వివరించారు. తన గెలుపుకు కృషి చేసిన వారిని గుండెల్లో పెట్టి చూసుకుంటానని స్పష్టం చేశారు. అయితే చైర్మన్ గా కాపా చంద్రకళ ఎన్నికైన తరువాత పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రధాన అనుచరుడు అయిన బొర్రా రాజశేఖర్ సతీమణి బొర్రా ఉమాదేవి విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే రాందాస్ నాయక్ కేసీఆర్ కంటే నియంతగా వ్యవహరించారని పేర్కొన్నారు. అప్పటి నుంచి ఆ వర్గం వారు కాంగ్రెస్ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. శుక్రవారం జరిగిన చైర్మన్ పదవి బాధ్యతలు కార్యక్రమానికి పొంగులేటి వర్గానికి చెందిన 1వ వార్డు కౌన్సిలర్ మోరు శ్రీకాంత్, 14వ వార్డు కౌన్సిలర్ దీరావత్ వెంకటేశ్వర్లు హాజరయ్యారు. అయితే ఇదే వర్గానికి చెందిన 3వ వార్డు కౌన్సిలర్ బొర్రా ఉమాదేవి, 7వ వార్డు కౌన్సిలర్ పణితి సైదులు గైర్హాజరయ్యారు. అంతేకాకుండా ఈ కార్యక్రమానికి పొంగులేటి వర్గానికి చెందిన నాయకులు కార్యకర్తలు కూడా గైర్హాజరయ్యారు. ఈ సమయంలో ఎమ్మెల్యే రాందాస్ నాయక్ చేసిన వ్యాఖ్యలు చర్చినియాంశంగా మారాయి. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, జిల్లా మాజీ అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, విత్తనాభివృద్ధి సంస్థ రాష్ట్ర మాజీ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, వైరా మున్సిపాలిటీ చైర్మన్ కాపా చంద్రకళ, వైస్ చైర్మన్ కట్ల సంతోష్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## జంగారెడ్డిగూడెం డివిజన్ ఔషధ తనిఖీ అధికారి కార్యాలయంపై ఏసీబీ దాడి..



**ఏలూరు జిల్లా నేటి శుభోదయ : మెడికల్ షాప్ లైసెన్స్ కోసం 20 వేలు లంచం డిమాండ్ చేసిన డ్రగ్ ఇన్స్పెక్టర్ కంప సురేష్ కుమార్ డ్రగ్ ఇన్స్పెక్టర్ సురేష్ తో పాటు, మధ్యవర్తిగా వ్యవహరించిన మెడికల్ షాప్ యజమాని శివరామకృష్ణను అరెస్టు చేసిన ఏసీబీ అధికారులు**

## చత్రపతి శివాజీ జయంతి వేడుకలు ఘనంగా ఏర్పాటు



నిజామాబాద్ జిల్లా రూరల్ ప్రతినిధి భీంగల్ మున్సిపాలిటీ (నేటిశుభోదయ)ఫిబ్రవరి20.: భీంగల్ మండలం గోన్ గోప్పుల గ్రామంలో చత్రపతి శివాజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. యువకులు, గ్రామ పెద్దలు, కలిసి శివాజీ విగ్రహాన్నికి పూలమాలలు అర్పించి నివాళు లు ఘటించారు. అనంతరం దేశభక్తి నినాదాలు చేశారు. శివాజీ జీవితం, పరాక్రమం గురించి ప్రసంగాలు చేశారు. ఈ కార్యక్రమంలో యువకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో

# వింత పోకడలు..

### సమస్యాత్మక రిజిస్ట్రేషన్లు బయటకు మళ్లింపు ఆరోపణల

### - భారీ ఆమ్యామ్యాల గుసగుసలు

ఖమ్మం, వరంగల్, నేటి శుభోదయ ::: వరంగల్, హనుమకొండ కేంద్రాలలో గల ప్రధాన కేంద్రం అయిన వరంగల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై మరోసారి తీవ్రమైన ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. స్థానికంగా పరిష్కారం కావాల్సిన సమస్యాత్మక రిజిస్ట్రేషన్లను ఇక్కడే నమోదు చేయకుండా,గుట్టుచప్పుడు కాకుండా ఇతర ప్రాంతాల కార్యాలయాలకు మళ్లిస్తున్నారనే సమాచారం బయటకు వస్తోంది. వరంగల్ పరిధిలో ఉన్న స్థలాల రిజిస్ట్రేషన్లను ఇతర ప్రాంతాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు పంపించి అక్కడ నమోదు చేస్తున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో వరంగల్ సబ్ రిజిస్ట్రార్ స్వయంగా ఓకే చెబుతున్నారనే ఆరోపణలు రిజిస్ట్రేషన్ దారుల మధ్య చర్చనీయాంశంగా మారాయి. స్థానికంగా పరిష్కరించలేని లేదా వివాదాస్పదమైన భూముల రిజిస్ట్రేషన్లకు 'ఇక్కడ కుదరదు' అని చెప్పి,వేరే కార్యాలయాలకు మళ్లించడం వెనుక భారీ స్థాయిలో ఆమ్యామ్యాలు జరుగుతున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. "పైసలు ఇస్తే ఏ సమస్యాత్మక రిజిస్ట్రేషన్ అయినా జరుగుతుందన్న భావన కలుగుతోంది" అంటూ కార్యాలయానికి వచ్చిన కొందరు ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా హెడ్ క్వార్టర్‌లో ఉన్న కీలక కార్యాలయం నుంచే ఇతర ప్రాంతాలకు ఫైళ్లు మళ్లించడం చట్టపరంగా సమంజసమేనా..??సంబంధిత ఉన్నతాధికారుల అనుమతి ఉందా..?? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి..!! ఈ వ్యవహారం వెనుక ఉన్న అసలు వాస్తవాలు వెలుగులోకి రావాలంటే విజిలెన్స్ లేదా ఉన్నత స్థాయి, ఏసిబి విచారణ అవసరమని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే సమయపాలన లోపం,పనితీరుపై విమర్శలు ఎదుర్కొంటున్న వరంగల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఇప్పుడు కొత్త వివాదంలో చిక్కుకోవడం ఆందోళన కలిగిస్తోంది. ప్రభుత్వం స్పందించి నిజానిజాలు బయటపెట్టి,పారదర్శకతకు హామీ ఇస్తుందా..?? లేక గుసగుసలుగానే మిగిలిపోతాయా అనే అనుమానం కలగమానదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి క్షేత్ర స్థాయిలో జరిగే అవినీతి ఆరోపణలపై దర్యాప్తు చేపట్టి చట్ట పరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది మరి.

Printed Published and owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao RNI Title Code :- RNI TELTEL/2024/89620